ప్రభాతనవ

సింగిడి

SINGIDI
తెలుగు దినపత్రిక

ప్రతి రంగూ ఓ నిజం

singidinews.com

గురువారం 22 అక్టోబర్ 2026 | సంపుటి: 1 | సంచిక: 125 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

ఢిల్లీలో మళ్లీ వాయు కాలుష్యం

అమల్లోకి వచ్చిన గ్రాఫ్ స్టేజ్1 ఆంక్షలు...

కాలుష్య నియంత్రణ చర్యలను ముమ్మరం చేయాలని అధికారులకు సూచన

2





2

జాతీయ భద్రతను

పరిరక్షించడంలో కేంద్రం విఫలం

మణిపుర్ హింసాకాండపై కాంగ్రెస్ ఖర్గే



2

పోలీస్ అమరవీరుల కుటుంబాల సంక్షేమానికి

అత్యధిక ప్రాధాన్యం

పోలీస్ శాఖలో 7,437 పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చాం : సీఎం రేవంత్ రెడ్డి

శాంతి భద్రతలు బాగుంటేనే రాష్ట్రంలో అభివృద్ధి వేగంగా ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అమరవీరుల కుటుంబాల సంక్షేమానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రజల ప్రాణాలకు రక్షణగా నిలుస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు తెలంగాణ ప్రభుత్వం ఘనంగా నివాళులర్పించింది. వారి కుటుంబాలకు అండగా ఉంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు.

పోలీస్ అమరవీరుల కుటుంబాలకు అందించే పరిహారాన్ని భారీగా పెంచామని వెల్లడించారు. 2028 నాటికి పోలీస్ శాఖలో అన్ని ఖాళీలను భర్తీ చేస్తామని ప్రకటించారు. హైదరాబాద్ గోషామహల్ స్టేడియంలో జరిగిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమంలో మహిళా భద్రత, డ్రగ్స్ గంజాయి సైబర్ నేరాల కట్టడి, కల్తీ ఆహారంపై ప్రభుత్వ చర్యలపై సీఎం వివరాలు వెల్లడించారు.

హైదరాబాద్, అక్టోబర్ 21 (సింగిడి)



నగరవాసుల తిరుగు ప్రయాణం

పంతంగి వద్ద భారీగా వాహనాల రద్దీ!

2

బరితెగించిన భారతి...

టాస్క్‌ఫోర్స్ తీసింది గోతి

మంగళపల్లిలో పీడీఎస్ బియ్యం దందా

న్యూ బన్సల్ రైస్ ఇండస్ట్రీస్‌లో 829 బస్తాల గుర్తింపు

ఫోర్టిఫైడ్ బియ్యంగా నిర్ధారణ.. కొనుగోళ్లు, సరఫరాలపై దర్యాప్తు కోరిన అధికారులు

పేదల బియ్యాన్ని బు(మె)క్కుతున్న వారిపై టాస్క్ ఫోర్స్ కొరడా ఝుళిపించింది.భారతి ఇండస్ట్రీస్ కు గుయ్యి చూపించింది. పేదలకు అందాల్సిన పీడీఎస్ బియ్యం అక్రమ కొనుగోళ్లు, నిల్వల వ్యవహారం రంగారెడ్డి జిల్లా మంగళపల్లిలో వెలుగులోకి వచ్చింది.

(ఇబ్రహీంపట్నం -సింగిడి)







సిద్దిపేట జిల్లా నుంచి సరఫరా అయినట్లు చెబుతున్న బియ్యం నిల్వలపై సివిల్ సప్లైస్ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు కొరడా ఝుళిపించారు. న్యూ బన్సల్ రైస్ ఇండస్ట్రీస్‌లో 778 బస్తాలతోపాటు, అక్కడికి వచ్చిన లారీలో మరో 51 బస్తాలు కలిపి మొత్తం 829 బస్తాలను గుర్తించారు. నమూనాల పరీక్షల్లో ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్ (ఎఫ్‌ఆర్‌కే) ఉన్నట్లు తేలడంతో కొనుగోళ్లు, సరఫరాల వెనుక ఎవరున్నారు? బియ్యం నిల్వలకు ఆధారాలేమిటి? అన్న కోణాల్లో విచారణకు అధికారులు ఫిర్యాదు చేశారు.

భారతి నుండే సరఫరా

మిల్లర్ గీతేష్ బన్సల్ వాంగ్మూలం ప్రకారం, సిద్దిపేట జిల్లా భూంపల్లి మండలం మోతే గ్రామంలోని భారతి ఇండస్ట్రీస్ నుంచి బియ్యం కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. సరఫరా వివరాలు, కొనుగోలు పత్రాలపై మరింత విచారణ జరగాల్సి ఉంది. పీడీఎస్ రైస్ (కంట్రోల్) ఆర్డర్–2016లోని క్లాజ్ 17(e) ఉల్లంఘన జరిగినట్లు ఆరోపిస్తూ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గీతేష్ బన్సల్, సరఫరాకు సంబంధించి పేర్కొన్న శ్రీరామ్ లోహియా, భారతి ఇండస్ట్రీస్ యజమాని కపర్తి నాగభూషణం పాత్రపై విచారణ జరిపి, తప్పు నిర్ధారణైతే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వ్యవహారంలో అక్రమాలు జరిగినట్లు తుది నిర్ధారణ కావాల్సి ఉంది.

లారీలోనూ బియ్యం

అక్టోబర్ 20న నిర్వహించిన తనిఖీల్లో మిల్లులో 50 కిలోల బరువున్న 677 బస్తాలు, 25 కిలోల బరువున్న 101 బస్తాలు గుర్తించారు. అదే సమయంలో వచ్చిన టీఎస్-03-యూబీ-3399 నంబరు గల లారీలో మరో 51 బస్తాలు లభించాయి. మొత్తం 829 బస్తాల నమూనాల్లో ఎఫ్‌ఆర్‌కే ఉన్నట్లు పరీక్షల్లో నిర్ధారణ అయిందని అధికారులు ఫిర్యాదులో పేర్కొన్నారు.



మైసూరు దసరా ఉత్సవాలు

ప్రత్యేక ఆకర్షణగా సీఎం రేవంత్ రెడ్డి

కర్ణాటక రాష్ట్రంలో అత్యంత వైభవంగా నిర్వహించే మైసూరు దసరా ఉత్సవాల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా జంబూ సవారీలో అందంగా అలంకరించిన ఏనుగుపై బంగారు అంబారీలో కొలువుదీరిన చాముండేశ్వరీ అమ్మవారి ఉత్సవమూర్తిని సీఎం దర్శించుకున్నారు. కన్నడ సంస్కృతిని ప్రతిబింబించే జానపదకళాకారులు, సంగీత, నృత్య బృందాలు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఈ ఊరేగింపులో పాల్గొన్నాయి.

మైసూరు, అక్టోబర్ 21 (సింగిడి)



2



కుట్రల్ని సహించం

దేశం కోసం ఏకం కావాలి

ప్రధాని మోదీ

దేశాన్ని విభజించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. అలాంటి వారిని వదిలిపెట్టేదిలేదన్న సంకల్పం తీసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. శత్రువులను దేశమంతా కలిసికట్టుగా ఎదుర్కోవాలని సూచించారు. తూర్పు దిల్లీలో జరిగిన దసరా వేడుకల్లో ప్రధాని పాల్గొని ప్రసంగించారు. ‘‘దసరా అనేది చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక. శత్రువు ఎంత శక్తిమంతుడైనా సత్యం, మానవతతో నిలబడినప్పుడు అంతిమ విజయం మనదే అవుతుంది. భారతీయ తాత్విక చింతనలో దసరా స్ఫూర్తి ఎప్పటికీ అంతర్భాగంగా ఉంటుంది. దసరా వేడుకలు దేశమంతటినీ ఏకం చేస్తాయి. సుపరిపాలనకు రామరాజ్యం విజయవంతమైన నమూనా. మనందరి ముందు వికసిత్ భారత్ అనే లక్ష్యం ఉంది.

న్యూఢిల్లీ, అక్టోబర్ 21 (సింగిడి)

2

ఏపీలో 100 మున్సిపాలిటీల ఎన్నికలకు

తాత్కాలిక బ్రేక్

సుప్రీంకోర్టు ఆదేశాలతో ఎస్ఈసీ నిర్ణయం

నామినేషన్ల అడ్డగింతపై వైసీపీ వేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టులో విచారణ

ఫిర్యాదులు వచ్చిన చోట్ల వాటిని పరిశీలించి, తగిన నిర్ణయం తీసుకోవాలన్న సుప్రీంకోర్టు

ఎన్నికల ప్రక్రియపై గురువారం తుది ఉత్తర్వులు జారీ చేయనున్న ఎస్ఈసీ



2

తెలంగాణకు బీసీ సీఎం.. కానీ ఇప్పుడే కాదు

బీసీ వ్యక్తి సీఎం కావడానికి డెడ్‌లైన్ ఏమీ లేదన్న మహేశ్ గౌడ్

కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణకు బీసీ సీఎం సాధ్యమని వ్యాఖ్య



2

తెలంగాణకు బీసీ వర్గానికి చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి కావడానికి ఎలాంటి గడువులు లేవని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఏదో ఒక రోజు కాంగ్రెస్ పార్టీ ద్వారానే బీసీ నేత ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

హైదరాబాద్, అక్టోబర్ 21 (సింగిడి)

పిటిషన్ల పేరుతో ఎన్నికలు, అభివృద్ధిని

అడ్డుకుంటోన్న వైసీపీ

జనసేన, బీజేపీలతో సమన్వయం చేసుకోవాలని నేతలకు సూచన

క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి వెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపు



స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్టీ శ్రేణులకు కీలక దిశానిర్దేశం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, అభ్యర్థులు, బూత్ స్థాయి కార్యకర్తలతో బుధవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాజకీయాల్లో జగన్ లాంటి 'క్రిమినల్ లిటిగెంట్లు' ఉండటం అత్యంత ప్రమాదకరమని వ్యాఖ్యానించారు.

- విజయవాడ, అక్టోబర్ 21 (సింగిడి)

2



నన్నడిగితే ఎలా..

నేనేం ట్రావెల్ ఏజెంట్‌ను కాదు'

రాహుల్‌గాంధీ ఫారిన్ టూర్‌పై శశిథరూర్

2

మద్యం అమ్మకాల జోరు

తెలంగాణలో 19 రోజుల్లోనే రూ.2,054 కోట్లు

గత ఏడాదితో పోలిస్తే 37.02 శాతం వృద్ధి

బీర్ల అమ్మకాల్లో 41 శాతానికి పైగా పెరుగుదల

30.37 లక్షల కేసులకు చేరిన బీర్ల విక్రయాలు

అక్టోబర్ 19న రూ.303.40 కోట్ల విక్రయాలు



2



మైసూరు
దసరా ఉత్సవాలు

కర్ణాటక సీఎం డీకే శివకుమార్ ఆహ్వానం మేరకు రేవంత్ రెడ్డి మైసూరు దసరా ఉత్సవాల్లో పాల్గొన్నారు. కేరళం ముఖ్యమంత్రి వీడీ సతీశన్ సహా దేశ, విదేశాలకు చెందిన ప్రముఖులతో కలిసి రేవంత్ రెడ్డి ఆ ఉత్సవాలను వీక్షించారు. మైసూరు రాజభవనం ముందు జరిగిన దసరా వేడుకల్లో పాల్గొనడానికి ముందు సీఎం రేవంత్ రెడ్డి చాముండేశ్వరి ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

'అభిమన్యు'పై అమ్మవారు

అందరి జీవితాల్లోనూ సుఖశాంతులను, సమృద్ధిని, సౌభాగ్యాన్ని తీసుకురావాలని ప్రార్థించానని రేవంత్ రెడ్డి ఎక్స్ వేదికగా తెలిపారు. మరోవైపు ఇవాళ మైసూరు రాజ భవనంలో దసరా వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. చాముండేశ్వరీ అమ్మవారికి రాజవంశీయుల ప్రత్యేక పూజలు నిర్వహించిన తరువాత బంగారు అంబారీలో అమ్మవారి విగ్రహాన్ని అభిమన్యు ఏనుగుపై చేర్చారు. ఇతర ఏనుగులు వెంటరాగా అమ్మవారి ఊరేగింపు వైభవంగా ప్రారంభమైంది. ఈ వేడుకను తిలకించేందుకు అధికార పార్టీ నాయకులు, అధికారులు, సామాన్యులే కాకుండా పర్యాటకులు భారీగా తరలివచ్చారు. సుమారు 3 గంటల పాటు ఈ వేడుక కొనసాగింది.

కుట్రల్ని సహించం

ఈ లక్ష్య సాధనకు రాముడి నుంచి స్ఫూర్తి పొందాలి. కష్టాలు మన ప్రయాణాన్ని అడ్డుకోలేవని శ్రీరాముడే ప్రవచించారు. రామరాజ్యంలో ఎవరిపట్ల వివక్ష ఉండదు. అందరికీ సమాన అవకాశాలు, న్యాయం లభిస్తాయి. అధికారం అంటే పాలించడం కాదు.. ప్రజా సంక్షేమాన్ని చేకూర్చడం.. ఇదే శ్రీరాముడి ఆదర్శం'' అని మోదీ తెలిపారు. దేశ ప్రయోజనాల కోసం అన్ని సంస్థలు, రాజకీయ పార్టీలు ఏకం కావాలని, శత్రువులపై కలిసి పోరాడాలని ఈ సందర్భంగా ప్రధాని పిలుపునిచ్చారు. ఎదురయ్యే సంక్షోభం ఎంత పెద్దదైనా లేదా ఎంత కష్టమైనదైనా సరే.. ఎవరూ ఇతరులపై ఆధారపడి కూర్చోకుండా తమ సొంత శక్తిని గుర్తుంచుకోవాలన్నారు. సంకల్పాన్ని శక్తిగా మార్చుకొని కఠోర శ్రమతో పరిష్కార మార్గాలు కనుగొనాలని సూచించారు.

తెలంగాణకు బీసీ సీఎం..
కానీ ఇప్పుడే కాదు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన, సంక్షేమ పథకాల అమలు అద్భుతంగా ఉందని మహేశ్ గౌడ్ ప్రశంసించారు. ఈ పనితీరుతో కాంగ్రెస్ ప్రభుత్వం 2034 వరకే కాదని, 2039 వరకు కూడా అధికారంలో ఉంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తల్లో భరోసా నింపేందుకే రేవంత్ రెడ్డి 2034 వరకు తానే సీఎంగా ఉంటానని చెప్పారని, అందులో తప్పేమీ లేదని అన్నారు. వచ్చే టర్మ్‌లో మళ్లీ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయినా తమకు ఎలాంటి తొందర లేదని, భవిష్యత్తులో బీసీ నేతకు అవకాశం వస్తుందని పేర్కొన్నారు.
బీసీ సీఎం నినాదం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచన అని మహేశ్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించలేమని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పార్టీ బీసీని ముఖ్యమంత్రిని చేయగలదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ పదవులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పెద్దపీట వేసిందని గుర్తు చేశారు. కొండా సురేఖ విషయంలో ఆమె కుమార్తె సుస్మిత తొందరపడి వ్యవహరించారని ఆయన అభిప్రాయపడ్డారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలంగా ఉందని, రాష్ట్రంలో బీజేపీకి భవిష్యత్తు లేదని అన్నారు.

ఏపీలో 100 మున్సిపాలిటీల ఎన్నికలకు
తాత్కాలిక బ్రేక్

ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల (మున్సిపాలిటీ) ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) తాత్కాలికంగా నిలిపివేసింది. రాష్ట్రంలోని మొత్తం 100 పట్టణ స్థానిక సంస్థలకు సంబంధించి తదుపరి ఎన్నికల ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని ఆదేశిస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సుప్రీంకోర్టు వెలువరించిన ఆదేశాల నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.
తమ పార్టీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, నామినేషన్ల గడువును పొడిగించాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం, ఎన్నికల ప్రక్రియ మొత్తాన్ని వాయిదా వేయడానికి నిరాకరించినప్పటికీ, నామినేషన్ల దాఖలులో అడ్డంకులు ఎదురైనట్లు ఫిర్యాదులు అందిన ప్రాంతాల్లో క్షుణ్ణంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని ఎస్ఈసీని ఆదేశించింది. ఈ అంశంపై గురువారం లోగా స్పష్టత ఇవ్వాలని సూచించింది.
సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా ఈ తాత్కాలిక నిలిపివేత నిర్ణయం తీసుకున్నారు. సంబంధిత ప్రాంతాల్లోని క్షేత్రస్థాయి పరిస్థితులపై సమగ్ర నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు. ఆ నివేదికలు అందిన అనంతరం వాటన్నింటినీ పరిశీలించి, గురువారం (అక్టోబరు 22) తుది ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

పిటిషన్ల పేరుతో ఎన్నికలు, అభివృద్ధిని
అడ్డుకుంటోన్న వైసీపీ

తానే విధ్వంసానికి పాల్పడి, తానే కోర్టుకు వెళ్లే వికృత ఆలోచనలు జగన్‌కే వస్తాయని చంద్రబాబు అన్నారు. వైసీపీని 'గొడ్డలి పార్టీ'గా అభివర్ణిస్తూ, అభివృద్ధిని, ఎన్నికలను అడ్డుకోవడమే ఆ పార్టీ పనిగా పెట్టుకుందని విమర్శించారు. కేవలం స్థానిక ఎన్నికలనే కాకుండా, మెగా డీఎస్సీ, అమరావతి, పోలవరం వంటి కీలక ప్రాజెక్టులను అడ్డుకునేందుకు వైసీపీ నేతలు వందల సంఖ్యలో పిటిషన్లు వేశారని ఆరోపించారు. ఓటరు జాబితా, బీసీ రిజర్వేషన్లపైనా కోర్టులకు వెళ్లి ఎన్నికల ప్రక్రియను అడ్డుకున్నారని గుర్తుచేశారు. స్థానిక ఎన్నికల్లో జనసేన, బీజేపీలతో సమన్వయం చేసుకుంటూ కూటమి అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా పనిచేయాలని చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తాము మంచి అభ్యర్థులను ఎంపిక చేస్తుంటే, వైసీపీ మాత్రం విధ్వంసకారులను బరిలోకి దించుతోందని ఆరోపించారు. బెంగళూరులో కూర్చొని జగన్ విధ్వంస రచనలు చేస్తున్నారని, ఇతర రాష్ట్రాల నుంచి గుండాలను దించేందుకు కుట్రలు పన్నుతున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ప్రచారానికి వారం రోజులే సమయం ఉందని, ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలోకి వెళ్లి ప్రజలతో మమేకం కావాలని సూచించారు. ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజలకు వివరిస్తూనే, వైసీపీ అరాచకాలను, ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని కోరారు. వికృత మనస్తత్వం ఉన్నవారిని రాజకీయాలకు దూరంగా ఉంచాలని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

మద్యం అమ్మకాల జోరు

పండుగ సీజన్ ప్రారంభంలో అమ్మకాలు నెమ్మదిగా సాగినా, రెండో వారం నుంచి వేగం పుంజుకున్నాయి. అక్టోబర్ 16 నాటికి మొత్తం విక్రయాల విలువ రూ.1,527.85 కోట్లుగా ఉండగా, మరో మూడు రోజుల్లోనే రూ.2,000 కోట్ల మార్కును దాటింది. అక్టోబర్ 19 వరకు నమోదైన గణాంకాల ఆధారంగానే ఈ వివరాలను ఎక్సైజ్ శాఖ వెల్లడించింది.

జాతీయ భద్రతను పరిరక్షించడంలో కేంద్రం విఫలం

న్యూఢిల్లీ, అక్టోబర్ 21 (సింగిడి)

మణిపుర్‌లో కొనసాగుతున్న హింసాకాండపై కాంగ్రెస్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసింది. వ్యూహాత్మకంగా కీలకమైన సరిహద్దు రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడటంలో, రాజ్యాంగ హక్కులను పరిరక్షించడంలో, జాతీయ భద్రతను రక్షించడంలో బీజేపీ విఫలమైందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. ఇటీవల నలుగురు అమాయక పౌరులు హత్యకు గురికావడంపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మే 2023 నుంచి ఇప్పటివరకు 300 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, 24,530 మంది సహాయక శిబిరాల్లో దయనీయ పరిస్థితుల్లో జీవిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో శాంతిని పునరుద్ధరించేందుకు కేంద్రం తీసుకున్న చర్యలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

మళ్లీ రక్తసిక్తమైన మణిపుర్

మణిపుర్‌లో ఇటీవల జరిగిన హింసాకాండలో నలుగురు అమాయక పౌరులు దారుణంగా హత్యకు గురికావడాన్ని ఖర్గే ఖండించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బీజేపీ అసమర్థత వల్లే రాష్ట్రం మళ్లీ రక్తసిక్తమవుతోందని 'ఎక్స్' వేదికగా విమర్శించారు. మే 2023లో లోయ ప్రాంతానికి చెందిన మైతీ వర్గానికి, కొండ ప్రాంతానికి చెందిన కుకీ వర్గానికి మధ్య ప్రారంభమైన జాతి ఘర్షణలు రాష్ట్రాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టాయని పేర్కొన్నారు. ఈ హింసాకాండలో ఇప్పటివరకు కనీసం 306 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 49 మంది ఆచూకీ తెలియకుండా పోయిందని, వేలాది మంది నిరాశ్రయులయ్యారని తెలిపారు. ఈ ఘర్షణల



ప్రభావాన్ని మహిళలు, పిల్లలు, బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలు ఇప్పటికీ ఎదుర్కొంటున్నాయని ఖర్గే అన్నారు. వేలాది మంది తమ ఇళ్లకు దూరంగా సహాయక శిబిరాల్లో జీవించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతిని నెలకొల్పడం, బాధితులకు భద్రత కల్పించడం, నిర్వాసితులను తిరిగి వారి నివాసాలకు చేర్చడం వంటి అంశాల్లో కేంద్రం బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.

మోదీ, అమిత్ షాకు మూడు ప్రశ్నలు

మణిపుర్ పరిస్థితులపై ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా మూడు కీలక ప్రశ్నలకు సమాధానం చెప్పాలని ఖర్గే డిమాండ్ చేశారు. జూన్ 2023లో అమిత్ షా ఏర్పాటు చేసిన శాంతి కమిటీకి ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిని పునరుద్ధరించడానికి, పౌరులను రక్షించడానికి, భద్రతాపరమైన సవాళ్లను పరిష్కరించడానికి ఇప్పటివరకు తీసుకున్న నిర్దిష్ట చర్యలేమిటని నిలదీశారు. సుప్రీంకోర్టు నియమించిన జస్టిస్ గీతా మిట్టల్ కమిటీ సిఫార్సులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో వెల్లడించాలని కోరారు. సహాయక శిబిరాల్లో 31 అసహజ మరణాలు సంభవించినట్లు సుప్రీంకోర్టు వెల్లడించినప్పటికీ, వేలాది మంది ఇంకా ఎందుకు నిరాశ్రయులుగా ఉన్నారని ఖర్గే ప్రశ్నించారు. మహిళలు, పిల్లలు, నిర్వాసిత కుటుంబాల భద్రత, గౌరవం, పునరావాసం కోసం ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. మూడేళ్లకు పైగా కాలం గడిచినా పరిస్థితుల్లో ఆశించిన మార్పు రాలేదని విమర్శించారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించడం, ముఖ్యమంత్రిని మార్చడం, తిరిగి బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం వంటి రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నా శాంతి నెలకొనలేదని ఖర్గే అన్నారు. హింస ప్రారంభమైన తర్వాత దాదాపు 29 నెలల పాటు మణిపుర్‌లో అడుగుపెట్టని ప్రధాని మోదీ, పార్లమెంటులో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ఇంతటి పాలనా వైఫల్యానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. అమాయకుల ప్రాణాలు మరెన్ని కోల్పోతే కేంద్రం స్పందిస్తుందని నిలదీశారు. మణిపుర్‌కు న్యాయం, గౌరవం, రాజ్యాంగ హక్కులు, శాశ్వత శాంతి లభించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర భద్రత, స్థిరత్వాన్ని బీజేపీ తన రాజకీయ ప్రయోజనాల కోసం పణంగా పెట్టకూడదని హెచ్చరించారు. అలాగే మహిళా రిజర్వేషన్ల విషయంలో ప్రధాని మోదీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఖర్గే ఆరోపించారు. డీలిమిటేషన్ గురించి వేచి చూడకుండా ప్రస్తుతం సభలో ఉన్నవారితోనే 33శాతం రిజర్వేషన్లు అములు చేయొచ్చని ఆయన స్పష్టం చేశారు.

పీఎం-దక్ష్ పథకంపైనా కాంగ్రెస్ విమర్శలు

ఇదిలా ఉండగా, అర్హులైన వర్గాలకు నైపుణ్య శిక్షణ ఇచ్చే పీఎం-దక్ష్ పథకం అమలులో లోపాలున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ బుధ వారం కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించింది. ఈ పథకం అమలులో తీవ్రమైన లోపాలు ఉన్నాయని పేర్కొంటూ వచ్చిన ఓ మీడియా నివేదికకు సంబంధించిన స్క్రీన్ షాట్‌ను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ 'ఎక్స్'లో పంచుకున్నారు. షెడ్యూల్డ్ కులాలు, ఇతర వెనుకబడిన తరగతులు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, డీనోటిఫైడ్, సంచార, అర్ధ సంచార జాతులు, పారిశుధ్య కార్మికులకు నైపుణ్య శిక్షణ అందించి ఉపాధికి అర్హులుగా చేయడమే పీఎం-దక్ష్ పథకం లక్ష్యం. అయితే గత రెండేళ్లుగా ఈ పథకం అమలు కాలేదని, గత సంవత్సరాల్లో కేటాయించిన బడ్జెట్ కూడా పూర్తిగా ఖర్చు చేయలేదని జైరామ్ రమేశ్ ఆరోపించారు. అణగారిన వర్గాలకు నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన పథకాన్ని ప్రభుత్వం కాగితాలకే పరిమితం చేసిందని విమర్శించారు.
పథకానికి గొప్ప పేరు పెట్టినప్పటికీ క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించడం లేదని, ప్రభుత్వం ప్రకటనలకే పరిమితమైందని వ్యాఖ్యానించారు. ఒక పథకాన్ని కూడా సమర్థవంతంగా అమలు చేయలేని ప్రభుత్వానికి అధికారంలో కొనసాగేందుకు నైతిక హక్కు లేదని అన్నారు. మోదీ ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం తగ్గిపోయిందని, ప్రభుత్వం గడువు సమీపిస్తోందని విమర్శించారు. 2024 ఎన్నికల్లో 240 స్థానాలకే పరిమితమైన బీజేపీ ప్రభుత్వం, అణగారిన వర్గాల ప్రయోజనాలను నిర్లక్ష్యం చేస్తోందా? అని ప్రశ్నించారు.

పోలీస్ అమరవీరుల కుటుంబాల
సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం



అమరవీరులకు నివాళులర్పించిన సీఎం



పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా హైదరాబాద్ గోషామహల్ స్టేడియంలో నిర్వహించిన పోలీస్ స్మారక పరేడ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డీజీపీ సీవీ ఆనంద్‌తోపాటు పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం వారి సేవలను స్మరించుకుంటూ రూపొందించిన 'అమరులు వారు' పుస్తకాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అమరులకు నివాళి అర్పించిన అనంతరం ప్రసంగించిన సీఎం, పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం భావోద్వేగంతో కూడిన రోజని పేర్కొన్నారు. సమాజం కోసం ప్రాణాలను త్యాగం చేసిన పోలీసుల సేవలను మరువలేమన్నారు. అమరుల కుటుంబాల్లో ఏర్పడిన లోటును ఎవరూ భర్తీ చేయలేరని అయితే వారి కుటుంబాలు ఒంటరివి కావని, తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ, సమాజం అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు.

పరిహారం భారీగా పెంపు

పోలీసుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని సీఎం వెల్లడించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల కుటుంబాలకు అందించే పరిహారాన్ని భారీగా పెంచినట్లు తెలిపారు. కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలకు కోటి రూపాయలు, ఎస్ఐలు, ఇన్‌స్పెక్టర్లకు కోటి 25 లక్షలు, డీఎస్పీ, అదనపు ఎస్పీ స్థాయి అధికారులకు కోటి 50 లక్షల రూపాయలు, ఎస్పీ, ఐపీఎస్ అధికారులకు రెండు కోట్ల రూపాయల పరిహారం అందించేలా నిర్ణయం తీసుకున్నామని వివరించారు. ఇది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని అమర వీరుల కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చే గౌరవమని సీఎం స్పష్టం చేశారు. హోంగార్డుల కుటుంబాలకు ప్రస్తుతం అందిస్తున్న ఐదు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియాను పది లక్షలకు పెంచాలని డీజీపీని ఆదేశిస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధికి శాంతిభద్రతల పరిరక్షణ అత్యంత ముఖ్యమని సీఎం పేర్కొన్నారు.

మహిళల భద్రతకు ప్రాధాన్యం

పోలీస్ శాఖను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మరో ఐదు వేల ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టామని, 2028 నాటికి పోలీస్ శాఖలో అన్ని ఖాళీలను భర్తీ చేస్తామని ప్రకటించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 112 మంది డీఎస్పీలను నియమించామని వెల్లడించారు. ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమించడం ద్వారా వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించే ప్రయత్నం చేశామన్నారు. హోంగార్డు నుంచి డీజీపీ స్థాయి వరకు పోలీసు సిబ్బంది పిల్లలకు విద్యావకాశాలు కల్పించేందుకు యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. సైబర్ నేరాలు, డ్రగ్స్, కల్తీ ఆహారంపై ఉక్కుపాదం మోపి మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు సీఎం స్పష్టం చేశారు. "పోలీస్ శాఖను బలోపేతం చేసేందుకు ఈ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 4,773 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చాం. పోలీసుశాఖలో మొత్తం 7,437 పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చాం. మిగతా ఖాళీలను కూడా విడతల వారీగా భర్తీ చేస్తాం. 2028 నాటికి పోలీసుశాఖలో అన్ని ఖాళీలను భర్తీ చేస్తాం. పోలీసు శాఖలో ఎక్స్‌గేషియాను హోదా ఆధారంగా రూ.కోటికి పైగా పెంచాం" -రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి

డ్రగ్స్ నియంత్రణలో ఈగల్ సేవలు భేష్

యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. డ్రగ్స్ నియంత్రణలో ఈగల్ ఫోర్స్ పనితీరును, డీజీపీని అభినందించారు. కల్తీ ఆహారాన్ని అరికట్టేందుకు టీజీ సేఫ్ వ్యవస్థను తీసుకొచ్చామని వెల్లడించారు. మహిళల భద్రతకు షీ టీమ్స్ సేవలను కొనసాగిస్తూ మరిన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మహిళలు, చిన్నారులకు సంబంధించిన కేసుల్లో పోలీసులు మరింత సున్నితంగా వ్యవహరించాలని, బాధితులకు న్యాయం అందించడంలో జాప్యం జరగకూడదని సీఎం సూచించారు. మహిళల భద్రత కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు.



ఏపీలో 100 మున్సిపాలిటీల
ఎన్నికలకు తాత్కాలిక బ్రేక్

ఏపీలోని మున్సిపల్ ఎన్నికల్లో నామినేషన్ల దాఖలుకు గడువు పొడిగించాలన్న వైకాపా పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగిన విషయం తెలిసిందే. తమ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నారని ఆ పార్టీ తన పిటిషన్‌లో పేర్కొంది. దీనిపై విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం.. నామినేషన్ల గడువు మొత్తంగా వాయిదాకు, పొడిగింపునకు నిరాకరించింది. నామినేషన్ల దాఖలును అడ్డుకున్నారని ఫిర్యాదు చేసిన చోటే పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని ఎస్ఈసీని ఆదేశించింది. దీనిపై గురువారంలోపు నిర్ణయం తీసుకోవాలని ఎస్ఈసీకి సూచించింది. ఈ నేపథ్యంలోనే వంద చోట్ల ఎన్నికల ప్రక్రియను నిలిపివేస్తూ నిర్ణయం తీసుకుంది.

నన్నడిగితే ఎలా..

న్యూఢిల్లీ, అక్టోబర్ 21 (సింగిడి)

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ విదేశీ పర్యటనపై మీడియా అడిగిన ప్రశ్నకు కాంగ్రెస్ పార్టీకే చెందిన సీనియర్ నేత, ఎంపీ శశి థరూర్ ఆసక్తిక రంగా స్పందించారు. ఆయన పర్యటన గురించి తనను ప్రశ్నించడంలో అర్థం లేదని, తానేమీ ట్రావెల్ ఏజంట్ ను కాదని థరూర్ తనదైన శైలిలో సమాధానం ఇచ్చారు. ఇవాళ తిరువనంతపురంలో శశిథరూర్ విలేకరులతో మాట్లాడుతూ.. 'నేను ట్రావెల్ ఏజెంట్‌ను కాదు. ఆ ప్రశ్న నన్ను అడగటంలో అర్థం లేదు. నేను ఢిల్లీ వదిలి ఇక్కడికి ఎందుకు వచ్చాను..? ప్రతి వ్యక్తికి కొన్ని బాధ్యతలు ఉంటాయి. కాబట్టి నేను ఆ విషయంపై వ్యాఖ్యానించలేను' అని అన్నారు. సీతాసీ జ్ఞానేశ్ కుమార్‌కు, సర్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలో విపక్షాలు ఆందోళనలు చేస్తున్న సమయంలో రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లడంపై బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది. రాహుల్ వియత్నాం వెళ్తున్న విమానంలో ఉన్నారంటూ ఒక వీడియోను బీజేపీ 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేసింది. నిరసనలతో బాగా అలసిపోయినందువల్లే ఆయనకు విశ్రాంతి అవసరమైందని బీజేపీ నేత షానవాజ్ హుస్సేన్ ఎద్దేవాచేశారు. అయితే రాహుల్ గాంధీ పర్యటనను కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్ సమర్థించారు. ప్రధాని సహా ఇతర నేతలు విదేశాలకు వెళ్లడం లేదా అని ప్రశ్నించారు. ఈ విషయాన్ని ఎందుకు రాద్ధాంతం చేస్తున్నారని నిలదీశారు. విదేశాల్లో రాహుల్ విద్యార్థులతో, మేధావులతో సమావేశమవుతారని, ఇంటర్వ్యూలు ఇస్తారని చెప్పారు

ఢిల్లీలో మళ్లీ వాయు కాలుష్యం

న్యూఢిల్లీ, అక్టోబర్ 21 (సింగిడి)

దేశ రాజధాని దిల్లీతో పాటు పరిసర ప్రాంతాల్లో వాయు కాలుష్యం మరోసారి ఆందోళన కలిగిస్తోంది. గాలి నాణ్యత సూచీ దిగజారడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కాలుష్య నియంత్రణ చర్యలను వేగవంతం చేసేందుకు దిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జీఆర్ఏపీ) స్టేజ్-1ను తక్షణమే అమలు చేస్తున్నట్లు వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ (సీఏక్యూఎం) బుధవారం ప్రకటించింది. రానున్న రోజుల్లోనూ గాలి నాణ్యత ఇదే స్థాయిలో కొనసాగే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది.

ఒక్కరోజులోనే పెరిగిన కాలుష్యం

దిల్లీలో అక్టోబర్ 20న వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) 179గా నమోదైంది. ఇది 'మోస్తరు' కేటగిరీ పరిధిలోకి వస్తుంది. అయితే అక్టోబర్ 21న మధ్యాహ్నం 2 గంటలకు ఈ సూచీ 244కు చేరింది. దీంతో గాలి నాణ్యత 'పూర్' కేటగిరీలోకి వెళ్లింది. ఒక్కరోజు వ్యవధిలోనే కాలుష్య స్థాయిలు గణనీయంగా పెరగడం అధికారులను అప్రమత్తం చేసింది. భారత వాతావరణ విభాగం (ఐఎండీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియరాలజీ (ఐఐటీఎం) అంచనాల ప్రకారం, రానున్న రోజుల్లోనూ దిల్లీలో గాలి నాణ్యత 'పూర్' కేటగిరీలో కొనసాగే అవకాశాలున్నాయి. ఈ పరిస్థితిని సమీక్షించిన, భారత వాతావరణ శాఖ, ఇతర సంస్థలు కాలుష్యాన్ని మరింత పెరగకుండా నిరోధించేందుకు తొలి దశ చర్యలను అమలు చేయాలని నిర్ణయించింది.

జీఆర్ఏపీ స్టేజ్-1 ఎందుకు?

వాయు కాలుష్యం పెరుగుతున్నప్పుడు పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి దశలవారీగా చర్యలు చేపట్టే విధానమే గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్. గాలి నాణ్యత ఆధారంగా వివిధ దశల్లో నియంత్రణ చర్యలను అమలు చేస్తారు. ప్రస్తుతం దిల్లీలో ఏక్యూఐ 244కు చేరడంతో తొలి దశను అమల్లోకి తీసుకొచ్చారు. ఈ నిర్ణయం దిల్లీకి మాత్రమే పరిమితం కాకుండా మొత్తం జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్) పరిధిలో వర్తిస్తుందని సీఏక్యూఎం స్పష్టం చేసింది. సంబంధిత ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, అమలు చేసే ఇతర విభాగాలు తమ పరిధిలోని చర్యలను పర్యవేక్షించాలని ఆదేశించింది. ఇప్పటికే అమల్లో ఉన్న కాలుష్య నియంత్రణ మార్గదర్శకాలను మరింత కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించింది. గాలి నాణ్యత మరింత దిగజారకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని తెలిపింది. పౌరులు కూడా జీఆర్ఏపీ స్టేజ్-1లో సూచించిన



మార్గదర్శకాలను పాటించాలని కోరింది.

పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తాం

దిల్లీతో పాటు ఎన్‌సీఆర్‌లో గాలి నాణ్యతను అధికారులు నిరంతరం గమనిస్తారని సీఏక్యూఎం తెలిపింది. వాయు కాలుష్య స్థాయిలు, వాతావరణ శాఖలు వెల్లడించే భవిష్యత్ అంచనాలను బట్టి తదుపరి నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొంది. అవసరాన్ని బట్టి అదనపు చర్యలపై సమీక్ష ఉంటుందని వెల్లడించింది. కాలుష్యాన్ని నియంత్రించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఈ ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయి. జీఆర్ఏపీ తొలి దశ అమలుతో కాలుష్య నియంత్రణకు సంబంధించిన ప్రస్తుత చర్యలను ముమ్మరం చేయడంపై అధికారులు దృష్టి సారించనున్నారు.

గత పదేళ్లలో కాలుష్యం తీవ్ర సమస్య: మంత్రి

దిల్లీలో వాయు కాలుష్యంపై పర్యావరణ శాఖ మంత్రి మంజీందర్ సింగ్ సిర్సా ఆందోళన వ్యక్తం చ

21 నుండి ఆర్థిక సమ్మిళిత ప్రచారం

● కలెక్టర్ దీపక్ తివారి

వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 21(సింగిడి): ఆర్థిక శాఖ, ఆర్థిక సేవల విభాగం ఆదేశాలతో ఈ నెల 21 నుండి డిసెంబర్ 31వ తేదీ వరకు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థల పరిధిలో ఆర్థిక సమ్మిళిత సంతృప్త ప్రచారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. ఈ మేరకు వివరాలు వెల్లడించారు. ప్రధానమంత్రి జనధన్ యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాల కవరేజీని పెంచి, అర్హులైన ప్రతి ఒక్కరికీ బ్యాంకింగ్ భద్రత సేవలు అందేలా చూస్తామని పేర్కొన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ డేవిడ్ విల్సన్ జిల్లా స్థాయి నోడల్ అధికారిగా ప్రచారాన్ని సమన్వయం చేసి పర్యవేక్షిస్తారని తెలిపారు.

డీఆర్డీఏ, మెప్మా, జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్లు, మండల, గ్రామ స్థాయి అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించారు. ప్రజలు తమ గ్రామంలో నిర్వహించే శిబిరానికి అవసరమైన పత్రాలతో (ఆధార్, పాన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, మొబైల్ నంబరు తదితర పత్రాలు) హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.



చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతిక విజయదశమి

జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి



మేడ్చల్ కలెక్టరేట్, అక్టోబర్ 21(సింగిడి): చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతిరూపమే విజయదశమి అని జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ జిల్లా కలెక్టర్ శ్రీ మిక్కిలినేని మను చౌదరి, ఐఏఎస్ విజయదశమి పండగ సందర్భంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ప్రజలందరికీ జిల్లా కలెక్టర్ శ్రీ మిక్కిలినేని మను చౌదరి, హృదయపూర్వక విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ ప్రతీ ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులను, సంతోషాలను నింపాలని ఆకాంక్షించారు. దుర్గామాత ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో విలసిల్లాలని, ప్రజలందరూ ఈ పండుగను శాంతియుత వాతావరణంలో, ఆనందోత్సాహాల మధ్య సోదరభావంతో జరుపుకోవాలని, ప్రతి అడుగు విజయవంతం కావాలని కోరారు.

సైనికుడు మల్లేశం ఆత్మహత్యతో లక్ష్మీనారాయణపూర్‌లో విషాదం



వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 21(సింగిడి): వికారాబాద్ జిల్లాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. దేశ సరిహద్దులో దేశ రక్షణలో బాంబులకు బెదరని సైనికుడి గుండె ఎందుకు చదిరిందో ఏమో యాలాల్ మండలం లక్ష్మీనారాయణపూర్ గ్రామంలో దసరా పండుగ కోసం సెలవులపై ఇంటికి వచ్చిన ఓ ఆర్మీ జవాన్ బోయిని మల్లేశం (30) ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. మృతుడు ఆర్మీ జవాన్ గా దేశ సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తున్న ఆయన దసరా పండుగ సందర్భంగా సెలవులపై స్వగ్రామానికి వచ్చారు. ఆరు నెలల క్రితమే ఆయనకు వివాహం జరిగినట్లు తెలుస్తోంది. నిన్న రోజంతా కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపిన మల్లేశం, రాత్రి సమయంలో తన గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న మల్లేశం అకస్మాత్తుగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు. ఈ నేపథ్యంలో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న యాలాల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకున్నారు. ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

పండుగ సాయన్న జయంతి వేడుకల వాల్‌పోస్టర్ ఆష్కరించిన ఎమ్మెల్యే



వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 21(సింగిడి): తెలంగాణ వీరయోధుడు, ప్రజల హక్కుల కోసం పోరాడిన ధీరుడు పం పండుగ సాయన్న జయంతి వేడుకల గోడపత్రికను ఆవిష్కరించిన పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆవిష్కరించారు. తెలంగాణ వీరయోధుడు, ప్రజల హక్కుల కోసం పోరాడిన ధీరుడు పండుగ సాయన్న జయంతి వేడుకలను ఈ నెల 22వ తేదీన హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జయంతి వేడుకలకు సంబంధించిన గోడపత్రికను పరిగి ఎమ్మెల్యే,టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ (సర్) డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలో పండుగ సాయన్నకు ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. ఆయన పోరాట స్ఫూర్తి, ధైర్యసాహసాలు, ప్రజల పట్ల చూపిన అంకితభావం నేటి తరానికి ఆదర్శప్రాయమని అన్నారు. ప్రజల కోసం పోరాడిన పండుగ సాయన్న జీవిత చరిత్రను, ఆయన ఆశయాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ప్రతినిధులు, సభ్యులు, స్థానిక నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌లో ప్రతిభ చూపిన తేజస్ కుమార్‌ను

సన్మానించిన ఎంఎల్ఆర్ గ్రూప్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎంఎల్ఆర్. ఎమ్మెల్యే మర్రి





మల్కాజిగిరి, అక్టోబర్ 21(సింగిడి): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు చెందిన స్విమ్మింగ్ క్రీడాకారుడు టి.ఎస్.తేజస్ కుమార్ జాతీయ స్థాయిలో ప్రతిభ చూపి పతకాలు సాధించిన సందర్భంగా సోమవారం ఎంఎల్ఆర్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ శ్రీ మర్రి లక్ష్మారెడ్డి గారు, మల్కాజిగిరి శాసనసభ్యులు శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి ఆయనను ఘనంగా సన్మానించారు. జూనియర్ నేషనల్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఒక రజత పతకం, రెండు కాంస్య పతకాలు, అలాగే ఎస్‌జీఎఫ్ఐ పోటీల్లో ఒక కాంస్య పతకం సాధించి తేజస్ కుమార్ తన ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, తేజస్ కుమార్‌ను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు, తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. తేజస్ కుమార్ సాధించిన విజయాలు యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని వారు పేర్కొన్నారు.

చిట్టిగిద్ద గ్రామంలో వివాహిత మహిళ ఆత్మహత్య

పండగ పూట గ్రామంలో విషాదం



వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 21(సింగిడి): జిల్లా పరిధిలోని నవాబుపేట మండలం చిట్టిగిద్ద గ్రామానికి చెందిన సుమలత(27) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ ఐ గిరి కథనం ప్రకారం గ్రామానికి చెందిన అయ్యగాళ్ల సుమలత ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసికుని ఆత్మహత్య చేసుకుంది. సుమలతకు సుమారు 10 సంవత్సరాల క్రితం ఆయాగళ్ళ ఆశీర్వాదంతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ నెల 16వ తేదీన ఉదయం సుమలత కుమార్తె అనన్యశ్రీ ఇంటి ముందు ఆడుకుంటుండగా, ఉదయాన్నే ఎందుకు ఆడుకుంటున్నావని ఆమెను మందలించినట్లు సమాచారం. ఈ సమయంలో ఆ మాటలు విన్న వారి దయాదులైన, చిన్న అనిత భర్త ఆనందం కలిసి సుమలతను దూషించినట్లు సమాచారం. ఈ విషయాన్ని సుమలత తన భర్త ఆశీర్వాదానికి తెలియజేయగా, ఆయన కూడా ఆమెను మందలించడంతో ఈ పరిణామాల నేపథ్యంలో సుమలత తీవ్ర మనస్తాపానికి గురై ఉరివేసుకుంది. అది చూసిన తన భర్త ఉరి వేసుకున్న తాడును కోసి కొనఊపిరితో ఉన్న తన భార్యని దగ్గరలో ఉన్న గవర్నమెంట్ హాస్పిటల్ వికారాబాద్ కి తీసుకువచ్చిన కొద్దిసేపటికి మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. దసరా పండగ పూట ఈ విషాదం గ్రామస్తులను కలిచి వేసింది.

ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించండి

మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ల ఆదేశం



మేడ్చల్ కలెక్టరేట్, అక్టోబర్ 21(సింగిడి): ప్రజావాణిలో స్వీకరించిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్లు సంబంధిత అధికారులను ఆదేశించారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం 'ప్రజావాణి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. విజయేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి మాలతి హాజరై అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ సమస్యలపై బాధితులు, అర్జీదారుల నుంచి మొత్తం 23 దరఖాస్తులు నమోదయ్యాయి. అందిన వినతులపై సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందించి, ఆచరణాత్మకమైన చర్యలు తీసుకొని త్వరతగతిన సమస్యలను పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు అధికారులను ఆదేశించారు. బాధితులు సమర్పించిన అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా నిర్దిష్ట వ్యవధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలనా సిబ్బంది అర్జీదారులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించిన కలెక్టర్





వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 21(సింగిడి): జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం ఐ డి ఓ సి సమావేశం లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ప్రజల నుంచి 49 ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులు వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజా వాణికి వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రతి దరఖాస్తుపై తీసుకున్న చర్యల వివరాలను సమర్పించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, డి ఆర్ డి ఓ శ్రీనివాస్, జిల్లా అధికారులు తదితరులు ఉన్నారు.

చిట్టి ప్రకాష్ రెడ్డి సర్కిల్

ప్రారంభోత్సవంలో పాల్గొన్న పట్నం మహేందర్ రెడ్డి



వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 21(సింగిడి): పెద్దేముల్ మండల కేంద్రంలో కీర్తిశేషులు చిట్టెపు ప్రకాష్ రెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన సీపీఆర్ (సీపీర్) సర్కిల్‌ను తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రకాష్ రెడ్డి కుమారులు చిట్టి రాఘవేందర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డిలను అభినందించారు. అనంతరం ప్రకాష్ రెడ్డితో తనకున్న అనుబంధాన్ని, ఆయనతో కలిసి గడిపిన జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కీర్తిశేషులు ప్రకాష్ రెడ్డి సేవలను, జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలిపేలా సీపీఆర్ చౌరస్తాను ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు జాదవ్ దారాసింగ్, పెద్దేముల్ సర్పంచ్ డి.వై. నరసింహులు, పెద్దేముల్ మండల్ పిఎసిఎస్ చైర్మన్ ఎల్లారెడ్డి, తట్టెపల్లి పిఎసిఎస్ చైర్మన్ పి. మైపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాజీపూర్ నారాయణ రెడ్డి, శోభారాణి, పెద్దేముల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్, పెద్దేముల్ మండల్ సర్పంచులు నాగులపల్లి సర్పంచ్ నాగిరెడ్డి, మంబాపూర్ సర్పంచ్ భార్గవి శ్రీనివాస్, పెద్దెములు మాజీ సర్పంచ్ బాలప్ప మాజీ ఎంపీటీసీ కిషన్ రావు, రుద్రారం అంజిరెడ్డి, అడికిచర్ల జనార్దన్ రెడ్డి, నరేందర్ రెడ్డి, కోట్పల్లి మల్లేష్ మరియు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కుటుంబ సభ్యులు, అభిమానులు, మరియు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాల్లోని ప్రజల జీవనం అస్తవ్యస్తం

● వైతరణి నదిని తలపిస్తున్న భూగర్భ జలాలు
● పరిసర ప్రాంత ప్రజల నిత్య నరకయాతన శ్వాసకోశ జబ్బులు
● డంపింగ్ యార్డ్ ఎత్తివేతకు జేఏసీకి అండగా నిలవండి
● ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేత





జవహర్ నగర్, అక్టోబర్ 21(సింగిడి): డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాల్లోని ప్రజల జీవనం అస్తవ్యస్తంగా తయారైందని పరిసర ప్రాంతాల నీటి వనరులు వైతరణి నదిని తలపిస్తున్నాయని డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంత ప్రజలు నిత్యం నరకయాతన శ్వాసకోశ జబ్బులతో బాధపడుతున్నారని జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ పేర్కొన్నది. జవహర్ నగర్ లోని రాంకీ చెత్త డంపింగ్ యార్డ్‌ని శాశ్వతంగా ఎత్తివేయాలని విజ్ఞప్తి చేస్తూ జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఈసీఐఎల్,సైనికపురి, పార్టీ కార్యాలయాల్లో ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డికి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కి డంపింగ్ యార్డ్ వలన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. గత 20 సంవత్సరాలుగా జవహర్ నగర్ రాంకీ డంపింగ్ యార్డ్ చుట్టుపక్కల సుమారు 20 కిలోమీటర్ల పరిధిలోని ప్రాంతాలైన కాప్రా, దమ్మాయిగూడ, చర్లపల్లి ,నాగారం, ఘట్కేసర్, కీసర ప్రాంతాల్లోని ప్రజలు ప్రత్యక్షంగా 10 లక్షల మంది పరోక్షంగా 30 లక్షల మంది ప్రజలు ఈ డంపింగ్ యార్డ్ వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలియజేశారు. అహమ్మద్ గూడ, కార్మిక నగర్ ,శాంతినగర్, గబ్బిలాలపేట, ఈస్ట్ నందమూరి నగర్, అంబేద్కర్‌నగర్ లాంటి కాలనీల లోని చిన్న పిల్లలు వృద్దులు ఇండ్లలో ఉండలేని దారుణమైన పరిస్థితులు నెలకొని ఉన్నాయని వివరించారు. ఇకనైనా ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ డంపింగ్ యార్డ్ ను శాస్త్రీయమైన పద్ధతిలో శాశ్వతంగా మూసివేసి బయోమైనింగ్ ద్వారా శుభ్రపరచాలని డంపింగ్ యార్డ్ బాధిత ప్రాంతాల ప్రజలకు యుద్ధ ప్రాతిపదికన స్వచ్ఛమైన తాగునీరు వైద్య సదుపాయం కల్పించేలా ముఖ్యమంత్రి ప్రభుత్వ అధికారులు కృషి చేయాలని తెలిపారు. దీనికి ఉప్పల్ ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని ఉప్పల్ నియోజకవర్గ ప్రజలపై కూడా డంపింగ్ యార్డ్ ప్రభావం తీవ్రంగా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ షేక్షావలి, కన్వీనర్ ఉమామహేష్, కోశాధికారి శివ బాబు, వివిఎస్ బోను, దామోదర్ రెడ్డి, గడ్డం సదానందం, ఆంజనేయులు, బిర్రు యాక స్వామి, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ మహమ్మద్ పాషా మియా, టి. కలేశా, సునీత, మోనార్ దుర్గాప్రసాద్ శ్రవణ్ కుమార్, డంపింగ్ యార్డ్ బాధిత ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

జూన్‌పహాడ్‌లో కనకదుర్గమ్మకు మహా అన్నదానం



కోదాడ, అక్టోబర్ 21(సింగిడి): పాలకవీడు దసరా ఉత్సవాలు, దేవీ నవరాత్రుల సందర్భంగా పాలకవీడు మండలం జూన్‌పహాడ్ గ్రామంలో సోమవారం కనకదుర్గమ్మ విగ్రహం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదానం నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్‌వీ సుబ్బారావు, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మాలోతు మోతీలాల్ నాయక్, గ్రామ సర్పంచ్ కేలావత్ కిరణ్--కవిత కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్నదానం అన్ని దానాల్లోకెల్లా గొప్పదని, గ్రామస్థులంతా కలిసికట్టుగా దేవీ నవరాత్రులు, బతుకమ్మ వేడుకలు నిర్వహించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. దాతల సహకారంతో వివిధ రకాల వంటకాలతో అన్నదానం నిర్వహించిన కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కొత్తపల్లి శ్రీను, కొత్తూరి వెంకటేశ్వర్లు, కొమ్మరాజు చంద్రశేఖర్, వక్కుంతల వెంకన్న, గ్రామ పెద్దలు, మహిళలు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో భక్తి భావాన్ని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందిస్తాయి

● కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి



మల్కాజిగిరి, అక్టోబర్ 21(సింగిడి): దసరా శ్రీ నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో భక్తి భావాన్ని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందిస్తాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి అన్నారు. నేరేడ్ మెట్ డివిజన్ రేణుక నగర్ లోని సైనిక్ విహార్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గామాత అమ్మవారిని సోమవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి దర్శించుకున్నారు. అనంతరం నిర్వాహకులు ఏర్పాటుచేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలకు, నవరాత్రి ఉత్సవాల్లో ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవడం ఎంతో ఆనందాయకమని, నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సిహెచ్ మహేష్, మధుసూదన్ రెడ్డి, వి రాజు, ఎన్ కృష్ణ, నారాయణ రెడ్డి, ఎన్ సుధారాణి, జాన్, భాస్కర్, సైనిక్ విహార్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల కనకదుర్గ ఆలయంలో మహిషాసురమర్దిని గా అమ్మవారి దర్శనం



చిట్యాల, అక్టోబర్ 21 (సింగిడి): చిట్యాల పట్టణంలోని శ్రీశ్రీశ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు భక్తులకు శ్రీ మహిషాసురమర్దిని దేవిగా అభయప్రదానం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో చక్కెర పొంగలి, గారెలను నైవేద్యంగా సమర్పించారు. నిత్య పూజా కార్యక్రమాల అనంతరం మహిళా భక్తులచే ఘనంగా కుంకుమార్చనలు జరిపించారు. ఆలయ ముఖ్య అర్చకులు వాసుదేవ శర్మ ఆచార్యత్వంలో ఈ పూజా కార్యక్రమాలన్నీ శాస్త్రోక్తంగా నిర్వహించబడ్డాయి. సోమవారం నాటి వేడుకల్లో చిట్యాలకు చెందిన ప్రముఖ మెడికల్ ఫార్మా కంపెనీ అధినేత చిలుకూరి గణేష్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో దేవస్థానం డైరెక్టర్లు గంజి వెంకటేశం, బుద్ధ విమల కృష్ణమూర్తి, వరకాంతం నరసింహారెడ్డి, రుద్రారపు లింగస్వామి, జిట్ట సాయిలు, బెలిద సత్యనారాయణ, ఏళ్ల మాధవి బయ్యన్న, కమ్మరి దేవి రవి ఏనుగు నరసింహారెడ్డి మరియు అర్చకులు గోవింద్ శర్మ, దుర్గేష్ శుక్ల, సత్యం మిశ్రా, శుభం మిశ్రా, పవన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరిపల్లిలో నూతన బోర్‌ను ప్రారంభించిన వైస్ చైర్మన్ అర్థ సుధాకర్ రెడ్డి



వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 21(సింగిడి): వార్డు ప్రజల తాగునీటి సమస్య తీర్చడానికి నూతన బోర్ ను తవ్వించి సోమవారం వికారాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ అర్థ సుధాకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు తాగునీటి కొరత లేకుండా చూసుకోవడం తమ బాధ్యతని వార్డు అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా తాగునీటి సమస్య పరిష్కారమైనందుకు మహిళలు సంతోషం వ్యక్తం చేశారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ బోర్ మంజూరుకు సహకరించిన తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ శాసనసభ్యులుగడ్డం ప్రసాద్ కుమార్ మరియు వికారాబాద్ మున్సిపల్ వైర్ పర్సన్ గడ్డం అనన్య లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ వైస్ ప్రెసిడెంట్ రెడ్డి నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజు నాయక్, రెడ్డి శేఖర్, నర్సింలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi
గురువారం 22-10-2026

ఎడిటోరియల్

Editorial

సత్యంపై పాలకుల దండయాత్ర.. బలిపీఠంపై పత్రికా స్వేచ్ఛ!

భారతదేశంలో వార్తా మీడియా ప్రస్తుత ప్రభుత్వం, దాని అధికార వ్యవస్థలతో పాటు పౌరులలో పెరిగిపోయిన తీవ్రమైన అపనమ్మకం నడుమ నలిగిపోతోంది. ఒకవైపు పాలకుల అంక్షలు, మరోవైపు సమాజంలో ఏర్పడిన సైద్ధాంతిక వ్యత్యాసాలు జర్నలిజం ఉనికినే ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. పాత్రికేయుడిగా ఎవరు అర్హులనే సాంకేతిక అంశాలను పక్కన పెడితే, ఒక ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వం, ప్రజలతో మీడియా ఎలాంటి సంబంధాన్ని కలిగి ఉందనే దానిపైనే దాని ప్రభావం ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో వాస్తవాలను వెలికితీసే స్వతంత్ర జర్నలిస్టులు ఒకవైపు అధికారుల వేధింపులను, మరోవైపు ప్రజల అనుమానాలను తట్టుకుంటూ తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారు.

ఇటీవల ముఖ్య ఎన్నికల కమిషనర్ రాజీనామాను కోరుతూ జరిగిన ఆందోళనల సమయంలో వార్తా సేకరణకు వెళ్లిన జర్నలిస్టులపై పోలీసులు ప్రవర్తించిన తీరు అధికార దుర్వినియోగానికి అద్దం పడుతోంది. విధుల్లో ఉన్న విలేకరులను నిర్బంధించడం, దాడులు చేయడం, మహిళా జర్నలిస్టులపై లైంగిక వేధింపులకు పాల్పడటం మరియు వారి చరవాణులు, కెమెరాలను స్వాధీనం చేసుకోవడం వంటి అనేక సంఘటనలు నమోదయ్యాయి. క్షేత్రస్థాయి వార్తా కథనాలను తమ అదుపులోకి తెచ్చుకోవడానికి ప్రభుత్వం చేసిన ప్రయత్నంగానే పోలీసుల ఈ చర్యలు కనిపిస్తున్నాయి. అయితే, సామాజిక మాధ్యమాల్లో ఎప్పటికప్పుడు ప్రత్యక్ష దృశ్యాలను పోస్ట్ చేసిన స్వతంత్ర జర్నలిస్టుల కారణంగా అధికార యంత్రాంగం అనుకున్నది సాధ్యపడలేదు.

విలేకరులు తమ వద్ద ప్రెస్ గుర్తింపు కార్డులను స్పష్టంగా ప్రదర్శిస్తున్నప్పటికీ, పోలీసుల నుండి వారికి ఎలాంటి రక్షణ లభించలేదు. పేరుపటాలు లేని సీరువస్త్రాలు ధరించిన అధికారులు నిరసనకారులను, జర్నలిస్టులను బలవంతంగా తీసుకెళ్లిన దృశ్యాలు బయటకు వచ్చాయి. చట్టంలోని ఏ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటున్నారో చెప్పకుండానే, జర్నలిస్టులు ప్రచురించే సమాచారం చట్టవిరుద్ధమంటూ హెచ్చరికలు జారీ చేయడం విచారకరం. విధుల్లో ఉన్న జర్నలిస్టులు మరియు న్యాయవాదులకు ఎలాంటి ఆటంకం కలిగించకూడదని అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలను సైతం పోలీసులు బహిరంగంగా ఉల్లంఘించారు. బాధితులైన జర్నలిస్టులు ఫిర్యాదులు చేసినా అధికారులు సరైన రీతిలో స్పందించడం లేదు. ఒక మహిళా జర్నలిస్ట్ తనపై పోలీసు అధికారి లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆరోపించినప్పటికీ ఎఫ్ఐఆర్ నమోదు కాకపోగా, పోలీసులు మాత్రం వారిపై ఎదురు కేసులు నమోదు చేయడం వ్యవస్థ ఏకపక్ష వైఖరికి నిదర్శనం. నిరసనల సమయంలో ముఖ గుర్తింపు సాంకేతికత ద్వారా జర్నలిస్టులపై నిఘా పెట్టడం, గతంలో నిర్బంధించిన జర్నలిస్టుల వ్యక్తిగత వివరాలను సేకరించి వారి పరికరాలను తిరిగి ఇవ్వకపోవడం వంటి చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తిని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి.

ఒక సమర్థవంతమైన ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే మీడియాతో ప్రభుత్వానికి ఉండే సంబంధాలు ఎప్పుడూ ఘర్షణాత్మకంగానే ఉంటాయి. అయితే గత దశాబ్దంలో విలేకరుల సమావేశాలను నిరాకరించడం, స్క్రిప్ట్ లేని సంభాషణలను అనుమతించకపోవడంతో ఈ సంబంధం మరింత దిగజారింది. ప్రభుత్వ విధానాలను విమర్శించే స్వతంత్ర మీడియా సంస్థలు ఆదాయపు పన్ను దాడులు, క్రిమినల్ కేసులు మరియు కంటెంట్ తొలగింపు చర్యలతో మనుగడ కోసం పోరాడుతున్నాయి. ప్రకటనల ఆదాయాలు తగ్గుతుండటంతో కొన్ని స్థాపిత మీడియా సంస్థలు స్వయం-సెన్సార్‌షిప్ మార్గాన్ని ఎంచుకుంటున్నాయి.

మరోవైపు, అధికారంలో ఉన్న ప్రభుత్వానికి బహిరంగంగా మద్దతు ఇచ్చే కొన్ని పక్షపాత మీడియా సంస్థల వల్ల మొత్తం మీడియా రంగంపైనే ప్రజలకు నమ్మకం సన్నగిల్లింది. ఈ పక్షపాత విభాగం విమర్శకులను దేశవ్యతిరేకులుగా చిత్రీకరిస్తూ స్వతంత్ర పరిశోధనాత్మక నివేదికలను కొట్టిపారేస్తోంది. 2020-21 రైతుల ఆందోళనల సమయంలో ఇటువంటి పక్షపాత మీడియాను ప్రజలు తిరస్కరించడంతో ఈ అపనమ్మకం స్పష్టంగా బయటపడింది. నిరసనకారులు ఇంటర్వ్యూలు ఇచ్చేందుకు నిరాకరించడం, ప్రత్యక్ష ప్రసారం చేసే విలేకరులను నిలదీయడం వంటి సంఘటనలు జరిగాయి.

ఈ పరిస్థితుల్లో ప్రధాన స్రవంతి టీవీ ఛానెళ్లు చూపించని క్షేత్రస్థాయి నిరసనలను, పోలీసుల అక్రమాలను సామాజిక మాధ్యమాలు బాహ్య ప్రపంచానికి చాటిచెబుతున్నాయి. అయితే, నిష్పాక్షికంగా వ్యవహరించే స్వతంత్ర మీడియాకు ప్రజల విశ్వాసాన్ని తిరిగి పొందడం ఇప్పుడు అత్యంత కీలకమైన సవాలుగా మారింది. మీడియా రంగాలు రెండుగా చీలిపోవడం వల్ల పాలకుల, పోలీసుల అక్రమాలపై ఉమ్మడి పోరాటం సాధ్యపడటం లేదు. ఈ అంతర్గత విభేదాల కారణంగా పోలీసులు జవాబుదారీతనం లేకుండా ప్రవర్తిస్తుంటే, ప్రభుత్వం మాత్రం ఎటువంటి విమర్శలు తాకకుండా సురక్షితంగా నీడన నిలుస్తోంది.





వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

ప్రత్యేక చట్టాలకు నోచుకోని ఆదివాసీలు

కొమురం భీం జయంతి సందర్భంగా...



ఆదివాసీలపై నిజాం నవాబు సాగించిన దోపిడీకి వ్యతిరేకంగా, పాలక వర్గాల దౌర్జన్యాలను ప్రశ్నిస్తూ, గిరిజన హక్కుల కోసం 'జల్-జంగిల్-జమీన్' నినాదంతో మడమ తిప్పని పోరాటాలు చేసి, ప్రాణాలర్పించిన పోరాట యోధుడు కొమురం భీం.

గిరిజన గోండు తెగకు చెందిన కొమురం చిన్నూమ్, సోంబాయి దంపతులకు 1901 అక్టోబర్ 22న అవిభక్త ఆదిలాబాద్ జిల్లా, ఆసిఫాబాద్ తాలూకాలోని సంకేపల్లి గ్రామంలో జన్మించి, ఆసిఫాబాద్ పరిసర ప్రాంతాలు, జోడేఘాట్ గుట్టలు కేంద్రంగా నిజాం నవాబు పై గెరిల్లా పోరాటాన్ని కొనసాగించి, కుర్దు పటేల్ అనే నమ్మకద్రోహి ఇచ్చిన సమాచారంతో, అర్ధరాత్రి కొమరం స్థావరాలను సైన్యం చుట్టుముట్టగా జోడేఘాట్ అడవుల్లో 1940, అక్టోబర్ 27 న, అంటే ఆదివాసీలు పవిత్రంగా భావించే ఆశ్వీయుజ శుద్ధ పౌర్ణమి రోజున వీరమరణం పొందాడు భీం.

కొమురం భీం స్ఫూర్తితో...దేశంలో తమ హక్కుల సాధన కోసం ఆదివాసీ సమాజాలు ఉద్యమించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. బ్రిటిష్ చట్టాలకు వ్యతిరేకంగా బిర్సాముండా, సంతాల్‌లు,తిరుగుబాటు చేశారు. జల్, జంగల్, జమీన్ కోసం సాయుధ పోరాటాలు చేశారు. తమపై సాగుతున్న అన్నిరకాల దోపిడీ, పీడనలను ఎదిరించారు. అనేకసార్లు ఓటమి చెందినా తమ ఉనికే ప్రశ్నార్థకంగా మారుతున్న పరిస్థితులలో, తమ అస్తిత్వం కోసం అలుపెరుగని పోరాటాలు నేటికీ కొనసాగిస్తూనే ఉన్నారు.

జీవన పోరాటంలో ఆరితేరిన వారు ఆదివాసీలు. వారు నివసించే ప్రాంతాలు పుష్కలమైన సహజ వనరులతో కళకళలాడు తుండేవి. సాటి మానవులుగా అనేక దేశాలలో వారికి తగిన గుర్తింపు, రక్షణ లేదు. ఆయా దేశాలలో కనీసపు చట్టాలు, హక్కులు కూడా లేవు.

నాగరిక సమాజపు కొత్త పోకడలకు దూరంగా తమ కట్టు, బొట్టూ, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటు, తరతరాలుగా భావి తరాలకు అందిస్తున్నారు. యేడాది పొడవునా వారు జరుపుకునే పండుగలు, వేదుకల్లో వారి సంస్కృతి ప్రతిబింబిస్తుంది.

ఆదివాసీలు ఒడిషా, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, మిజోరం, అండమాన్ నికోబార్ దీవులలో ఎక్కువగా జీవిస్తున్నారు.
మన దేశంలో సుమారు 600 ఆదివాసీ తెగలు గుర్తించ బడ్డాయి. భారత రాజ్యాంగం వీరికి చట్టపరమైన రక్షణలు కల్పించింది. 1874లోనే ప్రత్యేక షెడ్యూల్డ్ జిల్లాల చట్టం చేయబడింది. 1917లో ఆదివాసీ తెగల నివాస ప్రాంతాలలో ఉమ్మడి భూమి హక్కులు ఇవ్వబడ్డాయి. ఆదివాసీ తెగలకు అటవీ భూములపై హక్కులు కల్పిస్తూ 2006లో చట్టం చేయబడింది. చట్టం ప్రకారం అటవీ భూమిపై ఆధారపడి జీవిస్తున్న ప్రతి గిరిజన కుటుంబానికీ 10 ఎకరాల వరకూ పట్టా ఇవ్వవచ్చు.
స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు కావస్తున్నా ఆదివాసీ తెగలు తమ సంప్రదాయపు భూముల నుంచి, అటవీ ప్రాంతం నుంచి నెట్టివేయ బడుతున్నారు. అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 1/70 చట్టం అమలులో ఉన్నది. గిరిజనుల సాంప్రదాయక భూములు గిరిజన తెగలకే దక్కాలి. గిరిజనేతరులకు షెడ్యూల్డ్ భూమిపై ఎట్టి హక్కూ లేదు. ఉభయ తెలుగు రాష్ట్రంలో షెడ్యూల్డ్ ప్రాంతంలో 48 శాతం సంప్రదాయక గిరిజన భూములను గిరిజనేతరులు ఆక్రమించు కున్నారు. ఆదివాసీ తెగల వాయిద్య పరికరాలు, వారి నృత్యాలు ప్రభుత్వం ప్రోత్సాహం లేక అంతరించి పోతున్నాయి. ఆదివాసీ ప్రాంతాలలోకి పర్యాటకం ప్రవేశించాక ఆదివాసీ కళలు వ్యాపార సరుకులుగా మారి పోయాయి. స్వాతంత్ర్యం వచ్చి యేళ్లు గడుస్తున్నా అభివృద్ధికి నోచు కోని గిరిపల్లెలు నేటి ఉన్నాయి. విద్య, వైద్య, రవాణా విషయంలో గిరిజన గూడాలు, తాండాల్లో నేటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నడవడానికి రోడ్డు, తాగటానికి నీటి సౌకర్యం కూడా లేని పల్లెలున్నాయి. ఇప్పటికి పోడు భూముల సమస్య, అటవీ భూములకు పట్టాలు, ప్రభుత్వ అజమాయిషీ కాకుండా గ్రామసభల ద్వారా స్వయం పాలన ఉద్దేశిత పీసా చట్టం అమలు కోసం గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీ సంఘాలు పోరాటాలను కొనసాగిస్తూనే ఉన్నాయి. తెలంగాణలో కేసిఆర్ ప్రభుత్వం వీరి స్వయం పరిపాలనే లక్ష్యంగా ప్రత్యేక గ్రామ పంచాయతీలు ఏర్పాటుచేసి ప్రత్యేక నిధులు కేటాయించింది కూడా. పోడు భూముల విషయంలోనూ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నది. అలా గిరిజన అభివృద్ధికి ఇతోధిక సంక్షేమ కార్యక్రమాల అమలు అనివార్యం. అత్యవసరం.





రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

అణచివేతకు వ్యతిరేకంగా అగ్నిజ్వాలగా మారిన కొమురం భీం

కొమురం భీం జయంతి - అక్టోబర్ 22



తెలంగాణ చరిత్ర పుటల్లో శాశ్వతంగా వెలుగొందే ఒక గొప్ప త్యాగి పేరు.. కొమురం భీం. ఆయన పేరు గిరిజనులలో గౌరవానికి, ధైర్యానికి, స్వాతంత్ర్య స్ఫూర్తికి ప్రతీక. భీం జీవితం ఒక మనిషి న్యాయం కోసం, స్వాభిమాన జీవితం కోసం, అణచివేతకు వ్యతిరేకంగా ఎంతటి అగ్నిజ్వాలగా మారగలడో చూపించిన సజీవ ఉదాహరణ. ఆయన ఆలోచనలు, చర్యలు, త్యాగం – ఇవన్నీ కలిపి తెలంగాణ ఆదివాసీ చరిత్రను సజీవంగా నిలిపిన ఆధ్యాత్మిక, సామాజిక, రాజకీయ చిహ్నాలు.

1901లో నేటి తెలంగాణ రాష్ట్రంలోని అసిఫాబాద్ జిల్లాలోని సంకేపల్లి గ్రామంలో గోండు తెగకు చెందిన కొమురం చీకా, సొంబాయి దంపతులకు జన్మించిన భీం బాల్యం నుంచే ప్రకృతితో మమేకమై పెరిగాడు. ఆ కొండలు, అడవులు, జలపాతాలు అతని స్నేహితులు; పచ్చదనం అతని ఊపిరి. కానీ ఆ పచ్చని అడవుల్లోని గిరిజనుల జీవితం మాత్రం నలుపు నీడలతో నిండింది. నిజాం పాలన కింద గిరిజనులు అనేక రకాల దోపిడీలకు గురయ్యారు. పటేల్‌లు, పట్వారీలు, దొరలు, పోలీసులు కలిసి వారి భూములు స్వాధీనం చేసుకొని, పన్నులు విధించి, బలవంతపు కూలిగా మార్చేశారు. "మన అడవులు మనవే" అన్న మాట చెప్పే స్వేచ్ఛ కూడా లేకుండా పోయింది. ఆ అణచివేత, ఆ అవమానం భీం మనసులో ఆగ్రహపు అగ్నిని రగిలించింది.

భీం సాధారణ గిరిజనుడు కాదు; ఆలోచనలో విప్లవకారుడు. గిరిజనుల జీవితం ప్రకృతితో ముడిపడి ఉందని గుర్తించాడు ---. నీరు -- అడవి -- భూమి (జల్, జంగల్, జమీన్) ఇవి లేకపోతే గిరిజన జీవితం ఉండదని ఆయన చెప్పాడు. ఈ మూడు అంశాలే ఆయన ఉద్యమానికి మూల మంత్రం. "జల్ జంగిల్ జమీన్ మన హక్కు, మన ప్రాణం" అని ఆయన ఉద్ఘాటించినప్పుడు ఆ నినాదం అడవుల గుండెల్లో ప్రతిధ్వనించింది. గిరిజనుల హక్కుల కోసం ఆయన ప్రారంభించిన పోరాటం కేవలం స్థానిక తిరుగుబాటు కాదు; అది భారతదేశంలో ఆదివాసీ స్వాభిమానం కోసం మొదటి వ్యవస్థీకృత ఉద్యమంగా నిలిచింది.

1920వ దశకంలో భీం బాంబాయ్, నాగపూర్ ప్రాంతాలకు వెళ్లి కార్మికుల జీవితాన్ని గమనించాడు. ఆ ప్రాంతాల్లో కొనసాగుతున్న కార్మిక ఉద్యమాలు, సామాజిక న్యాయపోరాటాలు ఆయనకు స్ఫూర్తినిచ్చాయి. తిరిగి తన ప్రాంతానికి చేరి, గిరిజన యువకులను సమీకరించి, వారికి శిక్షణ ఇచ్చి, ఆయుధాలను సేకరించి, నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధ తిరుగుబాటుకు నాంది పలికాడు. ఆయన దళాలు అడవుల్లో దాగి, పన్నులు వసూలు చేసే అధికారులపై దాడులు చేశాయి. గిరిజన పల్లెల్లో ఆయన మాటలు ప్రజల మనసుల్లో మంటలు రేపాయి --- "మన బతుకు మనదే, మన భూమి మనదే, మన అడవులు మనవే."

ఆ కాలంలో నిజాం రాజ్యంలోని పాలనా యంత్రాంగం గిరిజన ప్రాంతాలను సొంత ఆస్తులుగా మార్చుకొని, ప్రజలను బానిసలుగా ఉపయోగించేది. కొమురం భీం ఈ అన్యాయాన్ని నిలువరించేందుకు గిరిజనులలో అవగాహన పెంచాడు. భూస్వాములు, పోలీసు అధికారులు, పటేల్‌లు, పట్వారీలు గిరిజనులను బెదిరించినా భీం వెనుకడుగు వేయలేదు. ఆయన ధైర్యం, వాక్చాతుర్యం, నాయకత్వం వల్ల గిరిజన ప్రాంతం అంతా ఒక్కసారిగా చైతన్యంతో నిండిపోయింది. భీం నాయకత్వంలో గిరిజనులు మొదటిసారిగా తమ హక్కులను తెలుసుకున్నారు, వాటి కోసం పోరాడే శక్తిని సంపాదించారు.

1940లో అసిఫాబాద్ సమీపంలోని పాటగూడ గ్రామం ఆయన చివరి యుద్ధభూమిగా మారింది. నిజాం దళాలు ఆయన దళాన్ని చుట్టుముట్టాయి. భీం చివరి శ్వాస వరకు పోరాడి, గుండెల్లో బుల్లెట్లు తగిలినా తలవంచలేదు. ఆయన రక్తం భూమిని తడిపిన ఆ క్షణం గిరిజన చరిత్రలో అజరామరమైన ఘడియగా నిలిచింది. భీం వీరమరణం తర్వాత ఆయన పేరు గిరిజనుల గుండెల్లో ఒక జ్యోతిగా వెలిగింది. ఆ జ్యోతి ఎన్నటికీ ఆరిపోలేదు.

కొమురం భీం స్ఫూర్తితోనే తర్వాత గూడెం పోరాటాలు, గిరిజన హక్కుల ఉద్యమాలు ఉద్భవించాయి. ఆయన చూపిన మార్గం తెలంగాణా ప్రజా ఉద్యమానికి పునాది వేసింది. ఆయన స్ఫూర్తి గిరిజన సమాజంలోనే కాదు, సర్వసాధారణ ప్రజల్లోనూ సమానత్వం, స్వాభిమానం, న్యాయం అనే విలువలను నాటింది. ఆయన చూపిన "జల్--జంగల్--జమీన్" సిద్ధాంతం నేటికీ పర్యావరణ పరిరక్షణ, భూహక్కుల రక్షణ ఉద్యమాలకు మార్గదర్శకంగా ఉంది.



ఆయన త్యాగానికి గుర్తుగా నేటి తెలంగాణ ప్రభుత్వం ఆసిఫాబాద్ జిల్లాకు ఆయన పేరుని పెట్టి లికొమురం భీం జిల్లాలిగా ప్రకటించింది. ఆ పేరులో గిరిజన గౌరవం నిండి ఉంది. ప్రతి సంవత్సరం అక్టోబర్ 22న ఆయన జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా గిరిజనులు, విద్యార్థులు, సామాజిక సంస్థలు, ప్రభుత్వ ప్రతినిధులు ఘన నివాళులు అర్పిస్తారు. పల్లెల్లో పాటలు పాడుతారు, నృత్యాలు చేస్తారు, భీం బోధనలు గుర్తు చేసుకుంటారు. అది కేవలం జయంతి కాదు --- ఆత్మగౌరవపు పండుగ, స్వేచ్ఛాస్ఫూర్తి ఉత్సవం.

కొమురం భీం మనకు నేర్పిన మహత్తర పాఠం ఏంటంటే --- "అన్యాయం ఎదిరించడం ధర్మం, న్యాయం సాధించడమే స్వాతంత్ర్యం." ఆయన జీవితం గిరిజనులకే కాదు, సమాజమంతటికీ మానవ హక్కుల ప్రాధాన్యతను గుర్తు చేస్తుంది. భీం త్యాగం వల్లే గిరిజన సమాజం నేడు గౌరవంగా తలెత్తి నిలుస్తోంది. ఆయన జీవితం స్ఫూర్తిగా, ఆయన స్ఫూర్తి వెలుగుగా, ఆయన నినాదం ప్రేరణగా మనమందరం ముందుకు సాగాలి.

కొమురం భీం గుండె నుండి వచ్చిన ఆ నినాదం నేటికీ అడవుల గుండెల్లో ప్రతిధ్వనిస్తోంది – "జల్ -- జంగల్ -- జమీన్... మన హక్కు, మన గౌరవం, మన ప్రాణం."

-రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్..9440595494

మానవత్వం చాటుకున్న కౌన్సిలర్ ఫెరోజ్



- మృతి చెందిన నిరుపేద మహిళకు అంతిమ సంస్కారాలు
- కౌన్సిలర్‌ను అభినందించిన ప్రజలు

జమ్మికుంట, అక్టోబర్ 22 (సింగిడి): ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని జమ్మికుంట మున్సిపాలిటీ 7వ వార్డు కౌన్సిలర్ ఫెరోజ్ నిరూపించారు. వార్డుకు చెందిన వీర్ల సుశీల (55) అనారోగ్యంతో మృతి చెందగా, తీవ్ర పేదరికంలో ఉన్న ఆమె కుటుంబానికి అంత్యక్రియలు నిర్వహించే స్థోమత లేకపోవడంతో ఫెరోజ్ మానవత్వంతో ముందుకొచ్చారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉండగా, కుటుంబ పరిస్థితి దయనీయంగా ఉండటంతో అంత్యక్రియలు నిర్వహించడం వారికి కష్టంగా మారింది. విషయం తెలుసుకున్న కౌన్సిలర్ ఫెరోజ్ వెంటనే అక్కడికి చేరుకుని తన మిత్రులతో కలిసి మృతదేహాన్ని కొత్తపల్లి శ్మశానవాటికకు తరలించారు. స్వయంగా దగ్గరుండి దహన సంస్కారాలకు అవసరమైన ఏర్పాట్లన్నీ పూర్తి చేయించారు. ఆప్తులు, చుట్టుపక్కల వారు సైతం ముందుకు రాని పరిస్థితుల్లో బాధిత కుటుంబానికి అండగా నిలిచి అంతిమ సంస్కారాలు నిర్వహించడం పలువురి దృష్టిని ఆకర్షించింది. ఈ సందర్భంగా ఫెరోజ్ మాట్లాడుతూ.. పేదరికంలో ఉన్న ఏ కుటుంబానికీ ఇలాంటి దుస్థితి ఎదురుకాకూడదని ఆకాంక్షించారు. ప్రతి మనిషి చివరి మజిలీ గౌరవప్రదంగా సాగాలని, ఆపదలో ఉన్నవారికి ప్రతి ఒక్కరూ తమవంతు సహాయం అందించాలని కోరారు. డబ్బు శాశ్వతం కాదని, మనం చేసే మంచి పనులే మనకు శాశ్వత గుర్తింపునిస్తాయని పేర్కొన్నారు..మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన ఫెరోజ్.. ఈ సేవా కార్యక్రమంలో సహకరించిన తన ముస్లిం మిత్రులకు, మున్సిపాలిటీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

విలాసాగర్‌లో ఘనంగా విజయదశమి వేడుకలు



- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న పింగిలి రమేష్

జమ్మికుంట, అక్టోబర్ 22 (సింగిడి): జమ్మికుంట మండలంలోని విలాసాగర్ గ్రామంలో విజయదశమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా గ్రామంలో సందడి నెలకొనగా, సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు, జమ్మి పూజలు నిర్వహించారు. ఈ వేడుకలకు కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగిలి రమేష్ హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ గరిగంటి శ్రీకాంత్ ఆధ్వర్యంలో దసరా పండగ ఏర్పాట్లు చేయగా గ్రామ పెద్దలు కుల సంఘ నాయకులు గ్రామస్తులు భారీ ఎత్తున తరలివచ్చి జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించి, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి పండుగను జరుపుకుంటామని, ఈ పర్వదినం ప్రజల్లో భక్తిభావాన్ని, ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గరిగంటి శ్రీకాంత్, ఉపసర్పంచ్, భాస్కర్ వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ తిప్పారపు బాబురావు మాజీ ఉపసర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు సిరిసేటి అశోక్ గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొని విజయదశమి వేడుకలను భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

చిన్నారులకు ఉచితంగా మందుల పంపిణీ

పుట్టిన ఊరిపై మమకారంతో సేవలు..
అమెరికా వైద్యుడు నేరెళ్ల దామోదర్



జమ్మికుంట, అక్టోబర్ 21 (సింగిడి): జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామంలో ఇండియన్ అమెరికన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 16 ఏళ్లలోపు చిన్నారులకు సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులను అమెరికా వైద్యుడు నేరెళ్ల దామోదర్ ఉచితంగా పంపిణీ చేశారు. పుట్టిన ఊరిపై మమకారంతో అమెరికా నుంచి వచ్చి చిన్నారులకు వైద్యసేవలు అందించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గతంలోనూ గ్రామంలో ప్రత్యేక వైద్యులతో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం దుర్గామాత అమ్మవారి సన్నిధిలో వేద పండితుడు రాజగోపాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నేరెళ్ల దామోదర్ మాట్లాడుతూ.. తాను పుట్టి పెరిగిన గ్రామాన్ని ఎప్పటికీ మరిచిపోనని, గ్రామానికి వైద్యపరంగానే కాకుండా ఇతర మౌలిక అవసరాలకూ తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడిపంటలతో గ్రామం సుభిక్షంగా వర్ధిల్లాలని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ పోషిని సత్యనారాయణ, శ్రీ దుర్గాభవాని అసోసియేషన్ సభ్యులు, భవాని స్వాములు, భక్తులు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ అభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తాం

గిద్దె పెరుమాండ్ల స్వామి ఆలయంలో
మంత్రి పొన్నం, ఎమ్మెల్యే గంగుల శమీ పూజలు



కరీంనగర్, అక్టోబర్21(సింగిడి): విజయదశమి సందర్భంగా కరీంనగర్‌లోని గిద్దె పెరుమాండ్ల స్వామి ఆలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు శమీ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ, ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రజాప్రతినిధులు ప్రజాసేవలో మరింత సమర్థంగా పనిచేసేలా ఆశీర్వదించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా విద్య, వైద్యం, క్రీడలు, మహిళా సాధికారత, మౌలిక సదుపాయాలు సహా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా ప్రజాప్రతినిధులంతా సమష్టిగా కృషి చేస్తారని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధిలో జిల్లా అగ్రగామిగా నిలిచేలా ఐక్యంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

అమరవీరుల త్యాగాలే పోలీసు శాఖకు దిక్సూచి!

ప్రజల భద్రత కోసం ప్రాణాలర్పించిన వీరుల సేవలు అజరామరం
విధి నిర్వహణలో అమరులైన 154 మంది పోలీసులకు ఘన నివాళులు
ప్రజల ప్రాణాలు, ఆస్తుల పరిరక్షణే పోలీసుల ప్రథమ లక్ష్యం
రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా



రామగుండం, అక్టోబర్ 21 (సింగిడి): విధి నిర్వహణే ప్రాణంగా భావించి, ప్రజల రక్షణ కోసం తమ జీవితాలను త్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడుతూ శాంతిభద్రతలను పరిరక్షించడంలో పోలీసు శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని స్పష్టం చేశారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడమే కాకుండా, వారు చూపిన ధైర్యం, కర్తవ్యనిష్ఠ, దేశభక్తిని ప్రతి పోలీసు అధికారి ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.
పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమం గంభీర వాతావరణంలో సాగింది. కమిషనరేట్‌లోని అమరవీరుల స్థూపం వద్ద పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, పోలీసు ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖులు పుష్పగుచ్ఛాలు సమర్పించి వీరుల త్యాగాలకు నివాళులర్పించారు. అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి వారి సేవలను స్మరించుకున్నారు.

154 మంది అమరవీరులకు కన్నీటి నివాళి

గత ఏడాది నుంచి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన 154 మంది పోలీసు అమరవీరుల పేర్లను అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్ చదివి వినిపించారు. అనంతరం ఆర్ఐ శేఖర్ ఆధ్వర్యంలో సాయుధ పోలీసు సిబ్బంది శోకశస్త్రం నిర్వహించారు. అక్కడికి హాజరైన అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన వీరులకు ఘనంగా అశ్రునివాళులర్పించారు.

అమరవీరుల స్ఫూర్తితో విధులు నిర్వర్తించాలి: సీపీ

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ, పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవానికి చారిత్రక ప్రాధాన్యం ఉందన్నారు. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న భారత భద్రతా సిబ్బందిపై చైనా బలగాలు దాడి చేసిన ఘటనలో ప్రాణత్యాగం చేసిన వీరుల స్మారకంగా ఏటా అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు.దేశ అంతర్గత భద్రత, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం పోలీసు సిబ్బంది ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ వెనుకడుగు వేయకుండా ప్రజలకు రక్షణ కల్పించడం పోలీసుల బాధ్యతని పేర్కొన్నారు. ప్రతి అధికారి, సిబ్బంది నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేస్తూ పోలీసు శాఖపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని సూచించారు.అమరవీరుల త్యాగాలను కేవలం స్మరించుకోవడమే కాకుండా, వారు ఆశించిన లక్ష్యాలను సాధించేందుకు నిబద్ధతతో పనిచేయడమే వారికి అందించే నిజమైన నివాళి అని సీపీ పేర్కొన్నారు. వారి ధైర్యసాహసాలు, దేశభక్తి, సేవానిరతి పోలీసు శాఖకు ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు.

శాంతిభద్రతలతోనే అభివృద్ధికి బాటలు: కలెక్టర్

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, సమాజంలో ప్రశాంత వాతావరణం, శాంతిభద్రతలు ఉన్నప్పుడే అభివృద్ధి కార్యక్రమాలు సజావుగా సాగుతాయని తెలిపారు. దేశ సరిహద్దులను సైనిక బలగాలు కాపాడుతుండగా, దేశ అంతర్గత భద్రతతో పాటు ప్రజల రక్షణలో పోలీసు శాఖ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.పోలీసులు 24 గంటలు, ఏడాది పొడవునా ప్రజల భద్రత కోసం సేవలందిస్తున్నారని, విధి నిర్వహణలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రజల రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల సేవలను సమాజం ఎప్పటికీ మరచిపోకూడదని పేర్కొన్నారు.
ప్రతి పౌరుడు చట్టాలను గౌరవిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా రహదారి భద్రత కోసం ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అన్నారు. నిబంధనలు ప్రజల భద్రత, సామాజిక సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రూపొందించినవని వివరించారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో వ్యవహరిస్తే ప్రమాదాలను తగ్గించి సురక్షిత సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు.ప్రజలకు రక్షణ కల్పిస్తూ, అభివృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడంలో పోలీసుల కృషి అభినందనీయమని కలెక్టర్ ప్రశంసించారు. ఈ సందర్భంగా దేశం కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరులందరికీ ఘన నివాళులర్పించారు.

పోలీసు ఉన్నతాధికారులు, అమరవీరుల కుటుంబాల హాజరు

ఈ సంస్మరణ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి, అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, టాస్క్ ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్, సీసీఎస్ ఏసీపీ రవీందర్, ఏవో శ్రీనివాస్ పాల్గొన్నారు. కమిషనరేట్ పరిధిలోని ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, సీపీఓ సిబ్బంది, స్పెషల్ పార్టీ, ఏఆర్ సిబ్బందితో పాటు పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులు హాజరై వీరుల సేవలను స్మరించుకున్నారు.





సంప్రదాయాల పరిరక్షణే లక్ష్యం..

రావణ దహన వేడుకల్లో అలకుంట రాజేశం పిలుపు

రామగుండం, అక్టోబర్ 21 (సింగిడి): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలిచే రావణాసుర దహన వేడుకలు రామగుండం ఎస్టీ కాలనీలో అంబరాన్నంటాయి. కాలనీ యువత సమష్టి కృషితో నిర్వహించిన ఈ వేడుకలు సందడి నింపగా, పెద్దపల్లి జిల్లా జవహర్ బాల్ మంచ్ (జీడీవీ) చైర్మన్ అలకుంట రాజేశం ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

యువత ఆహ్వానం.. ఘనంగా సత్కారం

ఎస్టీ కాలనీ యువకుల ఆహ్వానం మేరకు కార్యక్రమానికి విచ్చేసిన అలకుంట రాజేశంకు నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం శాలువాతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. యువత తనపై చూపిన ఆదరాభిమానాలకు రాజేశం కృతజ్ఞతలు తెలిపారు. సంప్రదాయాలను కాపాడుతూ పండుగలను ఐకమత్యంతో నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.

చెడును వీడి.. మంచి మార్గంలో పయనించాలి

ఈ సందర్భంగా అలకుంట రాజేశం మాట్లాడుతూ, రావణాసుర దహనం కేవలం ఒక పండుగ కార్యక్రమం మాత్రమే కాదని, చెడుపై మంచి సాధించిన విజయాన్ని చాటిచెప్పే గొప్ప సాంస్కృతిక ప్రతీక అని అన్నారు. ప్రతి ఒక్కరూ చెడు ఆలోచనలు, దురలవాట్లకు దూరంగా ఉంటూ సత్యం, ధర్మం, న్యాయం వంటి విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని భావితరాలకు అందించడంలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. పండుగలు ప్రజల మధ్య ప్రేమాభిమానాలను పెంపొందించడంతో పాటు సామాజిక ఐక్యతకు బాటలు వేస్తాయని పేర్కొన్నారు.నేటి యువత విద్య, ఉపాధితో పాటు సామాజిక సేవ, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ ముందుండాలని రాజేశం ఆకాంక్షించారు. యువత ఐకమత్యంతో ముందుకు సాగితే సమాజ అభివృద్ధికి మరింత దోహదపడగలదని అన్నారు. సంప్రదాయాలను గౌరవిస్తూ, సమాజంలో సోదరభావం పెంపొందించే కార్యక్రమాలను నిర్వహించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు.ఎస్టీ కాలనీ యువకులు సమన్వయంతో ఏర్పాట్లు చేయడంతో రావణాసుర దహన వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. స్థానిక ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకల్లో భాగస్వాములయ్యారు. సంప్రదాయాల పరిరక్షణతో పాటు ప్రజల మధ్య ఐక్యతను చాటిన ఈ కార్యక్రమం కాలనీలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పింది. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు గజేందర్ నాయక్, దండుగుల రమణ, బానోత్ కార్తిక్, అలకుంట శ్రీనివాస్, అలకుంట రాకేష్, కాంపెల్లి లక్ష్మీనారాయణతో పాటు పలువురు యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళలు, కాలనీవాసులు పాల్గొన్నారు.





చెడుపై మంచి సాధించిన విజయమే విజయదశమి

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి: ఎమ్మెల్యే కవ్వంపల్లి



మానకొండూర్, అక్టోబర్21(సింగిడి): చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి నిలుస్తుందని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. దసరా పండుగను పురస్కరించుకొని తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని రాంలీలా మైదానంలో రాంలీలా కమిటీ చైర్మన్ కుంట రాజేందర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ పొన్నాల సంపత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రావణ దహన కార్యక్రమానికి ఆయన టీఎన్జీఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విజయదశమి చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించేందుకు ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. దసరా పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందం, శాంతి, శ్రేయస్సును నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి, అంకిత్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఎండి డాక్టర్ కవ్వంపల్లి అనురాధ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేష్, మాజీ ఎంపీపీ పొన్నాల భూలక్ష్మి, ఉపసర్పంచ్ కేతిరెడ్డి ఎల్లారెడ్డి, పార్టీ నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు, మోరపల్లి రమణారెడ్డి,గోపు మల్లారెడ్డి, సంపత్ రెడ్డి, గసికంటి లక్ష్మారెడ్డి, బుదారపు శ్రీనివాస్, కొత్త తిరుపతిరెడ్డి, కొండలరావు, పోలు రాము, రమేష్, అయితం వెంకన్న, వివిధ గ్రామాల సర్పంచులు, వివిధ రాజకీయ పక్షాల నాయకులు, రాంలీలా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ విద్యార్థులు ఏఐపై దృష్టి సారించాలి

విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ, కోచింగ్ సెంటర్ల ఏర్పాటుకు చొరవ
రెండేళ్ల తర్వాత ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తా..
యాప్ టీవీ అధినేత పాడి ఉదయ్ నందన్ రెడ్డి
అపర భద్రాద్రిలో ప్రత్యేకపూజలు



జమ్మికుంట, అక్టోబర్ 21 (సింగిడి): గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై అవగాహన పెంచుకొని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని యాప్ టీవీ అధినేత పాడి ఉదయ్ నందన్ రెడ్డి సూచించారు. మంగళవారం అపర భద్రాద్రిగా పేరొందిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయ్ నందన్ రెడ్డికి ఆలయ అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ భవిష్యత్తులో ఏఐ వినియోగం మరింత విస్తరించనున్న నేపథ్యంలో విద్యార్థులు ఇప్పటి నుంచే సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని సూచించారు. గ్రామీణ విద్యార్థులకు ఏఐపై అవగాహన కల్పించేందుకు యాప్ టీవీ ద్వారా ప్రత్యేక కార్యాచరణ చేపడతామని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని కోరారు. విద్యార్థులు ఉన్నతంగా రాణించాలనే లక్ష్యంతో ఏఐ శిక్షణతోపాటు ట్రిపుల్ ఐటీ ప్రవేశ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి కోచింగ్ సెంటర్ల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. వీణవంక, జమ్మికుంట, ఇల్లందకుంట, హుజూరాబాద్, కమలాపూర్ ప్రాంతాల విద్యార్థులకు తనవంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. భవిష్యత్తులో వ్యవసాయం నుంచి వైద్యరంగం వరకు ఏఐ, రోబోటిక్స్ వినియోగం గణనీయంగా పెరుగుతుందని తెలిపారు.

రెండేళ్ల తర్వాత ప్రత్యక్ష రాజకీయాల్లోకి..

తాను రెండేళ్ల తర్వాత ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తానని పాడి ఉదయ్ నందన్ రెడ్డి వెల్లడించారు. ప్రస్తుతం వ్యాపార విస్తరణలో బిజీగా ఉన్నానని, వాటిని చక్కదిద్దుకున్న అనంతరం రాజకీయాల్లోకి వస్తానని మీడియా సమావేశంలో విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు.

సేవకు రాజకీయం అవసరం లేదు

పేదలకు ప్రజలకు సేవ చేయడానికి రాజకీయాలు అవసరం లేదని, వారి అవసరాలను గుర్తించి అండగా నిలవడమే నిజమైన సేవ అని ఆయన అన్నారు. గోరంత సాయం చేసి కొండంత ప్రచారం చేసుకోవడం తన నైజం కాదని స్పష్టం చేశారు. ప్రతి కుటుంబంలోని పిల్లలు ఉన్నత విద్యావంతులైనప్పుడే ఆ కుటుంబంతోపాటు దేశ భవిష్యత్తు మారుతుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఆస్తులు ఇవ్వకపోయినా పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. చదువుకోవాలనే తపన ఉన్న విద్యార్థులకు ఆర్థిక సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఇల్లందకుంట మాజీ సర్పంచ్ కంకణాల సురేందర్ రెడ్డి ప్రముఖ ఎన్నారై డాక్టర్ దామోదర్ వీణవంక మాజీ జెడ్పిటిసి దాసరపు ప్రభాకర్ తాళ్లపల్లి కుమారస్వామి శ్రీధర్ దాసరపు లోకేష్‌తోపాటు స్థానికనేతలు తదితరులు పాల్గొన్నారు.

రంగపేటలో ఘనంగా విజయదశమి వేడుకలు



మానకొండూర్, అక్టోబర్21(సింగిడి): మండలంలోని రంగపేట గ్రామంలో విజయదశమి వేడుకలను గ్రామస్థులు అత్యంత వైభవంగా నిర్వహించారు. దసరా పండుగసందర్భంగా గ్రామంలో పండగ వాతావరణం, ఆధ్యాత్మిక సందడి నెలకొంది. గ్రామస్థులంతా సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు, జమ్మి పూజలు నిర్వహించి ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ వేడుకల్లో గ్రామ సర్పంచ్ కొత్త రాంరెడ్డి, ఉప సర్పంచ్ వేల్పుల కొమురయ్య, వివిధ వార్డుల సభ్యులు పాల్గొన్నారు. అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు రుద్రారం ప్రశాంత్, గడ్డం హరీష్, పెరుక వంశీ, తాండ్ర యస్వంత్, రుద్రారం రాజు, రాపాక రామ్ ప్రసాద్, రుద్రారం వంశీ, గడ్డం చిరంజివి,పాటు గ్రామ ప్రముఖులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు

విజయదశమి వేళ కనకదుర్గమ్మకు భక్తజన నీరాజనం

మంచిర్యాల, అక్టోబరు 21 (సింగిడి): అమ్మను దర్శిస్తే మనసుకు ప్రశాంతత.. మొక్కులు చెల్లిస్తే కష్టాలు తొలగుతాయనే నమ్మకం.. కుటుంబం సుభిక్షంగా ఉండాలని, పిల్లాపాపలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని వేడుకుంటూ భక్తులు ఆలయానికి తరలివచ్చారు. విజయదశమి పర్వదినం సందర్భంగా కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బన మండలం ఇందిరానగర్‌లోని స్వయంభూ శ్రీ కనకదుర్గాదేవి శ్రీ మహంకాళీ దేవస్థానం భక్తజన సంద్రమైంది. శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు వేళ అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరి దేవిగా శాంతస్వరూపిణి రూపంలో భక్తులకు దర్శనమివ్వడంతో ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

బారులు తీరిన భక్తులు

విజయదశమి సందర్భంగా ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. మంచిర్యాల జిల్లాతోపాటు పక్క జిల్లాల నుంచి సైతం భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. అమ్మవారి నామస్మరణతో దేవస్థానం మార్మోగింది. కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. తమ కోరికలు నెరవేరాలని అమ్మవారికి ముడుపులు కట్టుకున్నారు. వాహన పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు.



భక్తిశ్రద్ధలతో పూజలు

మహిళలు ఆలయానికి చేరుకుని దీపాలు వెలిగించి, హారతులిచ్చి, నైవేద్యాలు సమర్పించారు. తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఏటా అమ్మవారి ఉత్సవాల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకోవడం తమకు ఎంతో ఆనందాన్నిస్తుందని పలువురు భక్తులు పేర్కొన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

పల్లకిపై అమ్మవారి ఊరేగింపు

విజయదశమి వేడుకల్లో భాగంగా అమ్మవారిని పల్లకిపై ఊరేగిస్తూ శోభాయాత్ర నిర్వహించారు. భక్తులు భక్తిపారవశ్యంతో అమ్మవారిని అనుసరించారు. దీపాలు, హారతులు, నైవేద్యాలతో మహిళలు తమ భక్తిని చాటుకున్నారు. శరన్నవరాత్రుల తొమ్మిది రోజుల ఆధ్యాత్మిక సందడి విజయదశమి వేడుకలతో మరింత వైభవంగా ముగిసింది. రెబ్బన సీఐ సంజయ్‌కుమార్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓడిబియ్యం, పట్టువస్త్రాలు సమర్పించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ప్రధాన అర్చకులు డా. దేవర వినోద్ స్వామి, ఆలయ అధ్యక్షుడు మోడెమ్ తిరుపతిగౌడ్, ఉప్ప సర్పంచి మిట్ట వెంకటేష్, భక్తులు పాల్గొన్నారు.

పోలీసుల త్యాగాలు మరువలేనివి...

సిపి రష్మీ పేరమూల్

సిద్ధిపేట ప్రతినిధి, అక్టోబర్ 21, (సింగిడి): సిద్ధిపేట పోలీస్ అమరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకొని సిద్ధిపేట పోలీస్ కమిషనర్ రేట్ కార్యాలయంలో వేడుకలను నిర్వహించారు. దేశ రక్షణ కోసం ప్రజల ప్రాణాస్తుల రక్షణకై వీధి నిర్వాణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరులకు సిద్ధిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరమూల్, అదనపు డీసీపీలు అధికారులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపి రష్మీ పెరమూల్ మాట్లాడుతూ.. పోలీస్ శాఖ అనేది ప్రతిరోజు 24/7 గంటల పని చేసే విభాగమని పండుగలు, సెలవులు, అనే తేడా లేకుండా నిరంతరం ఉద్యోగం లో ఉంటూ ప్రజల రక్షణ కోసం శ్రమిస్తున్నారని కొనియాడారు. 1959 అక్టోబర్ 21 న లడక్ లోని హాట్ స్ప్రింగ్ వద్ద చైనా సైన్యం పొంచి దాడి చేసిన ఘటనలో వీర మరణం పొందిన పోలీసు సిబ్బంది అత్యున్నత త్యాగాలను స్మరించుకుంటూ వాటి నుంచి ప్రతి ఏటా అక్టోబర్ 21న పోలీస్ అమరుల సంస్మరణ



దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. స్తుతి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరుల కుటుంబాలు ఎదుర్కొంటున్నకష్టాలను వారి త్యాగాలను పోలీస్ శాఖ ఎప్పటికీ మర్చిపోదని స్పష్టం చేశారు. పోలీస్ కుటుంబాలకు ఎలాంటి సమస్యలు వచ్చినా నేరుగా సంప్రదించవచ్చని సిద్ధిపేట సిపిగా తాను మరియు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తెలంగాణ వ్యాప్తంగా కాకుండా దేశమంతటా పోలీసులతాధికారుల అమరుల కుటుంబాలకు మాట ఇస్తుందని ఇంతటి అత్యున్నత త్యాగం చేసిన వారి కుటుంబ సంక్షేమానికి పోలీస్ శాఖ కట్టుబడి ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో హాజరైన



అమరుల కుటుంబ సభ్యులతో సిపి మాట్లాడి వారి కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డిసిపి లు అడ్మిన్ కుశాల్కర్, సుభాష్ చంద్రబోస్, ఏసిపి లు రవీందర్ రెడ్డి (సిద్దిపేట) సదానందం (హుస్నాబాద్) నర్సింలు (గజ్వేల్) సుమన్ కుమార్, (ట్రాఫిక్) సిఐ లు లక్ష్మి బాబు, విద్యాసాగర్, మురళి, మహేందర్ రెడ్డి, వాసుదేవరావు, లతీఫ్, శ్రీను, రవికుమార్, రాజేష్, శ్రీనివాస్, ముత్యం రాజు, ఎస్ఐలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్చరీ స్వర్ణ పతక విజేత చికిత రావుకు ఘన సన్మానం

కరీంనగర్ క్రీడాకారిణిని అభినందించిన డిప్యూటీ మేయర్యాదగిరి సునీల్‌రావు



కరీంనగర్, అక్టోబర్21(సింగిడి): జపాన్‌లోని ఐచి--నాగోయాలో జరిగిన 2026 ఆసియా క్రీడల్లో విలువిద్య విభాగంలో స్వర్ణ పతకం సాధించిన కరీంనగర్‌కు చెందిన తనిపర్తి చికిత రావును బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర ఉపమేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా సునీల్ రావు మాట్లాడుతూ, అంతర్జాతీయ వేదికపై స్వర్ణ పతకం సాధించి కరీంనగర్‌తో పాటు దేశానికి గర్వకారణంగా నిలిచిన చికిత రావు ప్రతిభ, పట్టుదల అభినందనీయమన్నారు. భవిష్యత్తులో ఒలింపిక్స్ వంటి అంతర్జాతీయ పోటీల్లోనూ పతకాలు సాధించి దేశానికి మరింత గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆమెకు తన పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మనాయక వెలమ సంఘం నాయకులు, ప్రతినిధులు పాల్గొని చికిత రావుకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



జమ్మికుంట, అక్టోబర్ 21 (సింగిడి): విజయదశమి పర్వదినం సందర్భంగా ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ బల్మూర్ వెంకట్‌ను జమ్మికుంట కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం జగిత్యాల జిల్లాలోని వెంకట్ స్వగ్రామం మానాల లో మర్యాద పూర్వకంగా కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎండీ సలీం పాషా, చిన్నాల శ్రీకాంత్, రంజిత్ రెడ్డి, సందీప్, వంశీ, సుమన్, నాగరాజు తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. విజయదశమి ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు నింపాలని, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే ఈ పర్వదినం ప్రతి ఒక్కరికీ విజయాలను అందించాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని ఎన్నిక ఏదైనా హుజురాబాద్ గడ్డమీద కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కష్టపడి పని చేయాలని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వారికి సూచించారు.

18 నెలలలో ఆలయం పూర్తి

పద్మనగర్‌లో నిర్మాణ పనుల పరిశీలన

పురోగతిని సమీక్షించిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్



కరీంనగర్, అక్టోబర్21(సింగిడి): నగరంలోని పద్మనగర్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ పనులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పరిశీలించారు. నిర్మాణ పురోగతి, పనుల గడువు తదితర వివరాలను కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఆలయ నిర్మాణాన్ని మరో రెండున్నరేళ్లలో పూర్తి చేస్తామని కాంట్రాక్టర్లు ఆయనకు వివరించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తయ్యేలా నిర్మాణం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్, కొత్తపల్లి మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, కార్పొరేటర్ గడ్డి ప్రదీప్‌తో పాటు పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పచ్చునూర్‌లో ఘనంగా విజయదశమి వేడుకలు





మానకొండూర్, అక్టోబర్21 (సింగిడి): మండల పరిధిలోని పచ్చునూర్ గ్రామంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో విజయదశమి వేడుకలు సర్పంచ్ పార్నంది కేశవ్ ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని హనుమాన్ టెంపుల్ ఆలయం వద్ద ప్రశాంతమైన వాతావరణంలో అట్టహాసంగా నిర్వహించారు గ్రామ దేవతల కూడలి నుండి డప్పు చప్పులతో శ్రీ ఆంజనేయ దేవాలయం వరకు గ్రామ ప్రజలు ఘనంగా ఊరేగింపు నిర్వహించారు గ్రామ దేవతలకు పూజలు నిర్వహించి అనంతరం గొర్రె పొట్టేలును భారీ జన సందోహం మధ్య బలిదానం చేశారు. అనంతరం గ్రామంలోని ఎల్లమ్మ గుడి వద్ద జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు జమ్మి ఆకులను ఇచ్చుకుంటూ అలాయి బలాయి చేసుకున్నారు ఈ సందర్భంగా సర్పంచ్ కేశవ్ మాట్లాడుతూ చెడుపై మంచి అధర్మంపై ధర్మం విజయానికి ప్రతీక విజయదశమి పండుగ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మూధగాని అనిల్ గౌడ్ వార్డు సభ్యులు తాళ్ల వెంకటేష్, కోమల్ల నరేష్, పిట్టల మల్లేశం, పూసాల సతీష్,పిట్టల సువర్ణ, సంపత్,కూరాకుల లక్ష్మి, శ్రీనివాస్ యాదవ్,నెలవేణి సుశీల, శంకర్,ఎలుక పెల్లి చిరంజీవి, దాసారం కిషన్, కాల్వల రవి,మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కనకం అశోక్, బిజెపి మండల అధ్యక్షులు కంది రాజిరెడ్డి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు,ప్రజలు పాల్గొన్నారు.

గాంధారి పీఏసీఎస్ చైర్మన్ రేసులో తూర్పు రాజులు!

- మూడు దశాబ్దాల రాజకీయ అనుభవం..
- ఎమ్మెల్యే మదన్ మోహన్‌కు నమ్మకమైన అనుచరుడిగా గుర్తింపు



కామారెడ్డి ప్రతినిధి, అక్టోబర్21(సింగిడి): గాంధారి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్ పదవిని ఆశిస్తున్న నాయకుల్లో గాంధారి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు తూర్పు రాజులు పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. సుదీర్ఘ రాజకీయ అనుభవం, ప్రజలతో సన్నిహిత సంబంధాలు, పార్టీ పట్ల విధేయత ఆయనకు బలమైన అంశాలుగా నిలుస్తున్నాయి. దీంతో పీఏసీఎస్ చైర్మన్ పదవి ఆయనకు దక్కుతుందా? అనే అంశం స్థానిక రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

మూడు దశాబ్దాల రాజకీయ అనుభవం

దాదాపు 30 ఏళ్లుగా స్థానిక రాజకీయాల్లో చురుకుగా కొనసాగుతున్న తూర్పు రాజులు ప్రజా జీవితంలో తనదైన గుర్తింపు తెచ్చుకున్నారు. గాంధారి గ్రామపంచాయతీ ఉపసర్పంచిగా సేవలందించడంతో పాటు, రెండుసార్లు ఎంపీటీసీగా ఎన్నికై ప్రజలకు సేవలందించారు. స్థానిక సమస్యలపై అవగాహన, ప్రజాప్రతినిధిగా పనిచేసిన అనుభవం ఆయన రాజకీయ ప్రస్థానంలో కీలకంగా మారాయి. గాంధారి మండలంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ ఆయనకు పరిచయాలు ఉండటం రాజకీయంగా కలిసివచ్చే అంశంగా భావిస్తున్నారు.

ఎమ్మెల్యే మదన్ మోహన్‌తో 15 ఏళ్ల అనుబంధం

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌తో తూర్పు రాజులకు సుమారు 15 ఏళ్లుగా రాజకీయ అనుబంధం కొనసాగుతోంది. మదన్ మోహన్ సైకిల్ యాత్ర చేపట్టినప్పటి నుంచి ఆయనతో కలిసి రాజకీయ ప్రయాణం సాగిస్తున్నట్లు స్థానికంగా చెబుతున్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, నాయకత్వం పట్ల విధేయతను కొనసాగించడం ద్వారా ఎమ్మెల్యేకు నమ్మకమైన అనుచరుడిగా గుర్తింపు పొందారని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు.

సర్పంచ్ అభ్యర్థిత్వం నుంచి ఏఎంసీ వరకు.. ఆశించిన పదవులపై ఎదురుచూపులు!

గత డిసెంబర్‌లో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తరఫున సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం తూర్పు రాజులకు వచ్చినప్పటికీ, పార్టీ నిర్ణయానికి అనుగుణంగా ఆయన వెనక్కి తగ్గి, పార్టీ ఎంపిక చేసిన అభ్యర్థికి మద్దతు తెలిపినట్లు



సమాచారం. అదేవిధంగా గాంధారి వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ పదవి విషయంలోనూ ఆయన పేరు చర్చకు వచ్చినప్పటికీ, ఆ అవకాశం దక్కలేదు. దీంతో ప్రస్తుతం పీఏసీఎస్ చైర్మన్ పదవిపై ఆయన అనుచరులు ఆశలు పెట్టుకున్నారు. పార్టీ కోసం దీర్ఘకాలంగా పనిచేస్తున్న నాయకులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలనే అభిప్రాయం కాంగ్రెస్ శ్రేణుల్లో వ్యక్తమవుతున్న నేపథ్యంలో, ఈసారి తూర్పు రాజులకు అవకాశం లభిస్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.

సామాజిక వర్గ బలం.. రాజకీయంగా కలిసొచ్చేనా?

తూర్పు రాజులకు ముదిరాజ్ సామాజిక వర్గంలో ఉన్న పరిచయాలు, స్థానికంగా ఉన్న ప్రజా సంబంధాలు ఆయనకు అనుకూలంగా మారవచ్చనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. బడుగు, బలహీన వర్గాల సమస్యలపై ప్రజా సంఘాలతో కలిసి పనిచేసిన అనుభవం కూడా ఆయనకు కలిసివచ్చే అంశంగా ఆయన అనుచరులు భావిస్తున్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో సామాజిక సమీకరణాలకు రాజకీయంగా ప్రాధాన్యత ఉన్న నేపథ్యంలో, వివిధ వర్గాలతో సంబంధాలు కలిగి ఉండటం పీఏసీఎస్ చైర్మన్ పదవి ఎంపికలో ఏ మేరకు ప్రభావం చూపుతుందనేది వేచి చూడాలి.

సంక్షేమ పథకాల ప్రచారంలో చురుకైన పాత్ర

కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో తూర్పు రాజులు చురుకుగా వ్యవహరిస్తున్నారని ఆయన అనుచరులు చెబుతున్నారు. గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొంటున్నారు. పార్టీ కోసం కార్యకర్తగా పనిచేస్తూ, నాయకత్వ నిర్ణయాలకు కట్టుబడి ఉండటం తన రాజకీయ ప్రస్థానంలో భాగమని ఆయన అనుచరులు అభిప్రాయపడుతున్నారు. దీర్ఘకాలిక రాజకీయ

అనుభవంతో పాటు, స్థానికంగా ప్రజలతో ఉన్న సంబంధాలు ఆయనకు మరింత రాజకీయ గుర్తింపును తీసుకొచ్చాయని వారు చెబుతున్నారు.

పీఏసీఎస్ పగ్గాలు ఎవరికి?

ప్రస్తుతం గాంధారి పీఏసీఎస్ చైర్మన్ పదవి చుట్టూ సాగుతున్న రాజకీయ చర్చల్లో తూర్పు రాజుల పేరు ప్రాధాన్యత సంతరించుకుంది. మూడు దశాబ్దాల రాజకీయ అనుభవం, రెండుసార్లు ఎంపీటీసీగా పనిచేసిన నేపథ్యం, ఎమ్మెల్యే మదన్ మోహన్‌తో సుదీర్ఘ అనుబంధం ఆయనకు అనుకూల అంశాలుగా కనిపిస్తున్నాయి. అయితే పీఏసీఎస్ చైర్మన్ పదవి ఎంపికలో పార్టీ నాయకత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? సామాజిక సమీకరణాలు, రాజకీయ అనుభవం, పార్టీకి చేసిన సేవలకు ఎంత ప్రాధాన్యత లభిస్తుంది? అనేది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తూర్పు రాజులకు ఈసారి పీఏసీఎస్ చైర్మన్ పదవి దక్కుతుందా? లేక పార్టీ నాయకత్వం మరో నాయకుడికి అవకాశం కల్పిస్తుందా? అన్నది తేలాల్సి ఉంది. పార్టీ నిర్ణయం ఎలా ఉన్నప్పటికీ ఎమ్మెల్యే మదన్ మోహన్‌తో తన రాజకీయ అనుబంధాన్ని కొనసాగిస్తారనే విశ్వాసాన్ని ఆయన అనుచరులు వ్యక్తం చేస్తున్నారూ....



పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

వారి స్ఫూర్తి, విలువలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలి

జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం, పోలీసు శాఖ అండగా ఉంటాయి



కామారెడ్డి ప్రతినిధి, అక్టోబర్21(సింగిడి): దేశ రక్షణ, అంతర్గత భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. అమరవీరులు చూపిన ధైర్యం, కర్తవ్యనిష్ఠ, సేవాభావాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం, పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. బుధవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీసు ఫ్లాగ్ డే) సందర్భంగా కామారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని అమరవీరుల స్తూపం వద్ద జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్రతో కలిసి కలెక్టర్ పుష్పగుచ్ఛాలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. దేశ సేవలో ప్రాణత్యాగం చేసిన పోలీసు వీరుల సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల రక్షణే పోలీసుల ప్రధాన కర్తవ్యం

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, సమాజ అభివృద్ధి, ప్రజా సంక్షేమం సజావుగా సాగాలంటే శాంతిభద్రతల పరిరక్షణ ఎంతో కీలకమని పేర్కొన్నారు. దేశ సరిహద్దుల్లో సైనికులు, అంతర్గత భద్రతలో పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రజల రక్షణ కోసం అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించేలా పోలీసులు నిరంతరం సేవలందిస్తున్నారని, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల సేవలను సమాజం ఎప్పటికీ మరచిపోకూడదని అన్నారు. పోలీసు అమరవీరుల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని, వారు చూపిన ధైర్యసాహసాలు, క్రమశిక్షణ, విధి పట్ల నిబద్ధత ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. దేశం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేసిన పోలీసు సిబ్బంది సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు.

కామారెడ్డి జిల్లా నుంచి ఏడుగురు పోలీసు అమరవీరులు

కామారెడ్డి జిల్లాకు చెందిన ఏడుగురు పోలీసు అధికారులు, సిబ్బంది ఇప్పటివరకు విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేశారని కలెక్టర్ గుర్తుచేశారు. వారి త్యాగాలు పోలీసు శాఖకు, సమాజానికి ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. అమరవీరుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అమరవీరుల కుటుంబ సభ్యులు ఏవైనా సమస్యలు ఎదుర్కొంటున్నట్లయితే ఎప్పుడైనా తనను సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు. వారి సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వారి కుటుంబాలను ఆదుకోవడం సమాజం, ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత అని పేర్కొన్నారు.

దేశభక్తి, సేవాభావాన్ని పెంపొందించే సంస్మరణ దినోత్సవం

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం కేవలం నివాళులర్పించే కార్యక్రమం మాత్రమే కాదని, దేశభక్తి, సేవాభావం, కర్తవ్యనిష్ఠను ప్రతి ఒక్కరిలో పెంపొందించే సందర్భమని అధికారులు పేర్కొన్నారు. ప్రజల భద్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న పోలీసు సిబ్బంది సేవలను గుర్తించి గౌరవించడం సమాజంలో బాధ్యతాయుతమైన పౌరస్ఫూర్తిని పెంపొందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె. నర్సింహారెడ్డి, డీఎస్పీలు ఎస్. మధుసూదన్, పి. విట్టల్ రెడ్డి, ఎస్. శ్రీనివాసరావు, గట్టుమల్లు, ఉదయ్ భాస్కర్ పాల్గొన్నారు.

అమ్మవారి లడ్డును 2.616 రూపాయలకు దక్కించుకున్న గైని పద్మ సుధాకర్



కామారెడ్డి ప్రతినిధి, అక్టోబర్21(సింగిడి): కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండల్ భూంపల్లి గ్రామంలో హిందూ విరాట్ యూత్ ఆధ్వర్యంలో 20 వార్షికోత్సవం సందర్భంగా దుర్గామాతకు వేద పురోహితుడు ప్రభు ఆధ్వర్యంలో ప్రతిరోజు ఉదయం సాయంత్రం ప్రత్యేక పూజలతో పాటు మాలాధారణ కంకణదారులతో ప్రత్యేక గణపతి పూజ నవగ్రహ పూజ పంచామృత అభిషేకాలు నిర్వహించారు. కౌమారీ పూజలు. ప్రత్యేక దీపాలంకరణ. లక్ష్మి సమేత సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలతో పాటు ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. దుర్గామాత నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజులు అమ్మవారి ప్రత్యేక పూజలు అందుకున్న. లడ్డును 2. 600 రూపాయలకు దక్కించుకున్నగైని పద్మసుధాకర్. వారి కుటుంబానికి దుర్గామాత ఆశీస్సులు ఉండాలని లడ్డును ప్రధానం చేసిన భూంపల్లి గ్రామ సర్పంచ్ గైని శ్రీనివాస్ హిందూ విరాట్ యూత్ క్యాషియర్ సుంకరి వేణుగోపాల్. లడ్డు ప్రధానం చేశారు అంతేకాకుండా తొమ్మిది అవతారాలతో దుర్గమ్మ తల్లి తొమ్మిది చీరాలను

వేలం వెయ్యడం జరిగింది 1. చీర సుంకరి లక్ష్మీ నందం -8516. 2.చీర సుంకరిలత రాజయ్య -1516. 3. చీర-సుంకరి సాయవ్వ మల్లయ్య -1516. 4 .చీర గైని శాంత లక్ష్మణ్-1116. 5.చీర గైని రాధా శ్రీనివాస్ 3116. 6. చీర సుంకరి కళ్యాణి లింగం -2616. 7 చీర సుంకరి లలిత పెద్ద లింగం -3116.8వ. చీర సుంకరి సుగుణ రమేష్-2816. 9వ చీర గైని భారతి సాయిలు-3816. 1వసేపు సుంకర స్వప్న రాజు 1516. 2సేపు గైని వ-నమాల భాస్కర్ 1116.3సేపు సుంకరి లత రాజయ్య-616. 4సేపు గైని అమల సూర్య ప్రకాష్ 616.5సేపు సుంకరి సుదీష్ణ రవికుమార్ 516. 6సేపు సుంకర్ గౌతమి కోటేశ్వర్516. 7వ సేపు గైని వనమాల భాస్కర్ 516. 8వ సేపు గైని శాంత లక్ష్మణ్ 516. 9సేపు సుంకరి నవనీత వేణుగోపాల్ 516. 10వ సేపు సుంకరి లక్ష్మి నర్సింలు 516.1వ దానిమ్మ గైని సావిత్రి శంకర్ 516. 2దానిమ్మగైని జనవ్వ 516. 3దానిమ్మ సుంకరి భూమవ్వ 516. 4 దానిమ్మ గైని అనసూయ రమేష్ 516. వేలంలో లడ్డు చీర దానిమ్మ వంటి దక్కించుకున్నారు వారికి వారి కుటుంబానికి దుర్గామాత ఆశీస్సులు ఉండాలని హిందు విరాట్ యూత్ సభ్యులు కోరుకున్నారు ఈ కార్యక్రమంలో హిందూ విరాట్ యూత్ అధ్యక్షులు గైని రాజేందర్. ఉపాధ్యక్షులు సుంకరి నవీన్ గైని శేఖర్. క్యాషియర్ సుంకరి వేణుగోపాల్. డీజే నిర్వాకుడుగైని రిశ్వంత్(బన్నీ) ప్రధాన కార్యదర్శి గైని శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్తూపానికి నివాళులర్పించిన మానకొండూర్ సి.ఐ. శ్రీలత



మానకొండూర్, అక్టోబర్21(సింగిడి): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మానకొండూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీలత స్థానిక చెరువు కట్ట వద్ద ఉన్న సంజీవ్ అమరవీరుల స్తూపానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సి.ఐ. శ్రీలత మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ కోసం, సమాజ రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అసువులు బాసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని కొనియాడారు. వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది, పలువురు ప్రముఖులు పాల్గొని అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు.

తెలంగాణ రక్షణ సేన పార్టీ మండల అధ్యక్షుడిగా సంపత్ యాదవ్ నియామకం



మానకొండూర్,అక్టోబర్21(సింగిడి): మండల పరిధిలోని రంగపేట గ్రామానికి చెందిన సంపత్ యాదవ్‌ను తెలంగాణ రక్షణ సేన పార్టీ మానకొండూర్ మండల అధ్యక్షులుగా నియమించారు. పార్టీ బలోపేతానికి, ప్రజల పక్షాన నిలబడి పనిచేసేందుకు ఆయనను ఈ పదవికి ఎంపిక చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. తన నియామకంపై సంపత్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ చీఫ్, కల్వకుంట్ల కవితక్కకి, మానకొండూరు నియోజకవర్గ ఇంచార్జ్ చెన్నమల చైతన్య కి ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటూ, మండలంలో పార్టీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఘనంగా దుర్గాభవాని అమ్మవారి శోభాయాత్ర



కొల్చారం, అక్టోబర్ 21 (సింగిడి): కొల్చారం మండలవ్యాప్తంగా దుర్గాభవాని నవరాత్రి ఉత్సవాలు తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారి శోభాయాత్రను భక్తులు ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించిన అనంతరం శోభాయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

రుచికరం..

100 రెట్లు బలవర్ధకం..

హై-ప్రోటీన్ బ్రేక్‌ఫాస్ట్



కావలసిన పదార్థాలు: 4 కప్పుల జొన్న అటుకులు, పావు కప్పు బాదం పప్పు పలుకులు, పావు కప్పు జీడిపప్పు పలుకులు, పావు కప్పు వాల్‌నట్స్ , పావు కప్పు గుమ్మడి గింజలు, పావు కప్పు పుచ్చగింజలు, పావు కప్పు కిస్‌మిస్, పావు కప్పు డ్రైడ్ క్రాన్‌బెర్రీస్ లేకపోతే అర కప్పు కిస్‌మిస్ వాడుకోవచ్చు.

సర్వింగ్ కోసం: 1 కప్పు కాచిన వేడి పాలు లేదా తాజా పెరుగు, కావలసినన్ని తాజా పండ్ల ముక్కలు, 1 టీస్పూన్ తేనె ఐచ్ఛికం – పండ్ల తీపి సరిపోతుంది.

తయారీ విధానం: స్టవ్‌పై వెడల్పాటి పాన్ పెట్టి 4 కప్పుల (250 గ్రాములు) జొన్న అటుకులను వేయాలి. లో-మీడియం మంటపై గరిటెతో కలుపుతూ కేవలం 5 నిమిషాల పాటు క్రిస్పీగా మారే వరకు వేయించి ఒక పెద్ద పళ్లెంలోకి తీసుకుని పూర్తిగా చల్లారనివ్వాలి. అదే పాన్‌లో పావు కప్పు బాదం పలుకులు వేసి లో ఫ్లేమ్‌పై సగం వేగే వరకు వేయించాలి. బాదం వేగడానికి ఎక్కువ సమయం పడుతుంది.

బాదం సగం వేగాక పావు కప్పు జీడిపప్పు, పావు కప్పు వాల్‌నట్ ముక్కలు వేసి లో ఫ్లేమ్‌పై మరికాసేపు వేయించాలి. ఆ తర్వాత పావు కప్పు గుమ్మడి గింజలు, పావు కప్పు పుచ్చగింజలు వేసి గింజలు చిటపటలాడి లేత రంగు మారే వరకు వేయించి.. అటుకులు ఉన్న పళ్లెంలోకి తీసుకుని చల్లారనివ్వాలి. చల్లారిన అటుకులు, నట్స్ మిశ్రమంలో పావు కప్పు కిస్‌మిస్, పావు కప్పు క్రాన్‌బెర్రీస్ వేసి చేత్తో అంతా సమంగా కలిసేలా బాగా మిక్స్ చేయాలి.

ఈ మిశ్రమం పూర్తిగా చల్లారిన తర్వాత గాలి చొరబడని ఎయిర్‌టైట్ డబ్బాలో భద్రపరుచుకుంటే నెల రోజుల పాటు క్రిస్పీగా, తాజాగా నిల్వ ఉంటుంది. ఒక బౌల్‌లో 1 కప్పు కాచిన వేడి పాలు లేదా చల్లటి గడ్డ పెరుగు పోయాలి. ఇందులో మనం సిద్ధం చేసుకున్న జొన్న అటుకుల మూస్లీ మిక్స్‌ను 1 కప్పు వేయాలి. పైనుంచి సన్నగా తరిగిన ఆపిల్, అరటిపండు ముక్కలు మరియు దానిమ్మ గింజలను వేసి బాగా కలపాలి.

రెండు మూడు నిమిషాలు అలాగే ఉంచితే అటుకులు పాలను పీల్చుకుని సాఫ్ట్‌గా నానుతాయి. అంతే, నోరూరించే బలవర్ధకమైన 'జొన్న అటుకుల మూస్లీ' సిద్ధం! డ్రై ఫ్రూట్స్, తాజా పండ్లలోని సహజ తీపితో పంచదార అవసరం లేకుండానే అత్యంత రుచికరంగా ఉండి.. రోజంతా కడుపు నిండుగా ఉంచి బరువును, షుగర్‌ను సులభంగా నియంత్రిస్తుంది!

రక్తం తక్కువగా ఉంటే....



శరీరంలో నీరసంగా ఉన్నా, రక్తహీనతతో బాధపడుతున్నా, లేదా పిల్లల్లో, పెద్దల్లో ఎవరైనా బలహీనంగా ఉన్నా, ఈ చికెన్ లివర్ ఫ్రై ఒక చక్కని పోషకాహార పరిష్కారం. ఈ రుచికరమైన, బలవర్ధకమైన వంటకం కేవలం రెండు మూడు రోజుల్లోనే శక్తినిచ్చి చురుకుగా మారడానికి సహాయపడుతుంది. బీపీ తక్కువగా ఉన్నప్పుడు కూడా ఇది చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ వంటకాన్ని వారానికి ఒక్కసారి చేసుకుని తింటే ఆరోగ్యానికి చాలా మంచిది.

అతివ Athiva

గురువారం
22-10-2026

తయారీకి కావాల్సిన పదార్థాలు..

చికెన్ లివర్ (కందనకాయ) - 500 గ్రాములు
ఆయిల్ - పావు కప్పు
స్టార్ ఫ్లవర్ - 1
దాల్చిన చెక్క - చిన్న ముక్క
యాలకులు - 2-3
ఉల్లిపాయలు - అర కప్పు (చిన్న ముక్కలుగా తరిగినవి)
టమాటా - 1 చిన్నది (చిన్న ముక్కలుగా తరిగినది)
కరివేపాకు - 2-3 రెమ్మలు
అల్లం వెల్లుల్లి పేస్ట్ - 2 టేబుల్ స్పూన్లు
పసుపు - పావు టేబుల్ స్పూన్
ఉప్పు - అర టేబుల్ స్పూన్ (లేదా రుచికి సరిపడా)
కారం - 1 టేబుల్ స్పూన్ (లేదా రుచికి సరిపడా)
జీలకర్ర ధనియాల పొడి - అర టేబుల్ స్పూన్
కొత్తిమీర - కొద్దిగా (తరిగినది)
నిమ్మరసం - 1 టీ స్పూన్ (ఒక చిన్న నిమ్మకాయ ముక్కనుండి)

తయారీ విధానం

1. లివర్ శుభ్రం చేయడం: ముందుగా అర కేజీ లివర్‌ను చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. వీటిని రెండు మూడు సార్లు ఉప్పు, నిమ్మరసంతో శుభ్రంగా కడిగి ఒక గిన్నెలోకి తీసుకుని పక్కన పెట్టుకోవాలి. నిమ్మరసంతో కడగడం వల్ల లివర్ వాసన పోతుంది.

2. మసాలాలు వేయించడం: స్టవ్ మీద ఒక మందపాటి కడాయిని పెట్టుకుని, అందులోనికి పావు కప్పు ఆయిల్ వేయాలి. నూనె వేడైన తర్వాత స్టార్ ఫ్లవర్, దాల్చిన చెక్క, యాలకులు వేసి లైట్ గా వేయించాలి. యాలకులు వేసేటప్పుడు కొద్దిగా ఓపెన్ చేసి వేస్తే అవి పేలకుండా ఉంటాయి.

3. ఉల్లిపాయలు, టమాటా: ఆ తర్వాత తరిగిన ఉల్లిపాయ ముక్కలు వేసి, లేత గోధుమ రంగు వచ్చేవరకు వేయించుకోవాలి. ఉల్లిపాయలు వేగిన తర్వాత, ఒక చిన్న టమాటా ముక్కలు వేసి, టమాటా సాఫ్ట్ గా మగ్గేంత వరకు నిదానంగా వేయించాలి. పెద్ద టమాటా వాడకూడదు, కూరకు స్వీట్నెస్ వస్తుంది.

4. కరివేపాకు, అల్లం వెల్లుల్లి పేస్ట్: టమాటా మగ్గిన తర్వాత రెండు మూడు కరివేపాకు రెమ్మలు వేసి చిటపటలాడేంత వరకు వేయించాలి. ఆ తర్వాత రెండు టేబుల్ స్పూన్ల అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి, పచ్చి వాసన పోయేంత వరకు సిమ్ లో పెట్టి వేయించాలి. ఆయిల్ పైకి తేలే వరకు వేయిస్తే సరిపోతుంది.

5. లివర్ ఉడికించడం: శుభ్రం చేసుకున్న లివర్ ముక్కలను వాటర్ లేకుండా కడాయిలోనికి వేయాలి. పావు టేబుల్ స్పూన్ పసుపు, అర టేబుల్ స్పూన్ ఉప్పు వేసి, ముక్కలకు బాగా పట్టేలా కలపాలి. మూత పెట్టి ఐదు నిమిషాలు ఉడికించాలి. లివర్ నుండి నీరు ఊరి వస్తుంది.

6. సమంగా ఉడికించడం: లివర్, కందనకాయ కలిపి వేసుకుంటే, ఒకటి గట్టిగా, ఇంకొకటి సాఫ్ట్ గా ఉంటాయి కాబట్టి, స్టవ్ ను మీడియం మంటలో పెట్టి మరో ఐదు నిమిషాలు మూత పెట్టి నిదానంగా ఉడికించాలి. హై లో పెడితే నీరు త్వరగా ఇంకిపోయి ముక్కలు సరిగా ఉడకవు. ఐదు నిమిషాల తర్వాత నీరు ఇంకిపోయి, ఆయిల్ పైకి తేలుతుంది.

7. కారం, మసాలాలు: ఈ సమయంలో ఒక టేబుల్ స్పూన్ కారం వేసి కలపాలి. ఎక్కువ స్పైసీ కావాలంటే రెండు మూడు పచ్చిమిర్చిని చీల్చి వేసుకోవచ్చు. కారం వేసిన తర్వాత, పీసులకు ఉప్పు, కారం, మసాలాలు పట్టేలా సిమ్ లో పెట్టి ఐదు నినిషాలు మూత పెట్టి ఉడికించాలి.

8. ఫైనల్ టచ్: ఆ తర్వాత అర టేబుల్ స్పూన్ జీలకర్ర ధనియాల పొడి, కొద్దిగా తరిగిన కొత్తిమీర వేసి కలపాలి. చివరగా ఒక చిన్న నిమ్మ ముక్కరసం పిండి వేయాలి. నాన్ వెజ్ వంటకాల్లో నిమ్మరసం వేయడం వల్ల రుచి మరింత పెరుగుతుంది.

9. ముగింపు: ఈ మిశ్రమాన్ని అడుగు పట్టకుండా ఒక నిమిషం పాటు సిమ్ లో నిదానంగా కలుపుతూ ఉండాలి. మసాలా అంతా ముక్కలకు పట్టడానికి ఒక నిమిషం పాటు మూత పెట్టి ఉడికించాలి. ఒక నిమిషం తర్వాత మూత తీసి ఒక్కసారి కలిపి స్టవ్ ఆఫ్ చేసేయాలి.

అంతే! ఎంతో రుచికరమైన, ఆరోగ్యకరమైన చికెన్ లివర్ ఫ్రై సిద్ధం. ఇది వేరే కాంబినేషన్ లేకుండానే బౌల్లో వేసుకుని హ్యాపీగా ఎంజాయ్ చేయవచ్చు. మీరు కూడా ఒకసారి తప్పకుండా ప్రయత్నించండి

స్టాక్ మార్కెట్ Stock Market

10 రోజుల్లో రూ.7000 తగ్గిన బంగారం ధర..

వెండి రూ.20 వేలు డౌన్.. ఇంకా తగ్గుతాయా? మార్కెట్ అంచనాలివే!



బంగారం, వెండి ధరలు భారీగా పడిపోతున్నాయి. గడిచిన 10 రోజుల్లో తులం బంగారం ధర ఏకంగా రూ.7000 పైనపడిపోయింది. పది సెషన్లలోకేవలం 3 సెషన్లలో మాత్రమే స్వల్పంగా పెరిగి మిగితా రోజుల్లో తగ్గుతూ వచ్చింది. ఇక వెండి రేటు రూ.20 వేల మేర దిగివచ్చింది. మరి బంగారం ధరలు తగ్గేందుకు కారణాలేంటి? ధరలు ఇంకా తగ్గుతాయా? మార్కెట్ అంచనాలు ఎలా ఉన్నాయి? అనే వివరాలు ఈ కథనంలో తెలుసుకుందాం. బంగారం, వెండి ధరలు భారీగా దిగివస్తున్నాయి. అమెరికా- ఇరాన్ మధ్య యుద్ధం కొనసాగుతుండడంతో చమురు ధరలు భారీగా పెరిగాయి. చమురు మంటలతో నెలకొన్నద్రవ్యోల్బణం భయాలు, అమెరికా ఫెడ్ వడ్డీ రేట్ల పెంపు అంచనాలతో బంగారం, వెండికి గిరాకీ సన్నగిల్లుతోంది. దీంతో వీటి ధరలు ఒత్తిడికి గురవుతున్నాయి. ఫెడ్ ఇటీవలే వడ్డీ రేట్లను పెంచడంతో డాలర్ విలువ పెరగడం, బాండ్ ఈల్డ్స్ పెరగడంతో ఇన్వెస్టర్లు అటువైపు మళ్లారు. మరోసారి వడ్డీ రేట్లను పెంచుతారనే అంచనాలతో బంగారం, వెండి నుంచి పెట్టుబడులను తీసుకుని డాలర్‌పై ఇన్వెస్ట్ చేస్తున్నారు. ఈప్రభావంత ఈ విలువైనలోహాల ధరలు పడిపోతున్నట్ల మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. సెప్టెంబర్ 20వ తేదీ నుంచి చూసుకుంటే గడిచిన ఈ 10 రోజుల్లో తులం బంగారం ధర రూ.7000లకు పైగా పడిపోయింది. కిలో వెండి ధర రూ.20 వేలకు పైగా దిగివచ్చింది.

సెప్టెంబర్ 20 నుంచి

సెప్టెంబర్ 29 మధ్య ధరలు

సెప్టెంబర్ 20వ తేదీన 24 క్యారెట్ల మేలిమి బంగారం ధర 10 గ్రాములు రూ.1,55,840 వద్ద ఉంది. ఆ తర్వాత వరుసగా తగ్గుతూ వస్తోంది. మధ్యలో రెండు సెషన్లలో స్వల్పంగా పెరిగినా అంత పెద్దగా ప్రభావం కనిపించలేదు. దీంతో సెప్టెంబర్ 29వ తేదీ నాటికి 10 గ్రాముల బంగారం ధర రూ. 7040 మేర తగ్గింది. దీంతో తులం రేటు రూ.1,48,800 వద్దకు దిగివచ్చింది. ఇక వెండి ధర సైతం భారీగానే దిగివస్తోంది. సెప్టెంబర్ 20వ తేదీన కిలో వెండి రేటు దేశీయ మార్కెట్లో రూ.2,60,000 మార్క్ వద్ద ఉండగా ఆ తర్వాత పలు సెషన్లలో రూ.5 వేల చొప్పున పడిపోయింది. దీంతో సెప్టెంబర్ 29వ తేదీ నాటికి రూ.20 వేల మేర తగ్గింది. దీంతో ప్రస్తుతం కిలో వెండి రేటు రూ.2,40,000 వద్దకు దిగివచ్చింది.

ఎంసీఎక్స్ మార్కెట్ స్టేటస్

గోల్డ్, సిల్వర్ ఫ్యూచర్స్ మంగళవారం నాటి ట్రేడింగ్‌లో క్షీణించాయి. అమెరికా బాండ్ ఈల్డ్స్ పెరగడం, యూఎస్-ఇరాన్ మధ్య అనిశ్చితి కొనసాగడంతో వీటి ధరలపై ప్రభావం పడుతోంది. సిల్వర్ ధర 1 శాతానికి పైగా పతనమైంది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (వీజశ)లో డిసెంబర్ గోల్డ్ ఫ్యూచర్స్ 10 గ్రాములకు రూ.487 మేర తగ్గి రూ.1,48,410 వద్దకు తగ్గింది. ఒక దశలో 0.35 శాతం మేర తగ్గి రూ.1,48,150 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. ఇక డిసెంబర్ సిల్వర్ ఫ్యూచర్ ట్రేడింగ్ 0.93 శాతం క్షీణించి కిలోకు రూ.2,25,338 పడిపోయింది.

బ్లాక్ మండే.. ఇన్వెస్టర్లకు మళ్లీ రూ. 5 లక్షల కోట్లు లాస్

బ్లాక్ మండే.. ఇన్వెస్టర్లకు మళ్లీ రూ. 5 లక్షల కోట్లు లాస్..



మార్కెట్లు కుప్పకూలడానికి కారణాలివే

గత వారం భారీగా పుంజుకున్న భారతీయ స్టాక్ మార్కెట్ మళ్లీ కుప్పకూలింది. మరోసారి బ్లాక్ మండే ను గుర్తుచేసింది. అక్టోబర్ 19 సెషన్?లో సెన్సెక్స్ ఏకంగా 1000 పాయింట్లకుపైగా పడిపోయింది. పలు హెవీవెయిట్ స్టాక్స్ దారుణంగా నష్టపోతున్నాయి. యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వంటి ప్రైవేట్ బ్యాంక్ స్టాక్స్ పడిపోతుండగా, ప్రభుత్వ రంగ బ్యాంకిం గ్ స్టాక్స్ స్వల్పంగా రాణిస్తున్నాయి. ఇన్వెస్టర్లకు ఇవాళ్టి సెషన్‌లో రూ. 5 లక్షల కోట్లకుపైగా నష్టం వాటిల్లింది.

అక్టోబర్ 19 స్టాక్ మార్కెట్ పతనం

భారత స్టాక్ మార్కెట్లలో మళ్లీ తీవ్ర అమ్మకాల ఒత్తిడి కనిపిస్తోంది. అక్టోబర్ అంటేనే స్టాక్ మార్కెట్ క్రాష్‌లు గుర్తుకొస్తాయి. ఇప్పటికే ఈ నెల ఆరంభంలో సూచీలు భారీగా పతనం అవగా, గత వారం మాత్రం గణనీయంగా పుంజుకుంది. ఏమైందో ఏమో మళ్లీ సోమవారం వచ్చే సరికి బ్లాక్ మండే పరిస్థితుల్ని గుర్తుకు తెచ్చింది. ఇన్వెస్టర్లకు పీడకలను మిగిల్చేలా సూచీలు భారీగా పతనం అయ్యాయి. అక్టోబర్ 19 సెషన్‌లో ప్రస్తుతం వార్త రాసే సమయంలో మధ్యాహ్నం 2.45 గంటలకు సెన్సెక్స్ ఏకంగా 1000 పాయింట్ల పతనంతో 73720 స్థాయిలో ట్రేడవుతోంది. మరోవైపునేషనల్‌స్టాక్ఎక్స్ఛేంజిసూచీనిఫ్టీ దాదాపు 300 పాయింట్లు పడిపోయింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 73708.54 వద్ద కనిష్ఠాన్ని తాకింది. అక్కడి నుంచి కాస్త కోలుకున్నా ఇన్వెస్టర్లకు ఊహించని స్థాయిలో నష్టాల్ని మిగిలిస్తోంది.స్టాక్ మార్కెట్ పడిపోతున్న క్రమంలోనే ఇన్వెస్టర్ల సంపద రూ. 5 లక్షల కోట్లకుపైగా ఆవిరైపోయింది. కిందటి సెషన్ క్లోజింగ్ సమయంలో మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ. 473 లక్షల కోట్ల స్థాయిలో ఉండగా ఇప్పుడు అది రూ. 468 లక్షల కోట్ల దిగువకు చేరింది. గత వారంలో లాభాలు రాగా, ఇప్పుడు ప్రాఫిట్ బుకింగ్ కూడా మార్కెట్లో నష్టాలకు ప్రధాన కారణాల్లో ఒకటిగా ఉందని తెలుస్తోంది.డబ్బు గురించి ఆందోళన చెందుతున్నారా? నిమిషాల్లో సులభమైన లోన్స్ పొందండిసెన్సెక్స్ 30 ప్యాక్ ఇండెక్స్‌లో చూస్తే అదానీ పోర్ట్స్, ఎస్బీఐ, ఎల్ అండ్ టీ, మారుతీ సుజుకీ, టీసీఎస్, ఇండిగో వంటివి లాభాల్లో ఉండగా, ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ స్టాక్స్, ఇతర ఐటీ, ఫీవీజ+ స్టాక్స్ నష్టపోతున్నాయి. యాక్సిస్ బ్యాంక్ అత్యధికంగా 4 శాతానికిపైగా పడిపోయింది. అల్ట్రా సిమెంట్, బ్రెంట్, ఇన్ఫోసిస్, హిందుస్థాన్ యూనిలివర్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫినాన్స్, టీూజ వంటివి 2 శాతానికిపైగా పడిపోయాయి.

మార్కెట్ల పతనానికి ప్రధాన కారణాలివే

ప్రైవేట్ బ్యాంకుల బలహీన ఫలితాలు- ఇటీవల వీకెండ్‌లో అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంకులు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆర్థిక ఫలితాలు విశ్లేషకుల అంచనాల్ని అందుకోలేకపోయాయి. మేనేజ్‌మెంట్ ఆందోళనల వల్ల బ్యాంకింగ్ రంగం భారీగా నష్టపోతోంది. ఈ క్రమంలోనే యాక్సిస్ బ్యాంక్ అత్యధికంగా నష్టపోగా, ఎణఖీజ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్ ఇలా అన్నీ నష్టాల్లోనే ఉన్నాయి.గ్లోబల్ టెక్/ఏఐ షేర్ల విక్రయాలు- గత వారం అమెరికా మార్కెట్లలో ఏఐ ఆధారిత, సెమీకండక్టర్ స్టాక్స్‌లో భారీగా అమ్మకాలు జరగడం వల్ల మన ఐటీ, ఇతర రంగాలపై ప్రభావం పడింది.క్రూడాయిల్ ధరలు- బ్రెంట్ క్రూడ్ ధరలు స్వల్పంగా తగ్గినా ఇంకా గరిష్ఠ స్థాయిల్లోనే ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం బ్రెంట్ ముడి చమురు ధర 108 డాలర్లకుపైన ఉండగా, దిగుమతులపై అధికంగా ఆధారపడే భారత్ వంటి దేశాలకు ఇది ప్రతికూలంగా మారింది. ఇది కూడా అమ్మకాల ఒత్తిడి కారణమైంది.వీటికి తోడు ప్రాఫిట్ బుకింగ్, అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాలు, ఇంకా విదేశీ పెట్టుబడిదారులు తమ పెట్టుబడుల్ని భారీగా ఉపసంహరించుకుంటుండటం కారణాలుగా ఉన్నాయి. ముఖ్యంగా గత వారం ఐటీ స్టాక్స్ భారీగా రాణించగా, వాటిల్లో ఇప్పుడు అమ్మకాల ఒత్తిడి కనిపిస్తోంది.

ఒకసారి బోనస్, 3 సార్లు డివిడెండ్..

రూ. 1.46 లక్షల పెట్టుబడికి 5 లక్షలొచ్చాయ్.. కాసుల పంట!



స్టాక్ మార్కెట్లలో కొన్ని స్టాక్స్ దీర్ఘకాలంలో మంచి రిటర్న్స్ అందిస్తుంటాయి. అయితే ఇక్కడ సరైన స్టాక్ ఎంచుకున్నామా లేదా అనేది ముఖ్యం. ఇప్పుడు గత 4 ఏళ్ల కాలంలో మంచి రిటర్న్స్ ఇచ్చిన ఒక స్టాక్ గురించి చూద్దాం. బ్రైట్ అవుట్‌డోర్ మీడియా ఐపీఓలు రూ. 1.46 లక్షల పెట్టి, షేర్లను ఇప్పటివరకు కొనసాగించిన ఇన్వెస్టర్ పెట్టుబడి విలువ రూ. 5.02 లక్షలకు చేరింది. ఇక్కడ బోనస్ ఇష్యూ కారణంగా షేర్ల సంఖ్య పెరగడం కూడా ఒక కారణం. 3 సార్లు కంపెనీ డివిడెండ్‌ను కూడా ప్రకటించింది.మీరు స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేస్తున్నారా? అయితే ఇక్కడ ఎలాంటి స్టాక్స్‌ను ఎంచుకుంటున్నారు. కొందరు తొందరపడి ఏదో ఒక స్టాక్‌లో పెట్టుబడులు పెట్టి మోసపోతుంటారు. అన్ని విషయాలు తెలుసుకోకపోవడమే ఇక్కడ సమస్య. కొందరు ఆలోచించి ఇన్వెస్ట్ చేసినా నష్టపోతుంటారు. అందుకే ఇక్కడ మార్కెట్లో ఇన్వెస్ట్ చేసే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం ముఖ్యం. సరైన స్టాక్ ఎంచుకోవడం ముఖ్యం. ఇంకా స్టాక్ మార్కెట్లో స్వల్పకాలం కంటే దీర్ఘకాలంలో మంచి రిటర్న్స్ అందించే స్టాక్స్ చాలానే ఉన్నాయి. అలాంటి వాటిల్లో ఒకటి బ్రైట్ అవుట్‌డోర్ మీడియా లిమిటెడ్ ఒకటి. ఈ కంపెనీ ఐపీఓలో రూ. 1.46 లక్షలు పెట్టుబడి పెట్టి, ఐపీఓ కింద సక్సెస్‌ఫుల్‌గా షేర్లు అలాట్ అయిన వారు అలానే కొనసాగించి ఉన్నట్లయితే ఆ పెట్టుబడి విలువ ఇప్పుడు రూ. 5.02 లక్షలకు చేరింది.ఇక్కడ ఇన్నేళ్ల కాలంలో షేర్ ధర పెరగడంతో పాటుగా బోనస్ షేర్లు, డివిడెండ్లు కూడా ఉన్నాయి. అయితే గతంలో వచ్చిన రాబడులు భవిష్యత్తులో నూ వస్తాయన్న హామీ ఉండదని గుర్తుంచుకోవాలి. ఇక్కడ పేర్కొన్న దానిని ఒక ఉదాహరణగానే చూడాలి. బ్రైట్ అవుట్‌డోర్ మీడియా ఐపీఓ 2023 మార్చిలో వచ్చింది. ఇక్కడ ఒక్కో షేరు ధర అప్పట్లో రూ. 146 గా నిర్ణయించారు. ఐపీఓ కింద ఒక్కో లాట్ కింద 1000 షేర్లుగా నిర్ణయించారు. దీంతో కనీస పెట్టుబడి విలువ రూ. 1.46 లక్షలుగా ఉంది. ఇక్కడ ఐపీఓలో ఇన్వెస్ట్ చేసిన వారికి లాట్ వస్తే వారికి 1000 షేర్లు వస్తాయి. ఇక 2025 జులై 18న ఇది 1:2 రేషియోలో బోనస్ ఇష్యూ ప్రకటించింది. ఇక్కడ ప్రతి 2 షేర్లకు అదనంగా ఒక్కో షేరు వచ్చింది. అంటే 100 షేర్లకు 50 షేర్లు అదనంగా వచ్చాయి. అదే విధంగా 1000 షేర్లకు అదనంగా 500 షేర్లు రాగా మొత్తం షేర్ల సంఖ్య 1500 గా అయింది.బోనస్ షేర్లు అనేవి నగదు రూపంలో ఇచ్చేది కాదు. కంపెనీ తమ వాటాదారులకు అదనపు షేర్లను కేటాయిస్తుంది. దీని వల్ల షేర్ల సంఖ్య పెరుగుతుంది. అయితే బోనస్ ప్రకటించినంత మాత్రాన పెట్టుబడి మొత్తం విలువ పెరుగుతుందని భావించొచ్చు. ఇక్కడ బోనస్ ఇష్యూకు అనుగుణంగా షేర్ ధర పడిపోతుంది. మరోవైపు కంపెనీ 3 సందర్భాల్లో డివిడెండ్లు కూడా ప్రకటించింది. ప్రతి షేరుకు రూ. 0.50 చొప్పున ఫైనల్ డివిడెండ్ ప్రకటించింది. 2024 సెప్టెంబర్ 19న ఒకసారి, 2025 సెప్టెంబర్ 22న రెండోసారి, 2026, సెప్టెంబర్ 21న మూడోసారి డివిడెండ్ ప్రకటించింది. ఇది వాటాదారులకు నేరుగా నగదు రూపంలోనే అందుతుంది. కాబట్టి షేర్లను విక్రయించకుండానే, కేవలం షేర్లను కలిగి ఉన్న కారణంగా ఇక్కడ డివిడెండ్ పొందారు. ఇది పూర్తిగా అదనపు లాభం అని చెప్పొచ్చు. బ్లాక్ మండే.. ఇన్వెస్టర్లకు మళ్లీ రూ. 5 లక్షల కోట్లు లాస్..

మార్కెట్లు కుప్పకూలడానికి కారణాలివే

ఇక ప్రస్తుతం బ్రైట్ అవుట్‌డోర్ మీడియా షేర్ ధరరూ. 335గా ఉంది. బోనస్ తర్వాత ఇన్వెస్టర్ దగ్గర 1500 షేర్లు ఉంటాయి. కాబట్టి ప్రస్తుత షేర్ ధర ప్రకారం పోర్ట్‌ఫోలియో విలువ రూ. 5,02,500 గా ఉంటుంది.

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi
గురువారం 22-10-2026

ఇసుక అక్రమ రవాణా చేస్తే

కఠిన చర్యలు: సిఐ నవీన్



కమలాపూర్, (సింగిడి): మండలంలో అక్ర మంగా ఇసుక తరలిస్తున్నరెండు ట్రాక్టర్లను పట్టుకొనికేసునమోదు చేసినట్లు సి ఐ పి నవీన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమ యంలో, ఉప్పల్ గ్రామం వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన రెండు ట్రాక్టర్ లను పట్టుకొని గరిగంటి నరేష్,చిలుక శివల పైకేసులు నమోదు చేసి రెండు ట్రాక్టర్ లను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సి ఐ మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలించినా, అక్రమ ఇసుక రవాణాకు పాల్పడినా కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సి ఐ హెచ్చరించారు

గ్రామపంచాయతీ అభివృద్ధికి

నిరంతరం కృషి చేస్తా

- లక్ష్మతండా సర్పంచ్ బాణోతు కర్ణ నాయక్



డోర్నకల్ /మరిపెడ (సింగిడి): లక్ష్మతండా గ్రామ పంచా యతీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని గ్రామ సర్పంచ్ బాణోతు కర్ణ నాయక్ తెలిపారు. గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక సదు పాయాలు కల్పించడంతో పాటు, ప్రజలు ఎదు ర్కొంటున్న సమస్య లను ఎప్పటిక ప్పుడు పరిష్కరిం చేందుకు కృషి చేస్తానని పేర్కొన్నా రు.గ్రామంలో వీధి దీపాలు, తాగు నీరు, పారిశుధ్యం తదితర సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, గ్రామాన్నిఅభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని తెలిపారు. ప్రజల సహకారంతో గ్రామపంచాయతీని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని సర్పంచ్ బాణోతు కర్ణ నాయక్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షులు,వార్డ్ మెంబర్లు ఇంకా తదితరులు పాల్గొన్నారు..

నాగారంలో బతుకమ్మ వేడుకలకు

విద్యుత్ సదుపాయాల ఏర్పాటు



హుస్నాబాద్ (సింగిడి):తెలంగాణ పూల పండుగ బతుకమ్మ వేడుకల సందర్భంగా హుస్నాబాద్ మండలం నాగారం గ్రామంలో సర్పంచ్ ఇజ్జగిరి సం పత్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు ము మ్మరంగా చేపడుతున్నారు. నాగా రం గ్రామం నుంచి సమీపంలోని రాజీవ్ కుంట వరకు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. గత కొన్నేళ్లుగా బతుకమ్మ ఆడేందుకు రాజీవ్ కుంటకు వెళ్లే ఆడపడుచులు చీకటితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచు కొని విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంతో పాటు త్వరలో విద్యుత్ దీపాలను కూడా బిగించనున్నట్లు సర్పంచ్ ఇజ్జగిరి సంపత్ తెలిపారు. బతుకమ్మ వేడుకల్లో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

మొటాటిపల్లిలో

పంచాయతీ భవన నిర్మాణం

నూతన భవనానికి స్లాబ్ పనులు పూర్తి



బిక్కనూర్,(సింగిడి):భిక్కనూర్ మండలం మొటాటిపల్లి గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం భవనానికి స్లాబ్ వేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గంధం భూమయ్య, ఉపసర్పంచ్ సూరెడ్డి రాజిరెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తిప్పాపూర్ వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా తాటిపల్లి ధర్మయ్య

ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సూచనల మేరకు నియామకం



బిక్కనూర్,(సింగిడి):భిక్కనూర్ మండలం తిప్పాపూర్ గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ఎండోమెంట్ చైర్మన్‌గా తాటిపల్లి ధర్మయ్యను నియమించారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సూచనల మేరకు ధర్మయ్యను చైర్మన్‌గా ఎంపిక చేశారు.ఆలయ ధర్మకర్తలుగా ఏనుగు బాపురెడ్డి, శామర్థి సత్యనారాయణ, వంగ మల్లీశ్వరి, చెన్నయగారి దుర్గాగౌడ్‌లను ఎన్నుకున్నారు.

పన్నులు వసూలు చేస్తున్నారు.. లెక్కలు ఎక్కడ?

వసూలైన పన్నులు ట్రెజరీలో జమ చేస్తున్నారా? మంగపేట మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో సమగ్ర విచారణ జరిపి ఆడిటింగ్ నిర్వహించాలని ప్రజల డిమాండ్



ములుగు ప్రతినిధి, (సింగిడి): ప్రజల నుంచి వివిధ రకాల పన్నులు వసూలు చేస్తున్న గ్రామ పంచాయతీల్లో ఆ నిధుల జమ, వినియోగం, రికార్డుల నిర్వహణపై పారదర్శకత ఉండాలనే డిమాండ్ వినిపిస్తోంది. మంగపేట మండల పరిధిలోని 25 గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులు, నీటి పన్నులు తదితర రూపాల్లో వసూలవుతున్న ప్రజాధనం నిబంధనల ప్రకారం సంబంధిత ఖాతాల్లో లేదా ట్రెజరీలో జమవుతోందా? వసూలైన మొత్తాలకు సంబంధించిన లెక్కలు సక్రమంగా నిర్వహిస్తున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పన్నుల రూపంలో ప్రజల నుంచి వసూలు చేసిన ప్రతి రూపాయికి స్పష్టమైన లెక్క ఉండాలని, ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. పన్నుల వసూళ్లు ఎన్నో.. జమలు ఎక్కడ? గ్రామ పంచాయతీల పరిధిలో ఇంటి పన్నులు, నీటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు, వ్యాపార లైసెన్స్ ఫీజులు, భవన నిర్మాణ అనుమతుల రుసుములు తదితర మార్గాల ద్వారా ఆదాయం సమకూరుతుంది. అయితే వసూలైన మొత్తాలను నిబంధనల ప్రకారం సంబంధిత పంచాయతీ ఖాతాల్లో లేదా వర్తించే ప్రభుత్వ ఖాతాల్లో జమ చేస్తున్నారా? జమ చేసిన మొత్తాలకు సంబంధించిన ఆధారాలు, రికార్డులు సక్రమంగా నిర్వహిస్తున్నారా? అనే అంశాలపై స్పష్టత అవసరమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. పన్నులు వసూలు చేయడం మాత్రమే కాకుండా, ఆ సొమ్ము ఎక్కడ జమైంది, ఎలా వినియోగించారు అనే వివరాలను కూడా అధికారులు వెల్లడించాలని కోరుతున్నారు. వసూలైన సొమ్ము ట్రెజరీలో జమవుతోందా? ప్రజల నుంచి వసూలు చేసిన పన్నుల మొత్తాలను సంబంధిత నిబంధనల ప్రకారం నిర్దేశిత ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుంది. అయితే మంగపేట మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో వసూలైన సొమ్ము జమలకు సంబంధించిన ప్రక్రియ ఎలా కొనసాగుతోంది? ఏయే పంచాయతీల్లో ఎంత మొత్తం వసూలైంది? ఎంత మొత్తం జమ చేశారు? వసూళ్లకు, జమలకు మధ్య ఏమైనా తేడాలు ఉన్నాయా? అనే అంశాలను పరిశీలించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. ప్రతి పంచాయతీకి సంబంధించిన వసూళ్ల రసీదులు, నగదు రిజిస్టర్లు, బ్యాంకు ఖాతాల వివరాలు, ట్రెజరీ చలానాలు వర్తించే చోట వాటిని సరిపోల్చి పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ట్రెజరీలో లేదా సంబంధిత ఖాతాల్లో జమ చేయాల్సిన మొత్తాలు జమయ్యాయా లేదా అన్నది విచారణతో స్పష్టం చేయాలని కోరుతున్నారు. రికార్డుల్లో తేడాలుంటే బాధ్యులెవరు? పన్నుల వసూళ్ల రిజిస్టర్లు, రసీదులు, జమల వివరాలు, ఖర్చులకు సంబంధించిన బిల్లులు, వోచర్లను క్షుణ్ణంగా పరిశీలించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రికార్డుల్లో నమోదైన వివరాలకు, వాస్తవ వసూళ్లకు మధ్య ఏవైనా తేడాలు ఉన్నాయా? జమ చేయాల్సిన మొత్తాలు పూర్తిగా జమయ్యాయా? అనే అంశాలను ఆడిటింగ్ ద్వారా నిర్ధారించాలని సూచిస్తున్నారు. విచారణలో అవకతవకలు లేదా నిబంధనల ఉల్లంఘనలు బయటపడితే బాధ్యులను గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అయితే ఈ అంశాలపై అధికారిక నిర్ధారణ కావాల్సి ఉంది. కార్యదర్శులు--కారోబార్ల విధులపై సమీక్ష అవసరం గ్రామ పంచాయతీల్లో గ్రామ కార్యదర్శులు, కారోబార్ల విధుల నిర్వహణ, బాధ్యతల పంపిణీ, పరస్పర సమన్వయంపై ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. పన్నుల వసూళ్లు, రసీదుల జారీ, నగదు లెక్కల నమోదు, జమల వివరాల నిర్వహణ వంటి కీలక అంశాల్లో పారదర్శకత ఉండాలని పేర్కొంటున్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం లేదా సమన్వయ లోపం ఉన్నట్లు తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ప్రజాధనం అభివృద్ధి పనులకు ఖర్చవుతోందా? గ్రామాల్లో పారిశుధ్యం, మురుగునీటి కాలువల నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, చెత్త సేకరణ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు పంచాయతీ నిధులు వినియోగించాల్సి ఉంటుంది. ప్రజలు పన్నులు చెల్లిస్తున్న నేపథ్యంలో వసూలైన ఆదాయాన్ని ఏయే పనులకు ఎంత ఖర్చు చేస్తున్నారో తెలుసుకునే అవకాశం కల్పించాలని కోరుతున్నారు. పంచాయతీల ఆదాయ, వ్యయ వివరాలతో పాటు నిధుల జమ, ఖర్చులకు సంబంధించిన సమాచారాన్ని కూడా ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచిస్తున్నారు. 25 పంచాయతీల్లో సమగ్ర ఆడిటింగ్ నిర్వహించాలి మంగపేట మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూళ్లు, ట్రెజరీ లేదా సంబంధిత ఖాతాల్లో జమలు, నిధుల వినియోగం, రికార్డుల నిర్వహణపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఆదాయ, వ్యయ రికార్డులను ఆడిట్ చేయించి, వసూలైన మొత్తం ఎంత? జమ చేసిన మొత్తం ఎంత? ఖర్చు చేసిన మొత్తం ఎంత? ఇంకా జమ చేయాల్సిన మొత్తాలు ఏమైనా ఉన్నాయా? అనే వివరాలను వెల్లడించాలని కోరుతున్నారు. అవసరమైతే గత సంవత్సరాల రికార్డులను కూడా పరిశీలించి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని సూచిస్తున్నారు. వార్తలు వస్తున్నా అధికారుల స్పందన ఏదీ? గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూళ్లు, నిధుల జమ, వినియోగంపై వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి స్పష్టమైన వివరణ ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. వసూలైన ప్రజాధనం నిబంధనల ప్రకారం జమవుతోందా? రికార్డులు సక్రమంగా ఉన్నాయా? అనే అంశాలపై అధికారికంగా వివరాలు వెల్లడిస్తే ప్రజల్లో నెలకొన్న సందేహాలకు సమాధానం లభిస్తుందని అభిప్రాయపడుతున్నారు. ప్రజలు చెల్లించే ప్రతి రూపాయికి లెక్క ఉండాలి మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూళ్లు, జమలు, ఆదాయ వ్యయాల వివరాలపై పారదర్శకత పెంచేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. విచారణలో ఏవైనా అవకతవకలు బయటపడితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజలు చెల్లించే ప్రతి రూపాయి నిబంధనల ప్రకారం జమై, ప్రజావసరాలకు వినియోగమయ్యేలా చూడాలని కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ

నిరుపేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం.



భిక్కనూర్,(సింగిడి)::తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా భిక్కనూర్ మండలం రామేశ్వర్‌పల్లి గ్రామంలో శుక్రవారం ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీపీసీసీ జనరల్ సెక్రటరీ, పీఏసీఎస్ చైర్మన్ బద్దం ఇంద్రకరణ్ రెడ్డికొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించి ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌చేపూరి రాణీ రాజు, ఉపసర్పంచ్‌గొల్లపల్లి వినోద్ కుమార్ గౌడ్, వార్డు సభ్యులు భవాని ధర్మస్వామి, మన్నె కళ్యాణి రవి, కూతురు రమేష్, పనాస రాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కడారి నాగరాజు, పెద్ద రమేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్యామ్, లబ్ధిదారు కడారి అనసూయ బలరాం, పంచాయతీ సిబ్బంది, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించిన సర్పంచ్ సరిత

మహదేవపూర్ (సింగిడి):జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామంలోని గొల్లవాడలో త్రాగునీటి సమస్యను స్థానిక సర్పంచ్ ఏల్పుల సరిత పరిష్కరించారు. గత కొంతకాలంగా గొల్లవాడలో మోటర్ చెడిపోయి త్రాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆ మీ దృష్టికి రాగా వెంటనే నూతన మోటర్ ను బిగించి సమస్యను పరిష్కరించారు. దీంతో వాడ ప్రజలు సర్పంచ్ తో పాటు కార్యదర్శి స్వాతికి కృతజ్ఞతలు తెలిపారు.



బతుకమ్మ ఘాట్లను పరిశీలించిన

డీఆర్డీఓ జయదేవ్ ఆర్య



హుస్నాబాద్ (సింగిడి): హుస్నాబాద్ మండలం తోటపల్లి, గాంధీనగర్ ఉమ్మడి గ్రామాల్లో బతుకమ్మ వేడుకల కోసం ఏర్పాటు చేస్తున్న ఘాట్లను సిద్దిపేట జిల్లా డీఆర్డీఓ జయదేవ్ ఆర్య పరిశీలించారు. ఘాట్ల వద్ద జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, బతుకమ్మలను నీటిలో నిమజ్జనం చేసే సమయంలో మహిళలు, ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఘాట్ల వద్ద విద్యుత్ దీపాల ఏర్పాటు, ఇతర మౌలిక సదుపాయాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. బతుకమ్మ వేడుకలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో తోటపల్లి, గాంధీనగర్ గ్రామాల సర్పంచులు పోలు సంపత్, బంక లక్ష్మి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చందు, ఎంపీఓ రమేష్, పంచాయతీరాజ్ ఏఈ రవిచంద్ర, టెక్నికల్ అసిస్టెంట్ పర్షరాములు గ్రామ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా అవకాశం కల్పించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు

మంత్రి సీతక్క, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడుద

పైడాకుల అశోక్‌కు ధన్యవాదాలు తెలిపిన అయ్యోరి యానయ్య



ములుగు ప్రతినిధి, (సింగిడి): ములుగు జిల్లా ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా తనను నియమించి కీలక బాధ్యతలు అప్పగించినందుకు రాష్ట్ర పంచాయ తీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమం, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్కకు, ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్‌కు అయ్యోరి యానయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.తన నియామకానికి సహ కరించిన రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి కుంజ సూర్య, మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు, తెలంగాణ రాష్ట్ర పంచాయ తీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన నియామకానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ములుగు జిల్లాలోని గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని అయ్యోరి యానయ్య పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ



- లబ్ధిదారుల ఇంటి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టిన సర్పంచ్ మేకల రాజయ్య

మల్హర్, (సింగిడి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మల్హర్ మండలం మల్లారం గ్రామానికి చెందిన లబ్ధిదారులు జెట్ల పద్మ--భూమయ్య దంపతుల నూతన ఇంటి నిర్మాణానికి గురువారం భూమిపూజ నిర్వహించారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు ఆదేశాల మేరకు



నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ మేకల రాజయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొబ్బరికాయ కొట్టి ఇంటి నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు అవిర్నేని రూపేష్ రావు, లింగన్నపేట శ్రీధర్, ముంజం శంకర్, వార్డు సభ్యులు కవిత, వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు భూక్య రాజునాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి, సీనియర్ నాయకుడు లింగన్నపేట మురళి, మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు రేవెల్లి లింగయ్య, మాజీ కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు లింగన్నపేట రమేష్, గ్రామ కమిటీ సీనియర్ నాయకుడు ముక్కెనవేన ఐలయ్య, యూత్ సభ్యుడు హాట్కర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె దవాఖానలో కుక్క కాటు వ్యాక్సిన్ అందుబాటులో ఉంది



కమలాపూర్,(సింగిడి):మండలంలోని కానిపర్తి పల్లె దవాఖానలో కుక్కకాటు వ్యాక్సిన్, టి టి అందుబాటులో ఉంటాయని దీనిని ప్రజలు ఉపయోగించుకోవాలని జిల్లావైద్య ఆరోగ్యశాఖ అధికారి డా అప్పయ్య తెలిపారు. కమలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కానిపర్తి ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన రికార్డులు, నివేదికలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, నివేదికల సమర్పణ , ఆరోగ్య సేవలకు సంబంధించిన వివరాలను సమీక్షించి, వాటి నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డా అప్పయ్య మాట్లాడుతూ కానిపర్తి పల్లెదవాఖానలో కుక్క కాటుకు సంబంధించిన రేబిస్ వ్యాక్సిన్ ,టిటి అందుబాటులో ఉంటాయని ప్రజలు వీటిని ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని, అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో కానిపర్తి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం వైద్యాధికారి డా అరుణ్ కుమార్,ఎచ్ ఈ ఓ సీహెచ్ రవీందర్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీకాంత్, టీబీ నోడల్ పర్సన్ తౌటం ప్రభాకర్, ఎ ఎన్ ఎమ్ లావణ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి చేయూత

బిక్కనూర్,(సింగిడి):భిక్కనూర్ మండలం రామేశ్వర్‌పల్లి గ్రామంలో నిర్మిస్తున్న శ్రీ సీతారామ భద్ర క్షేత్ర నిర్మాణానికి గ్రామ మాజీ సర్పంచ్ నాగర్తి పోతిరెడ్డి రూ. 40 వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజాప్రతినిధులు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు విరాళదాత సేవాభావాన్ని అభినందించారు. నాగర్తి పోతిరెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులకు శ్రీరామచంద్రుని ఆశీస్సులు లభించి, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఆలయ నిర్మాణానికి సహకరించినందుకు గ్రామాభివృద్ధి కమిటీ, నిర్మాణ కమిటీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

రూ.40 వేల విరాళం అందించిన మాజీ సర్పంచ్ నాగర్తి పోతిరెడ్డి



NHMలో 67 పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

- డిఎంహెచ్ఓ డాక్టర్ రవి రాథోడ్

డోర్నకల్ /మరిపెడ (సింగిడి):మహబూబాబాద్ జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్ (ఎనఎం) పరిధిలో 67 కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్ తెలిపారు. స్టాఫ్ నర్స్,ఎంపీహెచ్ఏ, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్, మెడికల్ ఆఫీసర్ తదితర పోస్టులు ఇందులో ఉన్నాయి.అభ్యర్థులు అక్టోబర్ 29వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తులను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం, ఖీ-25, ఎణూజ, మహబూబాబాద్ చిరునామాకు స్వయంగా లేదా పోస్టు ద్వారా సమర్పించాలి. దరఖాస్తు రుసుము ూజ అభ్యర్థులకు రూ. 500, దీజ,ూజ,ూ అభ్యర్థులకు రూ. 300గా నిర్ణయించారు. పూర్తి వివరాలు, దరఖాస్తు ఫారమ్ కోసం ంmahabubabad.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన సూచించారు.



ఉచిత నేత్ర వైద్య శిబిరం

80 మందికి కంటి పరీక్షలు..
15 మందికి శస్త్రచికిత్సలు అవసరం



తొర్రూరు,(సింగిడి):ఎన్నిక మండలంలోని మాటేడు గ్రామంలో లయన్స్‌క్లబ్ సేవా తరుణి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్లోబల్ కాజెస్ ఇంటర్నేషనల్ ఐ విజన్ వారోత్సవాల్లో భాగంగా 320ఎఫ్ గవర్నర్ ఆదేశాల మేరకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రీజియన్ చైర్‌పర్సన్ నాగావని, క్లబ్ అధ్యక్షురాలురేణుకారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ కంటిపరీక్షలు చేయించుకుని నేత్ర ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని వారు సూచించారు.శిబి రంలో మొత్తం 80 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 15 మందికి కంటి శస్త్రచికిత్సలు అవసరమని నేత్ర వైద్య సహాయకుడు పులుగుజ్జ మహేష్ తెలిపారు. వీరిని వరంగల్‌లోని లయన్స్ ఆసుపత్రికి తీసుకెళ్లి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించను న్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సునీల్, పినాకపాణి, కార్యదర్శి నిత్యాశెట్టి, కోశాధికారి ఉమారెడ్డి, లయన్స్ సభ్యులు శ్రీనివాస్, సురేష్, వెంకన్న, గ్రామస్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

24 గంటల కరెంట్ హామీ ఏమైంది?

రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కోతలు.. ఎండిపోతున్న పంటలు
సింగరేణి భవిష్యత్తుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఏదీ?
కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి విమర్శలు

జమ్మికుంట, (సింగిడి):ఎన్నికల సమయంలో 24 గంటల విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయానికి ఆరు గంటలే విద్యుత్ ఇస్తోందని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, పంటలు ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయని ఆరోపించారు. సింగరేణి సంస్థను సంక్షోభంలోకి నెట్టి తెలంగాణను చీకట్లోకి తీసుకెళ్తున్నారని ప్రభుత్వంపై ధ్వజమెత్తారు.హుజురాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తుంటే, సకాలంలో విద్యుత్ అందక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందించడం ప్రభుత్వ బాధ్యత కాదా? రైతుల సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు.

విద్యుత్ రంగంపై శ్వేతపత్రం విడుదల చేయాలి

విద్యుత్ ఉత్పత్తి, రాష్ట్ర అవసరాలు, విద్యుత్ కొనుగోళ్ల ఖర్చులు, సరఫరాలో అంతరాయాల కు గల కారణాలపై ప్రభుత్వం సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలని కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. విద్యుత్ సమస్యలకు ప్రకృతి వైపరీత్యాలను



సాకుగా చూపకుండా, సరఫరా వ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.
గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ రంగాన్ని బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టామని పేర్కొన్న ఆయన, ప్రస్తుత ప్రభుత్వం విద్యుత్ కోతలకు కారణాలను ప్రజలకు వివరించాలని కోరారు. అధికారులపై నెపం నెట్టి ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పించు కోలేదని అన్నారు.

సింగరేణి భవిష్యత్తుపై స్పష్టత ఇవ్వాలి

తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన సింగరేణి సంస్థ భవిష్యత్తుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. సంస్థ ఉత్పత్తి, ఆదాయం, కార్మికుల సంక్షేమం, భవిష్యత్తు ప్రణాళికల వివరాలను వెల్లడించాలని కోరారు. సింగరేణి సంస్థను బలోపేతం చేస్తూ కార్మికుల హక్కులను కాపాడాలని సూచించారు.

రాష్ట్రంలో విద్యుత్ కోతలు ఎందుకు పెరుగుతున్నాయి?

వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందించడంలో సమస్యలేమిటి? విద్యుత్ ఉత్పత్తి, కొనుగోళ్లు, పంపిణీ వ్యయాల వివరాలను ఎందుకు వెల్లడించడం లేదు? సింగరేణి సంస్థ భవిష్యత్తు కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటి? అని ప్రశ్నించారు.రైతులకు నిరంతర విద్యుత్ అందించి, పంటలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవడంతో పాటు విద్యుత్ రంగంపై సమగ్ర నివేదిక విడుదల చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, డీసీసీబీ వైస్ చైర్మన్ పింగిళి రమేష్, తిరుపతిరావు, ఇంద్రసేనారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సంపత్ రావు, పొనగంటి సంపత్, మాజీ ఎంపీపీ సురేందర్ రెడ్డి, వెంకటేష్, తిరుపతిరెడ్డి, మాజీ జడ్పీటీసీ లక్ష్మణరావు, గందె శ్రీనివాస్, కొలిపాక శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ దిలీప్, వైస్ చైర్మన్ జావీద్, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండు గుళ్లకు విరాళం అందించిన కౌశిక్ రెడ్డి

కమలాపూర్,(సింగిడి):మండలంలోని వంగపల్లి గ్రామం లో నిర్మించిన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాల యం, అదేవిధంగా బీరన్న దేవాలయానికి హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌసిక్ రెడ్డి గౌడ కులస్తులకు, కురుమ కులస్తులకు గత కొన్ని నెలల క్రితం ఆర్థిక సహాయం చేస్తాను అని చెప్పారు. దాని కనుగుణంగా గురువారం రాత్రి రెండు ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి రెండు ఆలయాలకు 50 వేల రూపాయల చొప్పున గౌడ, కురుమ సంఘాల నాయ కులకు ఆయా దేవాలయాల వద్దబి ఆర్ ఎస్ నాయకులతో కలిసి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు కౌశిక్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నకిర్త రాజు, మాజీ సర్పంచ్ పొడిటి కమలమ్మ సారయ్య, మాజీ ఎంపీటీసీ గట్టు ఏడుకొండలు, లక్ష్మీపూర్ గ్రామ సర్పంచ్ కొడగాని రాజేష్, నెరేళ్ల సర్పంచ్ జట్టి నాగలక్ష్మి సురేష్, వ్యవసాయ సహకార సంఘము వైస్ చైర్మన్ ఎర్రం ఇంద్రసేనా రెడ్డి, సీనియర్ నాయకులు నాయినేని తిరుపతి రావు, వార్డు





సభ్యులు వక్కల దయాకర్,గౌడ సంఘము అధ్యక్షులు దొమ్మటి నరేష్, ఉపాధ్యక్షుడు దోనికెల చంద్ర మోహన్,ఆలయ చైర్మన్ కొండ తిరుపతి,సభ్యులు పంజాల పురుషోత్తం, గట్టు రఘు, సమ్మయ్య,దేనికెల రవి, తిరుపతి, రాజు, భిక్షపతి,ధర్మేందర్, మూల ఉపేందర్, పవన్, రమేష్, శ్రీను, రాజు, కొండ నాగరాజు, రంగు శ్రీను, మాటూరి రాజు,ప్రభాకర్,మల్లేష్ ,ముక్కెర అనిల్ ,రంగు పైడి,చెరుకు తిరుపతి కొండల్, శ్రీనివాస్, రాజు, కురుమ సంఘము సభ్యులు నంద సారంగం, సుధాకర్,భిక్షపతి, చీరె రమేష్, నకీర్త బాల కొమురయ్య,ఎర్ర నాగరాజు, బి ఆర్ ఎస్ నాయకులు అంకిల్ల సారయ్య, పోడేటి అశోక్,అంకిల్ల సదానందం, పసుల సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ దేవిగా అమ్మవారి దర్శనం

కొత్తకొండలో భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఆరో రోజు పూజలు

భీమదేవరపల్లి (సింగిడి):
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి దేవస్థానంలో భద్రకాళి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని అమ్మవారిని సరస్వతీ దేవి అలంకారంలో అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. విద్యకు, జ్ఞానానికి ప్రతీకగా కొలిచే సరస్వతీ దేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆసక్తి చూపారు. ఉదయం గణపతి పూజతో ప్రారంభమైన పూజా కార్యక్రమాల్లో శైవశుద్ధి, పుణ్యాహవాచనం, సర్వతోభద్ర మండల ఆవాహన నిర్వహించారు. అనంతరం చతుఃషష్టి ఉపచార పూజలను శాస్త్రోక్తంగా జరిపారు. ఈ సందర్భంగా అమ్మవారు కాత్యాయనీ మాత రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అమ్మవారి కృపతో సకల శుభాలు కలగాలని భక్తులు ప్రార్థించారు. ఆలయ అర్చకులు, సిబ్బంది పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను దేవస్థాన కార్యనిర్వహణ అధికారి పి. కిషన్‌రావు పర్యవేక్షించారు.



జర్నలిస్టుల సంక్షేమానికి చేయూత

బుగ్గారం ప్రెస్ క్లబ్ సభ్యులకు ఏడు రకాల నిత్యావసర సరుకుల పంపిణీ



బుగ్గారం, (సింగిడి)::పాత్రికే యుల సంక్షేమమే లక్ష్యంగా బుగ్గారం ప్రెస్ క్లబ్ సభ్యులకు ఏడు రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి చొరవతో, బుగ్గారం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దూడ జీవన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిం చారు.దసరా పండుగను పురస్కరించుకుని గుప్త దాతల సహకారంతో అందించిన ఈ



సరుకులను ప్రెస్ క్లబ్ సభ్యులకు పంపిణీ చేశారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో పాత్రికేయులు కీలక పాత్ర పోషిస్తున్నారని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షే మానికి ముందుకొచ్చిన ఎన్నం కిషన్ రెడ్డి, దూడ జీవన్‌లను అభినందించారు. దూడ జీవన్ మాట్లాడుతూ, పాత్రికేయుల సంక్షేమం కోసం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించ డం సంతోషకరమని అన్నారు. జర్నలిస్టులు ఐకమత్యంతో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మానికి సహక రించిన ఎన్నం కిషన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలి పారు. ఎన్నం కిషన్ రెడ్డి మాట్లాడుతూ, జర్నలి స్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ఎండావానలను సైతం లెక్కచేయ కుండా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నా రు. వారి సేవలను గుర్తించి, సంక్షే మానికి తన వంతు సహకారం అందించాలనే ఉద్దే శంతో దసరా సందర్భంగా గుప్త దాతల



సహకారంతో నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ పాత్రికే యులకు అవసరమైన సహకారం అందించేం దుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ని త్యావ సర సరుకుల పంపిణీ పట్ల ప్రెస్ క్లబ్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల మధ్య ఐక్యత, పరస్పర సహకారం మరింత బలోపే తం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్ర మంలో సీహెచ్ సత్యం, నక్క శంకర్, గజ్జెల జానకిరామ్, జైశెట్టి రాకేష్, చిర్ర లక్ష్మణ్, మెడి పెల్లి గంగాధర్, బత్తిని తిరుపతి, వెల్గటూర్ ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ, దసరా వేడుకలకు ముస్తాబవుతున్న బిక్కనూర్





బాలుర పాఠశాల మైదానంలో ఏర్పాట్ల పరిశీలన.. హైమాస్ట్ లైట్ల ఏర్పాటు, ఫ్లోరింగ్‌కు మరమ్మతులు

బిక్కనూర్, (సింగిడి):బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని బిక్కనూర్ పట్టణంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. దసరా వేడుకలు నిర్వహించే బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో చేపట్టిన ఏర్పాట్లను సర్పంచ్ బాల్యల రేఖ సుదర్శన్, ఉపసర్పంచ్ మోహన్ రెడ్డి, వార్డు సభ్యులు మరోసారి పరిశీలించారు. మైదానంలోని దెబ్బతిన్న ఫ్లోరింగ్‌ను గుర్తించి మరమ్మతులు చేయించారు. పండుగల సందర్భంగా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు గ్రామంలో నూతన హైమాస్ట్ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. పండుగ వేడుకలకు హాజరయ్యే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.
ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేష్ గౌడ్, వార్డు సభ్యులు సురేష్ గౌడ్, గజ్జె వేణు, కర్రోళ్ల రాజు, పంచాక్షరి, బసగళ్ల చంద్రం, నర్ముల చంద్రం, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన ఏర్గట్ల మండల ప్రజాప్రతినిధులు

గ్రామాలకు కొత్త వెలుగులు



ఆర్మూర్, (సింగిడి):బాల్కొండ నియోజకవర్గం ఎయిర్ గట్ల మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచ్లు, పలువురు నాయకులు హైదరాబాద్ లోని సెక్రటేరియట్ వద్ద బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, ఇంచార్జ్ ముత్యాల సునీలన్న ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా ఇంచార్జ్ , రాష్ట్ర పంచాయతీ రాజ్ మంత్రివర్యులు ధనసరి సీతక్క ని కలిసి ఏర్గట్ల మండల పరిధిలోని తడుపాకల్, గుమ్మిర్యాల్, దోంచంద గ్రామాల పుష్కరాల అదనపు గాట్లు కావాలని,అదే విధముగా మరమ్మతులకు అదనంగా నిధులు ఇవ్వాలని, ఏర్గట్ల మండల కేంద్రములో మిగిలిపోయిన తాళ్ల రాంపూర్ రోడ్ లో సెంట్రల్ లైటింగ్ కావాలని, పాలెం నుండి ఏర్గట్ల వరకు వయా తొర్తి డబుల్ డాంబరు రోడ్ కావాలని అదే విధముగా ఏర్గట్ల మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చెయ్యాలని, తడుపకల్ గ్రామము నుండి పుష్కరాల ఘాటు వరకు సెంట్రల్ లైటింగ్ కావాలని వినతి పత్రం ఇస్తే సంబంధించిన మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి కు లెటర్ ఇచ్చి మాట్లాడిన సీతక్క. మేము కూడా మంత్రుల దృష్టికి తీసుకువెళ్ళటం జరిగింది. ఇందులో ముత్యాల సునీలన్న, ఏర్గట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివన్నోల్ల శివకుమార్, తోర్తి సర్పంచ్ కొడ భూమేష్, గుమ్మిర్యాల్ సర్పంచ్ సంజీవ్ యాదవ్, తడుపకల్ సర్పంచ్ జింక అనిల్ యాదవ్, దోంచంద ఉపసర్పంచ్ ఆశిరెడ్డి హన్మంత్ రెడ్డి, ఏర్గట్ల ఇందిరమ్మ కమిటీ సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పన్నాల నర్సారెడ్డి, పాల్గొన్నారు.

25 ప్రాంతాల్లో విద్యుత్ దీపాల ఏర్పాటుకు నిధులు
కూడళ్ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

భీమదేవరపల్లి (సింగిడి):మండలంలోని గ్రామాలు, తండాలు, కాలనీలు, ప్రధాన కూడళ్లలో రాత్రివేళ చీకట్లను తొలగించి వెలుగులు నింపేందుకు నిధులు కేటాయించారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు రాత్రి వేళల్లో రాకపోకలకు ఇబ్బం దులు లేకుండా చేయాలనే లక్ష్యంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ దీపాల ఏర్పాటుకు ఒక్కో చోట రూ.లక్ష చొప్పున నిధులు కేటాయించారు. భీమదేవరపల్లి మండలంలోని 25 ప్రాంతాల్లో మొత్తం రూ.27 లక్షలతో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయనున్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలు, బస్టాండ్లు, ఆటో స్టాండ్లు, అంబేద్కర్ సర్కిళ్లు, బొడ్రాయిలు, ఆలయాల పరిసరాలు, గ్రామ పంచాయతీ భవనాల వద్ద దీపాల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇచ్చారు.గ్రామాల వారీగా నిధుల కేటాయింపులు ఇలా ఉన్నాయి..భీమదేవరపల్లిలో ఎస్సీ కాలనీ, బొల్లోనిపల్లిలో బొడ్రాయి, చింతయ్యపల్లిలో మాంగ రవి నివాసం, ధర్మారంలో అంబేద్కర్ సర్కిల్, ఎర్రబెల్లిలో శివాలయం, గాంధీనగర్‌లో బస్టాండ్ వద్ద దీపాల ఏర్పాటుకు రూ.లక్ష చొప్పున కేటాయించారు.గట్లనర్సింగాపూర్‌లో ఆటో స్టాండ్, ఎస్సీ కాలనీ, కొప్పూర్‌లో ఎస్సీ కాలనీ, శివాలయం, కొత్తకొండలో ఎస్సీ కాలనీ, చేగలి కొమురయ్య వద్ద, కొత్తపల్లిలో అంబేద్కర్ సర్కిల్, బొడ్రాయి వద్ద ఒక్కోప్రాంతానికి రూ.లక్ష చొప్పున నిధులు కేటాయించారు.గొల్లపల్లిలో మహిళా సంఘం భవనం, మల్లారంలో పశువైద్యశాల, మాణిక్యాపూర్‌లో ఎస్టీకాలనీ,ముల్కనూర్‌లో జంగాల కాలనీ,పోచమ్మగుడి, ముస్తఫాపూర్‌లో బొక్కలపల్లి, ముత్తారంలో గ్రామ పంచాయతీ భవనం, రాంనగర్‌లో బస్టాప్ వద్ద దీపాలు ఏర్పాటు చేయనున్నారు.అలాగే రంగయ్యపల్లిలో హనుమాన్ ఆలయం, రసూల్‌వల్లిలో గ్రామ పంచాయతీ



భవనం, రత్నగిరిలో హనుమాన్ ఆలయం, వంగరలో రొడ్డ కాలమ్మ, వీర్లగడ్డ తండాలో గ్రామ పంచాయతీ భవనం, విశ్వనాథ కాలనీలో బొడ్రాయి, సాయినగర్‌లో బోడ సంపత్ నివాసం, వీరభద్రనగర్‌లో మంత్యానాయక్ తండా క్రాస్‌రోడ్ వద్ద కూడా ఒక్కో ప్రాంతానికి రూ.లక్ష చొప్పున నిధులు కేటాయించారు.

చీకటి ప్రాంతాలకు వెలుగులు.. ప్రజలకు ఊరట

ఈ నిధులతో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తే రాత్రివేళల్లో ప్రజలకు మెరుగైన వెలుతురు అందనుంది. బస్టాండ్లు, ఆటో స్టాండ్లు, ప్రధాన కూడళ్ల వద్ద ప్రయాణికులకు సౌకర్యం కలగడంతో పాటు కాలనీలు, ఆలయాల పరిసరాల్లో చీకటి సమస్య తగ్గనుంది. అయితే, కేటాయించిన నిధులతో పనులు ఎప్పటిలోగా పూర్తవుతాయో సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

రిపోర్టర్లపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన ఎస్ఐపై

క్రిమినల్ చర్యలు, సస్పెండ్ చేయాలి..!

రాష్ట్ర గవర్నర్, మానవ హక్కుల కమిషన్ కు జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎన్నం కిషన్ రెడ్డి ఫిర్యాదు

జగిత్యాల,(సింగిడి):రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట ఎస్సైపై వార్త కథనాలు రాస్తే కక్ష పూరితంగా వ్యవహరించి ఇద్దరు రిపోర్టర్లపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి ఆరోపణలు ఎదుర్కొంటున్నఎస్సై శ్రీకాంత్ పై విచారణ జరిపి ఆయనను సస్పెండ్ చేయడమే కాకుండా, క్రిమినల్ కేసులు నమోదు చేయాలనీ గవర్నర్, మానవహక్కుల కమిషన్ చైర్మన్ కు జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి ఫిర్యాదు చేశారు. ఎస్సైని సస్పెండ్ చేయాలని కోరుతూ మెయిల్ ద్వారా జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిజెజెఫ్) రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు లివిన్నం కిషన్ రెడ్డిలి శుక్రవారం రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ లకు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ఇద్దరు రిపోర్టర్లు శేఖర్, సంపత్ లను ఎస్ఐ శ్రీకాంత్ అక్రమంగా నిర్బంధించి థర్డ్ డిగ్రీ ప్రయోగించారని, అధికార దుర్వినియోగం, లంచాల వసూళ్లపై వార్తలు రాసినందుకే కక్షపూరితంగా ఈ దాడి జరిగిందని ఆయన ఆరోపించారు.ఇది పత్రికా స్వేచ్ఛపై దాడి మాత్రమే కాక మానవ హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని, రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛ (ఆర్టికల్ 19(1)(ఖ)) కు విరుద్ధమని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. అయితే ఎస్సై శ్రీకాంత్ ను జిల్లా ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేసి చేతులు దులుపుకోవద్దని,ఈ ఘటనపై సుమోటోగా కేసు నమోదు చేసి సమగ్ర విచారణ జరిపి, బాధ్యుడైన ఎస్ఐ పై శాఖాపరమైన, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదులో కోరారు.బాధిత విలేకరులకు న్యాయం, రక్షణ కల్పించాలని కిషన్ రెడ్డి గవర్నర్, మానవహక్కుల కమిషన్ చైర్మన్ లను కోరారు.ఇలాంటి సంఘటనలు



పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జర్నలిస్టుల రక్షణ చట్టం అమలు దిశగా ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని ఫిర్యాదులో కోరినట్లు ఆయన తెలిపారు. ఫిర్యాదుతో పాటు దినపత్రికల్లోవచ్చిన వార్త క్లిప్పింగులను జతపరిచినట్లు కిషన్ రెడ్డి వివరిశీచారు.

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులుగా రోహిత్ నియామకం



కమలాపూర్, (సింగిడి): కమలాపూర్ మండల యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా మండల కేంద్రానికి చెందిన చేరాల రోహిత్ ను నియామకం చేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి కృష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.తనను మండల అధ్యక్షులుగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణారెడ్డి కి నియామకానికి సహకరించిన హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఒడితెల ప్రణవ్,హుజురాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల,మండల పార్టీ అధ్యక్షులు వాసాల శ్రీనివాస్,లకు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తజన సందోహం నడుమ శరన్నవరాత్రి వైభవం

సరస్వతీదేవి రూపంలో దుర్గామాత దర్శనం..
చిన్నారులకు విద్యాసామగ్రి పంపిణీ





కాటారం, (సింగిడి):కాటారం మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీదేవర ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగు తున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆరో రోజు దుర్గామాత సరస్వతీదేవి, వీణావాణి రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అన్వేష్ ఆచార్యుల ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల నడుమ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తిభావంతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

సరస్వతీ పూజలో చిన్నారులకు విద్యాసామగ్రి పంపిణీ

సరస్వతీ పూజను పురస్కరించుకుని పూజలో పాల్గొన్న చిన్నారులకు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, పలకలు, బలపాలను భవానీ యూత్ సభ్యులు పంపిణీ చేశారు. విద్యకు ప్రతీక అయిన సరస్వతీదేవి పూజ సందర్భంగా చిన్నారులకు విద్యాసామగ్రి అందించడం ప్రత్యేకతగా నిలిచింది. విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడటంతోపాటు సేవాభావాన్ని చాటేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

భవానీ స్వాముల భక్తి నామస్మరణ

వల్లెంకుంటకు చెందిన భవానీ దుర్గా దీక్షా స్వాములు గురుస్వామి గడ్డం సతీశ్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కాటారం పూరవీధుల నుంచి భవానీ, దుర్గామాత నామస్మరణలు చేస్తూ గారెపల్లిలోని శ్రీ లక్ష్మీదేవర ఆలయానికి ఊరేగింపుగా చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శనం చేసుకున్నారు. భక్తుల జయజయధ్వానాలు, దుర్గామాత నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.

హిందూ సంప్రదాయాలను కాపాడుకోవాలి

గురు స్వామి గడ్డం సతీష్ మాట్లాడుతూ హిందూ ధర్మం, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పండుగల అసలైన స్ఫూర్తిని చాటుతూ ఆధ్యాత్మిక విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రజలంతా ఐకమత్యంతో అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లలా కలిసిమెలిసి జీవిస్తూ మన సంప్రదాయాలను పరిరక్షించాలని పిలుపునిచ్చారు. గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని, దుర్గామాత ఆశీస్సులు అందరిపై ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో దుర్గా భవాని దీక్షస్వాములు, యూత్ సభ్యులు కొట్టే కార్తీక్, వావిల్లా మోహన్, కొట్టే సృజన్, సుంకరీ అజయ్, పేంటీ రాజేష్, పల్నాటి రామ్ చరణ్, బింగి ధనుజయ్, రామకృష్ణతోపాటు భవానీ, దుర్గా దీక్షా స్వాములు, మహిళలు, చిన్నారులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నూతన ఎస్సైని శాలువాతో సన్మానించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు



భీమదేవరపల్లి, (సింగిడి):హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని వంగర పోలీస్‌స్టేషన్ నూతన ఎస్సైగా ఎం. రాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాట్ల వెంకటస్వామి మాదిగ, మండల అధ్యక్షుడు వేల్పుల ప్రశాంత్, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు కాదాసు ప్రవీణ్, ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి దిలీప్, అధికార ప్రతినిధి మాడ్గుల ప్రణయ్, రాంనగర్ గ్రామ శాఖ అధ్యక్షుడు కనకం రమేష్, హనుమకొండ జిల్లా సీనియర్ నాయకులు పార్నందుల సురేష్, బొల్లంపల్లి జోసఫ్, బుగ్గ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే...



ఆర్మూర్, (సింగిడి):బాల్కొండ నియోజక వర్గం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాలెం గ్రామానికి చెందిన మంతెన అఖిల్ అనారోగ్యంతో బాధపడుతు హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న నేపథ్యంలో బాధితుడు చికిత్స నిమిత్తం కోసం శుక్రవారం రోజున అఖిల్ కుటుంబ సభ్యులకు మాజీ మంత్రి,బాల్కొండ ఎమ్మెల్యే మోర్తాడ్ మండలం పాలెం గ్రామానికి చెందిన అఖిల్ కుటుంబ సభ్యులుఆర్థిక సహాయం కోసం బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డిని కలిసి చికిత్స నిమిత్తం ఆర్థిక సాయం అందజేయాలని విన్నవించుకోగా, ఎమ్మెల్యే స్పందించి చికిత్స పొందుతున్న అఖిల్ కుటుంబ సభ్యులకు రెండు లక్షల ఇరవై వేల ఎల్ఓసి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కుటుంభ సభ్యులు ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డికి బాధ్యత కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్ర మంలో మండల పార్టీ అధ్యక్షులు కల్లెడ ఏలియా, పాలెం మాజీ ఎంపీటీసీ ఎనుగందుల అశోక్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ పాపాయి పవన్, ఆశన్న గారి రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

దుర్గాభవాని మహోన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే
అన్నప్రసాదం వడ్డించిన ఎమ్మెల్యే



హన్మకొండ, (సింగిడి):గ్రేటర్ వరంగల్ నగరంలోని 56వ డివిజన్ గోపాలపురంలోని నవదుర్గ ఉత్సవ కమిటీ మరియు శ్రీ రేణుక ఎల్లమ్మ ఆర్చ్,శ్రీ రేణుక ఎల్లమ్మ కాలనీ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ దుర్గాభవాని మహోన్నదాన కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ను శాలు వాలతో సన్మానించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహోన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డిం చారు. భక్తులతో ఆప్యాయంగా మెలుగుతూ ఆధ్యాత్మిక కార్య క్రమాల్లో పాల్గొనడం పట్ల నిర్వాహకులు, భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 56వ డివిజన్ అధ్యక్షులు కొంకా హరిబాబు,రాష్ట్ర లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, సీనియర్ నాయకులు చింత రమేష్, మర్రి ప్రభాకర్, ఐలన్న, కృష్ణమూర్తి, సంధ్య, విజయ్ సూర్య, శ్రీను, డివిజన్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ముల్కనూర్ శివారులో ముగ్గురు వ్యక్తులు పట్టివేత
గంజాయి సేవిస్తున్నట్లు పోలీసుల గుర్తింపు.. మూడు ప్యాకెట్లు స్వాధీనం
ఆటో, రెండు బైక్‌లు, రెండు సెల్‌ఫోన్లు సీజ్



భీమదేవరపల్లి, (సింగిడి)::హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామ శివారులోని మంగళ్‌దుబ్బ ప్రాంతంలో గంజాయి సేవిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న మూడు గంజాయి ప్యాకెట్లతో పాటు రెండు సెల్‌ఫోన్లు, ఒక ఆటో, రెండు మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై ముల్కనూర్ పోలీసులు కేసు నమోదు చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముల్కనూర్ గ్రామ శివారులోని మంగళ్‌దుబ్బ ప్రాంతంలో కొందరు గంజాయి కలిగి ఉన్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు ఎస్సై ఎం. రాజు తన సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లారు. ఈ క్రమంలో ఓ వేపచెట్టు కింద గంజాయి సేవిస్తున్నట్లు గుర్తించిన ముగ్గురు వ్యక్తులు పోలీసులను చూసి అక్కడి నుంచి వెళ్లేందుకు ప్రయత్నించగా, వారిని అదుపులోకి తీసుకుని విచారించారు.విచారణలో వారు కొప్పూర్ గ్రామానికి చెందిన అంబాల రాజేష్, బాకీ రాజేందర్ అలియాస్ చింటూ, ముల్కనూర్ గ్రామానికి చెందిన అలుగు అంజిగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. కొంతకాలంగా గంజాయి ప్యాకెట్లు కొనుగోలు చేసి మంగళ్‌దుబ్బ ప్రాంతానికి వచ్చి సేవిస్తున్నట్లు వారు వెల్లడించినట్లు పేర్కొన్నారు.వారి వద్ద ఉన్న మూడు గంజాయి ప్యాకెట్లు, రెండు సెల్‌ఫోన్లు, ఒక ఆటో, రెండు మోటార్‌సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ముగ్గురినీ ముల్కనూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి తదుపరి దర్యాప్తు వివరాలు, గంజాయి ఎక్కడి నుంచి కొనుగోలు చేశారనే అంశంపై పోలీసుల అధికారిక ప్రకటన వెలువడితే మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

దుర్గ దేవి అమ్మవారి వద్ద చండీయాగం
ప్రత్యేక పూజలు నిర్వహించిన గ్రామస్తులు



ఆర్మూర్, (సింగిడి): బాల్కొండ నియో జకవర్గం మోర్తాడ్ మండలం వడ్యాట్ గ్రామంలో శుక్రవారం రోజున గ్రామంలో ప్రతిష్టించి న దుర్గాదేవి మండపం వద్ద చండీ యాగ హోమం, యజ్ఞోమం ప్రత్యేక పూజలతో నిర్వహించారు. చండీయాగ హో మాన్ని, ఎన్ని హోమాన్ని వేద పండితులు కోచగంటి సతీష్ శర్మపంతులు, గీతమ్మ,మాధురి, శివాని, సాయి,వేద పండితులు వేదమంత్రాల తో నిర్వహిం చారు.దుర్గాదేవి మండప సభ్యులు, భక్తులు, మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు అమ్మవారికి నిర్వహించారు. సరస్వతి దేవి అలంకరణతో మూలా నక్షత్రంలో మహా చండి హోమం అనంతరం సామూ హిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో సరస్వతీ దేవి అలంకరణతో ఉన్న దుర్గామాత అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, మహిళా భక్తులు, యువ తులు, యువకులు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, దీక్షాపరులు అమ్మవారిని దర్శించుకుని గ్రామంలో పాడి పంటలు పుష్కలంగా పండాలని, పుష్కలంగా వర్షాలు కురియాలని, పిల్లాపాపలతో అన్ని కుటుంబ సభ్యులు చల్లగా ఉండాలని, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో, సుఖ సంతోషాలతో గ్రామం చల్లగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.

24న చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి



నందిపేట్ మండల కేంద్రంలో స్వర్ణకార శంఖారావం పోస్టర్ల ఆవిష్కరణ...

ఆర్మూర్, (సింగిడి): నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గం నందిపేట్ మండల కేంద్రంలో స్వర్ణకార శంఖారావం భారీ బహిరంగసభ గోడ ప్రతులను జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షులు తంగనపల్లి శ్రీనివాస్, అఖిల అఖిల భారత విశ్వకర్మ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీరాం మహిపాల్ చారి చేతుల మీదుగా గోడ ప్రతులను శుక్రవారం రోజున ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ స్వర్ణకార జిల్లా అధ్యక్షులు తంగనపల్లి శ్రీనివాస్, అఖిల భారత విశ్వకర్మ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీరాం మహిపాల్ చారి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 24న హైదరాబాదులోని సరూర్ నగర్ లాల్ బహుదూర్ స్టేడియంలో విశ్వకర్మ సంఘ సభ్యుల సమస్యలపై, విశ్వకర్మ వృత్తి సమస్యలపై బహిరంగ సభ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వ కళ్ళు తెరిపించేలా ఈ సభకు అన్ని గ్రామాల్లోని, పట్టణాల్లోని, అన్ని మండల కేంద్రాల్లోని, జిల్లా కేంద్రాల్లో గల విశ్వకర్మ సంఘ కుల సభ్యులు, విశ్వకర్మ సంఘ కుల పెద్దలు నాయకులు, విశ్వకర్మ కుల మహిళలు ఈనెల 24న తలపెట్టిన బహిరంగసభకు విచ్చేసి జయప్రదం చేయాలని వారు కోరారు. ఉద్యమాల ద్వారానే మన వృత్తి, విశ్వకర్మల సమస్యలపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వం పై ఒత్తిడి చేస్తేనే ప్రభుత్వం స్పందించేలా తరచూ ఉద్యమాలను నిర్వహించాలని వారు కోరారు. మన విశ్వకర్మల వృత్తి సమస్యలను ఇలాంటి బహిరంగ సభలు నిర్వహించి మన సమస్యలు మనమే పరిష్కరించుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కార్యదర్శి బందన కంటి నరసింహ, మంచిర్యాల శ్రీనివాస్, తాడూరి నరేష్, శ్రీరామ సుదర్శన్, తాడూరి ధర్మరాజు, బంగారు నవీన్, రామోజు ముత్యం, పలువురు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటో పంపిణీ



కమలాపూర్ ,(సింగిడి): మండ లంలోని గ్రామానికి చెందిన దివ్యాంగుడు దాసరి శ్రీనివాస్‌కు మినీ బ్యాటరీ గ్రేడింగ్ ఆటో ను హనుమకొండ జిల్లాకలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ,హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిలు అంద చేశారు.మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న దివ్యాంగుల సహాయ ఉపకరణాల పథకం 2024--25 సంవత్సరంకు గాను జిల్లా ఎంపిక కమిటీ ద్వారా ఎంపికైన అర్హత కలిగిన దివ్యాంగ లబ్ధిదారుడు దాసరి శ్రీనివాస్ కి బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటోను పంపిణీ చేయడం జరిగిందన్నా రు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ దివ్యాంగులు స్వయం ఉపాధి పొందుతూ, ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా అవసరమైన సహాయాన్ని అందిస్తోందని తెలిపారు. బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటో వంటి ఉపాధి ఆధారిత సహాయ ఉపకరణాల ద్వారా దివ్యాంగుల జీవనోపా ధికి తోడ్పాటు అందించడంతో పాటు, వారి ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలి పారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రవి జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ , సీడీపీవో బీమ దేవరపల్లి స్వరూప , సీనియర్ అసిస్టెంట్స్ వెంక ట్రామ్, కలీమ్, ఎఫ్ఆర్ ఓ రవి కృష్ణ, రజిత , రాజేష్ , దేవేందర్, సురేష్ ,లక్ష్మీపూర్ గ్రామ సర్పంచ్ కొడగాని రాజేష్, ఎర్రం ఇంద్రసేనా రెడ్డి, నాయినేని తిరుపతి రావు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ బిడ్డలకు న్యాయమూర్తులుగా అరుదైన గౌరవం!
జూనియర్ సివిల్ జడ్జిలుగా వేముల హారిక, చిప్ప సౌమ్య ఎంపిక
రాఘవపూర్, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో హర్షాతిరేకాలు..
అభినందించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు



పెద్దపల్లి, (సింగిడి): పెద్దపల్లి జిల్లా రాఘవపూర్ గ్రా మానికి చెందిన వేముల హారిక, బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన చిప్ప సౌమ్య జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎంపికై ఘనత సాధిం చారు. గ్రామీణ నేపథ్యం నుంచి ఎదిగి న్యాయమూర్తులుగా ఎంపిక కావడంతో రెండు గ్రామాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతు న్నాయి. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్తులు వారికి అభినందనలు తెలుపు తున్నారు. వేముల లక్ష్మీ--వైకుం ఠం దంపతుల కుమార్తె వేముల హారిక, చిప్ప లత--రాజేశ్వర్ దంపతుల కుమార్తె చిప్ప సౌమ్య తమ పట్టుదల, కృషి, ఆత్మవిశ్వాసంతో ఈ విజయాన్ని అందుకున్నారు. ఉన్నత లక్ష్యంతో కష్టపడి చదివితే గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించవ చ్చని నిరూపించి యువతకు ఆద ర్శంగా నిలిచారు.రాఘవపూర్ గ్రామంలో మహిళా సర్పంచ్‌గా వేముల హారిక ప్రజా సంక్షేమం, గ్రామాభివృద్ధికి కృషి చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రా ధాన్యమిస్తూ, అభివృద్ధి కార్యక్రమా ల్లో చురుకుగా పాల్గొన్న ఆమె జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడం గ్రామానికి గర్వకారణ మని గ్రామస్తులు పేర్కొన్నారు. చిప్ప సౌమ్య సైతం తన ప్రతిభతో న్యాయమూర్తిగా ఎంపికై కుటుంబానికి, గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చారు.

విజయాలు యువతకు స్ఫూర్తిదాయకం: ప్రభుత్వ విప్ విజయరమణరావు

జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎంపికైన వేముల హారిక, చిప్ప సౌమ్యలను ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయర మణరావు అభినందించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి న్యాయమూర్తులుగా ఎంపిక కావడం అభినందనీయమని పేర్కొన్నారు. వారి విజయాలు యువతకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. భవిష్యత్తులో న్యాయ రంగంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి ప్రజల కు న్యాయసేవలు అందించాలని ఆకాంక్షించారు. ఇద్దరు యువతులు ఒకేసారి జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎంపిక కావడం రాఘవపూర్, బ్రాహ్మణపల్లి గ్రామాలకు ప్రత్యేక గౌరవాన్ని తీసుకొచ్చిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. హారిక, సౌమ్యల విజయాలు మరెందరో గ్రామీణ యువతీ యువకులకు ప్రేరణగా నిలుస్తాయని పేర్కొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు
వేడుకల్లో పాల్గొన్న 100 మంది మహిళా ఉద్యోగులు, బ్యాంకు ఉన్నతాధికారులు



కరీంనగర్,(సింగిడి):కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఉద్యోగుల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో సుమారు 100 మంది మహిళా ఉద్యోగులు పాల్గొని సంప్రదాయబద్ధంగా బతుకమ్మ పండుగను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎన్. సత్యనారాయణరావు, జనరల్ మేనేజర్ బి. శ్రీధర్, మేనేజింగ్ డైరెక్టర్ రియాజ్, డిప్యూటీ జనరల్ మేనేజర్ రోహిణి,డిస్ట్రిక్ట్ జాయింట్ సెక్రటరీ అమిత సహాయ జనరల్ మేనేజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు హన్మంతరావు, కార్యదర్శి రాజు, రాష్ట్ర మహిళా కార్యదర్శిస్రవంతి, రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఉద్యోగులంతా కలిసి ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.

PRTU TS రాష్ట్ర కార్యవర్గంలో మల్హార్‌రావు మండలానికి ప్రాధాన్యం
- రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా సుధాకర్, తిరుపతిరెడ్డి.. కార్యదర్శిగా పూర్ణచందర్ ఎన్నిక



మల్హర్ (సింగిడి):.PRTUTS రాష్ట్ర నూతన కార్యవర్గంలో మల్హర్ రావు మండలానికి సముచిత స్థానం లభించింది. మండలానికి చెందిన చి. సుధాకర్, జి. తిరుపతిరెడ్డి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా, చి. పూర్ణచందర్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన రాష్ట్ర బాధ్యులకుూఖుూ మల్హర్ రావు మండల శాఖ తరఫున హృదయపూర్వక శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు.రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు చేపట్టిన నాయకులు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, హక్కుల పరిరక్షణకు, విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలని మండల శాఖ ప్రతినిధులు ఆకాంక్షించారు. ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూూఖుూ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు. మల్హర్ రావు మండలం నుంచి ముగ్గురు నాయకులు రాష్ట్ర స్థాయి బాధ్యతలకు ఎన్నిక కావడం మండల ఉపాధ్యాయులకు గర్వకారణమని పేర్కొన్నారు. నూతన కార్యవర్గంలో బాధ్యతలు చేపట్టిన నాయకుల నాయకత్వంలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమై, సంఘం మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ





చింతలమానేపల్లి, (సింగిడి): చిం తలమానేపల్లి మండల కేంద్రంలోని బాలాజీ అనుకోడ రైతు వేదికలో గురువారం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. మండల తహసీల్దార్ గేడం నాగేష్ ఆధ్వర్యంలో నిర్వ హించిన ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుం దని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం, డిప్యూటీ తహసీల్దార్ దౌలత్ ,ఏలూములే మల్లయ్య వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జగ్గసాగర్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు
వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఆటపాటలతో సందడి



మెట్‌పల్లి, (సింగిడి): మెట్‌పల్లి మండల వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జగ్గసాగర్‌లో బతుకమ్మ సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వైద్యాధికారులు డాక్టర్ వొంతెల వాణి రెడ్డి, డాక్టర్ శివాని రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి అలంకరించారు. బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతిపై ప్రేమకు, ఐకమత్యానికి ప్రతీకగా నిలుస్తుందని వైద్యాధికారులు పేర్కొన్నారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఉద్యోగుల మధ్య స్నేహభావాన్ని, ఐక్యతను పెంపొందించడంతో పాటు తెలంగాణ సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు దోహదపడతాయని తెలిపారు. ఈకార్యక్రమంలో సీహెచ్ఓ వెంకటలక్ష్మి, సూపర్‌వైజర్లు రమేష్, జగన్నాథం, సబ్‌సెంటర్ వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi
గురువారం 22-10-2026

మిర్చి రైతులను ఆదుకుంటాం

– ఎమ్మెల్యే హరీష్ బాబు



కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, (సింగిడి): మిర్చి రైతులను అన్నీ విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. శనివారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలకేంద్రంలోని రైతువేదికలో వివిధ గ్రామాల రైతులు, విద్యుత్, వ్యవసాయ, హోర్టికల్చర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. మిర్చి పంట సాగు చేస్తున్న రైతులకు కనీసం 15 గంటల సరఫరా ఇవ్వాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే హరీష్ బాబు కల్పించు కొని ఈ విషయంలో అధికారులు చర్య తీసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ ఉత్తమ్ కు సూచించారు. అదేవిధంగా రైతులకు సబ్సిడీపై డ్రిప్ పరికరాలను అందించాలని హోర్టికల్చర్ అధికారులకు సూచించారు. రైతులు అధైర్య పడద్దని మిర్చి పంటను కాపాడుకునేందుకు అధికారులతో కలిసి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో విద్యుత్ శాఖ ఎస్ సి ఉత్తం, జిల్లా వ్యవసాయ అధికారి వెంకట్, ఉద్యానవ న శాఖ అధికారి నదీమ్, విద్యుత్ శాఖ ఏడి నాగరాజు, కౌటాల తహసిల్దార్ ప్రమోద్ కుమార్, ఎంపీడీవో కోట ప్రసాద్, వివిధ శాఖల అధికారులు రైతులు పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మకు సర్వం సిద్ధం..

వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్న సర్పంచ్ మద్దెల రమాదేవి-సంపత్...



సుల్తానాబాద్, (సింగిడి): పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం రాయికల్ దేవ్‌పల్లి గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేం దుకు ఏర్పాట్లు ము మ్మరంగా సాగు తున్నాయి. గ్రామ సర్పంచ్ మద్దెల రమాదేవి--సంపత్ ఆధ్వర్యంలో పండుగ నిర్వహణకు అవసరమైన వేదికలను సిద్ధం చేస్తున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడు తూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయా లకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకుంటారని తెలిపారు. సద్దుల బతుకమ్మ వేడుకల్లో గ్రామంలోని మహిళలు, చిన్నారులు, అక్కాచెల్లెళ్లు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగను ఆనందోత్సా హాల మధ్య జరుపుకోవాలని పిలుపునిచ్చారు.గ్రామంలో వేడుకలు విజయవంతంగా నిర్వ హించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తు న్నామని పేర్కొన్నారు. మహిళలం దరూ ఐకమ త్యంతో పాల్గొని, తెలంగాణ ఆడపడుచుల ఆత్మీ య తకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకోవాలని సర్పంచ్ కోరారు.



నర్సింగాపూర్‌లో అమ్మకు బోనం

ధర్మారం (సింగిడి): మండలంలోని నర్సింగా పూర్ గ్రామంలో శరణ్ నవరాత్రి ఉత్సవాలను పురస్క రించుకొని రాయల్ రెడ్డి యూత్' ఆధ్వర్యంలో బోనాల కార్యక్రమం నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, సాంస్కృతిక నృత్యాల నడుమ పోచమ్మ తల్లికి ఘనంగా బోనాల సమర్పణ, మొక్కుల చెల్లించూ కున్నారు. గ్రామంలో ఉత్సవాలు ఆధ్యాత్మిక శోభతో, అంగరంగ వైభవంగా సాగినా యి. ఈ ఉత్సవాలలో భాగంగా గ్రామ ప్రజల భాగస్వామ్యంతో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి, తలపై బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా తరలివచ్చి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ వీధులన్నీ డప్పు చప్పుళ్లు, భక్తుల కోలాటాలు, యువత మరియు భక్తుల సాంస్కృతిక నృత్యాలతో మారుమోగాయి. ఈ వేడుకల్లో జోగిని మాతలు, శరణ్ నవరాత్రి దీక్షాపరులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు సమర్పించారు. 'రాయల్ రెడ్డి యూత్' సభ్యుల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందారు. పోచమ్మ తల్లి చల్లని చూపులతో గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని ఈ సందర్భంగా వేడుకున్నారు.

ఎమ్మెల్సీ గెలుపు కోసం కృషి చేయండి..

ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్



డోర్నకల్ /మరిపెడ (సింగిడి): వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సరోత్తం రెడ్డి గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ పిలుపునిచ్చారు. మరిపెడ మండల కేంద్రంలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, పార్టీ శ్రేణుల బాధ్యతలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. పట్టభద్రుల ఓటర్లను నేరుగా కలిసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని సూచించారు. ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుగులోత్ రవి నాయక్, మున్సిపల్ చైర్మన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ కాలం సునీత రవీందర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గునికంటి కమలాకర్, జిల్లా నాయకులు నూకల అభినవ రెడ్డి, సర్పంచులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, యువజన నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భవానీ మాతగా శ్రీ భద్రకాళి అమ్మవారు





హన్మకొండ, (సింగిడి): వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో దేవీశరన్నవ రాత్రులు శుక్రవారంతో ఆరవ రోజుకు చేరుకున్నాయి. ఉదయం 4గంటలకునిత్యాహ్నికం నిర్వర్తించిన పిమ్మట అర్చకులు అమ్మవారిని భవాని మాతగాఅలంకరించ డానికి అంగీకార ప్రార్థన జరిపి సూచన వచ్చిన వెంటనే అమ్మవారినిభవానీ మాతగా అలంకరించి పూజానాధులు నిర్వహించారు. ఎక్కడైతే భోగముందో అక్కడమోక్షముండదు. అమ్మవారు శంకరుడికి భవాని రూపంలో సమస్త భోగాలనిస్తుందని శాస్త్రం చెబుతోంది. క్రమంలోన "గంధవతీ పృథివీ" అని వృథ్వీ తత్వంగంధానికి ఈ గంధోత్సవాన్ని అమ్మవారికి మనం జరుపడం వలన అమ్మవారి భక్తులకుభూములు, వ్యవసాయక భూములు, గృహాలు, సమస్తమైనభూ సంబంధమైన ఆస్తిపాస్తులునమకూరుతాయనే విశ్వాసం. అమ్మవారు అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకి 18 మెట్లపైఒక్కొక్క శక్తి అమ్మవారిని ప్రశ్నిస్తుంటే వాటికి అమ్మవారు నమాధానంచెప్పు ఒకొక్క మెట్టు అధిరోహించింది. ఆ బ్రహ్మాండాన్ని అధిరోహించిన ఆజగన్మాతను దర్శించడం వల్ల సకలైశ్వర్య సంపత్తి, సకల రోగ నివృత్తిరాజద్వారమునందు రాజ కార్యములందు విజయప్రాప్తి కలుగుతుందని ఆలయప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు తెలిపారు. ఉభయదాతలుగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ మాజీ ఎం.ఎల్.ఏ దాస్యం వినయభాస్కర్-రేవతి దంపతులు, కసిరెడ్డి సోమిరెడ్డి కళావతి దంపతులు, మహేశ్వర్‌రెడ్డి-గీతా దంపతులు వేముల రోజ, దంతాల అనీష్యలు వ్యవహరించారు. అదేవిధంగాఅమ్మవారిని వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ కె. వెంకన్నకుటుంబ సమేతంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ ఎన్. ఈ దుర్గాప్రసాద్ తదితరులు దర్శించుకున్నారు. పూజానంతరం మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారిప్రసాదములు అందజేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేకక్యూ లైన్లు ఏర్పాట్లు మరియు ప్రసాద వితరణలు దేవాలయ చైర్మన్ డాక్టర్ శివసుబ్రహ్మణ్యం ధర్మకర్తలు శ్రీ కమటం వేణుగోపాల్ గాధే శ్రవణ్ కుమార్‌రెడ్డి, శ్రీ రమేష్ చంద్ భంగ్, శ్రీ మాడిశెట్టి సతీష్, శ్రీ కారంగులసురేష్ బాబు తదితరులు పర్యవేక్షించారు. నేడు దేవాలయంలో నూతనంగా తయారు చేయించినటువంటి రథమును వరంగల్ పశ్చిమనియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి నీలిమ దంపతులుదేవస్థానమునకు స్వాధీన పరుస్తారు.

ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు: డీసీపీ





నల్లబెల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన అంకిత్ కుమార్ సఖ్వార్

నల్లబెల్లి, (సింగిడి): పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్ కుమార్ సఖ్వార్ ఐపీఎస్ సూచించారు. శుక్రవారం నల్లబెల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ ఫిర్యాదుల వివరాలను పరిశీలించారు. కేసుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

కేసుల పరిష్కారంపై దృష్టి

పెండింగ్ కేసులను త్వరితగతిన,పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీసీపీ ఆదేశించారు. ప్రతి కేసులోనూ సమగ్ర దర్యాప్తు నిర్వహించి, ఎలాంటి జాప్యానికి తావులేకుండా చూడాలన్నారు. కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ బాధితులకు న్యాయం అందేలా విధులు నిర్వర్తించాలనిసూచించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూ పోలీస్‌శాఖపై నమ్మకం పెరిగేలా పనిచేయాలన్నారు. ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో స్పందించాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో శాంతిభద్రతల,పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని తెలిపారు.ఈ తనిఖీలో నర్సంపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి, సీఐ శంకర్రావు, నల్లబెల్లి ఎస్ఐ సాయి ప్రసన్నకుమార్, ఖానాపురం, చిన్నగూడూరు, దుగ్గొండి ఎస్ఐలు, పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కల్వకుంట్ల కుటుంబానికి బానిస కౌశిక్ రెడ్డి

సైకో తీరుమార్చుకోకపోతే గుణపాఠం తప్పదు
హుజరాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం
ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



జమ్మికుంట, (సింగిడి): కల్వకుంట్ల కుటుంబానికి బానిసలా పనిచేస్తూ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రజలను విస్మరించి సైకో తీరును ప్రదర్శిస్తున్నారని తన పద్ధతిని మార్చుకోకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెప్పడంతో పాటు నియోజకవర్గంలో తిరగనివ్వమని ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. జమ్మికుంట పట్టణంలో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో హాజరైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కుటుంబాన్ని అడ్డంగా పెట్టుకుని సెంటిమెంటుతో ప్రజల ఓట్లతో గెలిచిన హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పూర్తిస్థాయిలో అభివృద్ధిని విస్మరించి కల్వకుంట్ల కుటుంబానికి బాడిగార్డా పనిచేస్తున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హుజురాబాద్ లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రవర్తించిన తీరుపై ఎథిక్స్ కమిటీ తగు చర్యలు త్వరలోనే తీసుకోవడం జరుగుతుందని అయినప్పటికీ ఆయన ప్రవర్తనలో మార్పు రాలేదని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం దినదిన సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదల పక్షాన ఉంటే కావాలనే ప్రతిపక్షాలు విమర్శలు చేస్తూ వారి పబ్బం గడుపుకుంటున్నారని విద్యుత్ నిరంతరాయంగా సప్లై అవుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన ప్రతీ కార్యకర్తకు సముచిత స్థానం ఉంటుందని రానున్న రోజుల్లో హుజురాబాద్ను మరింత అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటానని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సలీం పాషా, రాజేశ్వరరావు, సందీప్, రాకేష్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

11వ వార్డులో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

– నీటి సరఫరా మోటార్‌ను ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డి

డోర్నకల్ /మరిపెడ (సింగిడి): మరిపెడ పట్టణంలోని 11వ వార్డు ప్రజల నీటి అవసరాలను తీర్చేందుకు ఏర్పాటు చేసిన మోటార్‌ను శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి ప్రారంభించారు. వార్డులో ప్రజలకు నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ఈ మోటార్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా మున్సిపాలిటీ కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ సత్యవతి యుగంధర్, మాజీ కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు షేక్ తాజోద్దీన్, భాషిపంగు రవికాంత్, కాంగ్రెస్ పార్టీ వార్డు అధ్యక్షుడు భాషిపంగు సైదులు, మున్సిపల్ బాధ్యుడు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

మాస్ లీవ్‌కు సిద్ధమైన ఓ శాఖ ఉద్యోగులు...!

ఆరు నెలల్లో క్రింది స్థాయి సిబ్బందికి పదుల సంఖ్యలో మెమోలు జారీ
రాత్రి పగలు అనకుండా డ్యూటీలు చేయాలి
భరించలేక బదిలీపై వెళ్లిన మహిళా ఉద్యోగి

మహదేవపూర్, (సింగిడి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారంసబ్ డివిజన్ పరిధిలోని ఓ మండలస్థాయి అధికారి వేధింపులు తాళలేక మాస్ లీవ్‌పెట్టేందుకు సిద్ధమ య్యారు ఓ శాఖకు చెందిన ఉద్యోగులు. చిన్న, పెద్ద అనేతేడా లేకుండా ఇబ్బందులకు గురి చేస్తుండటంతో ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలి సింది. ఇటీవలే బదిలీపై వచ్చిన సదరు అధికారి ఆరు నెలల వ్యవధిలో ఆ శాఖపరిధిలో పనిచేసే ఉద్యోగులకు సుమారు ఇరవై నుండి ముప్పై మెమోలు ఇచ్చినట్లుతెలుస్తోంది. అయితే కారణం ఏమి లేకుండానే ఉద్దేశ్యపూర్వకంగా మెమోలు ఇవ్వడంతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నా మంటూ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నట్లు సమాచారం.

– మచ్చుకు కొన్ని..

ఆ శాఖలో పనిచేస్తున్న ఓ క్రింది స్థాయి మహిళా ఉద్యోగికి సెలవు దినాలతోపాటు రాత్రివేళల్లోనూ వర్క్ చేయాలని హుకుం జారీ చేశారు. అయితే తమకుకుటుంబం ఉందని.. సెలవు రోజు పనిచే యడం ఏంటని ప్రశ్నించడంతో ఆ మహిళా ఉద్యోగికి మెమోలు జారీ చేసి భయభ్రాంతులకు గురిచేసినట్లు సమాచారం. దీంతోసదరు ఉద్యోగి డివిజన్ స్థాయి అధికారికి ఫిర్యాదు చేసినప్పటికీ ఆ అధికారితీరులో మార్పురాలేదని.. చేసేదేం లేక చివరకు డివిజన్ కార్యాలయానికిడిప్యూటేషన్ వేయించుకుని వెళ్లినట్లు వినికిడి. ఆ శాఖలో పనిచేస్తున్న మరో ఉద్యోగికి ఇదే అనుభవం ఎదురైనట్లు చెబుతున్నారు. ఆ అధికారి చెప్పిన పనిపైవెళ్లిన ఉద్యోగికి ఎలాంటి కారణం లేకుండా మెమో జారీ చేసినట్లు తెలిసింది. ఆ మెమోకు బదులివ్వకముందే మరో మెమో ఇచ్చి తీవ్ర భయాందోళనలకు గురిచేయడం తోతీవ్రమ నోవేదనకు గురైనట్లు తెలిసింది. ఇదేంటని ప్రశ్నిస్తే.. నన్నేఎదిరిస్తావా అంటూ నువ్వెలా వర్క్ చూస్తావో చూస్తా అంటూ బెదిరింపులకు గురిచేసినట్లు సమాచారం. దీంతో విసిగివేసారిన సదరు ఉద్యోగి జిల్లాఇంచార్జీ మంత్రి వద్ద తన గోడును వెళ్లబోసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. దీంతో కోపోద్రిక్తుడైన సదరు మండలాధికారి నీ అంతు చూస్తానంటూ కార్యాలయ సిబ్బందితో అన్నట్లు బాధితుడు వాపోయాడు.

– ఆఫీసులో ప్రతి ఒక్కరికి చేదు అనుభవాలే..!

ఆ శాఖ కార్యాలయంలో పనిచేసే క్రింది స్థాయి ఉద్యోగి నుండి పైస్థాయి వరకుఅందరు ఆ అధికారి బాధితులే కావడంతో మాస్‌లీవ్‌కు సిద్ధమైనట్లువిశ్వసనీయంగా తెలిసింది. ఇప్పటికే పలుమార్లు సమావేశం నిర్వహించుకున్న ఉద్యోగులు ఆ అధికారి ఇక్కడ ఉంటే తాము పనిచే యలేమంటూ సబ్ కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, కలెక్టర్లకు ఫిర్యాదు చేయనున్నట్లు విశ్వసనీ యంగా తెలిసింది. అయితే ఫిర్యాదు చేయడానికి వెళ్లిన, ఫిర్యాదు చేసినట్లు ఆ అధికారికితెలిసిన చుక్కలు చూపిస్తున్నాడంటూ ఆశాఖ ఉద్యోగులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గతంలో తాను పనిచేసిన దగ్గర కూడ ఇలాంటి వేధింపులు చేయడంతో..అక్కడి ఎమ్మెల్యేకు ఉద్యోగులు ఫిర్యాదు చేయడంతో ఇక్కడికి బదిలీపైవచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివాదాస్పదుడుగా పేరున్న సదరు అధికారి తీరుపై ఉన్నతాధికారులు ఏం చర్యలుతీసుకుంటారో వేచి చూడాల్సిందే.

దుర్గమ్మ సేవలో బిక్కనూర్ సర్పంచ్

రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు





బిక్కనూర్, (సింగిడి): బిక్కనూర్ పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద ప్రతిష్ఠించిన దుర్గమ్మ అమ్మవారిని సర్పంచ్ బాల్యల రేఖ సుదర్శన్ దంపతులు దర్శించుకుని ఓడి బియ్యం సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, మహిళలు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. రైతులు అధిక దిగుబడులు సాధించి సంతోషంగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో క్షేమంగా జీవించాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సురేష్ గౌడ్, గజ్జె వేణు, క్రరోల రాజు తదితరులు పాల్గొన్నారు.

చింతలమనేపల్లిలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

సర్పంచ్ మేకల పోషక్క ఆధ్వర్యంలో వేడుకలు

చింతలమానేపల్లి (సింగిడి): మండల కేంద్రంలోని ఎస్టీ కాలనీలో సద్దుల బతుకమ్మ వేడుకలను మహిళలు, యువతులు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ మేకల పోషక్క ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మలను రంగురంగుల పూలతో అందంగా పేర్చి గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించు కుని మహిళలు, యువతులు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మల చుట్టూ చేరి ఆటపాటలతో సందడి చేశారు. బతుకమ్మ పాటలు పాడుతూ, భాజా భజంత్రీల నడుమ ఉత్సాహంగా నృత్యాలు చేశారు. పసుపు, కుంకుమలతో గౌరమ్మను పూజించి తమ కుటుంబాలు సుఖసంతో షాలతో ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ఏడాదికొకసారి వచ్చే బతుకమ్మ పండుగను మహిళలంతా ఒక్కచోట చేరి ఐకమత్యంతో జరుపుకోవడం వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్యంగా యువతులు చేసిన సంప్రదాయ నృత్యాలు అక్కడికి వచ్చిన వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి. తెలంగాణ



సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో యువతుల పాత్ర ఎంతో కీలకమని పలువురు కొనియాడారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు, మహిళల ఆటపాటలు, యువతుల నృత్యాలతో ఎస్టీ కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ ఆడపడుచుల ఐకమత్యానికి, సాంస్కృతిక వైభవానికి సద్దుల బతుకమ్మ వేడుకలు అద్దం పట్టాయి.

అనాథ విద్యార్థులకు దుస్తులు పంపిణీ



బోధన్ ప్రతినిధి, (సింగిడి): బోధన్ పట్టణంలోని ముగ్గురు అనాథ విద్యార్థులకు న్యాయవాది దత్తాత్రి రావు కులకర్ణి సహకారంతో పిఆర్టియు జిల్లా మహిళా అధ్యక్షురాలు ఇందూరు లలిత చేతుల మీదుగా దుస్తులను పంపిణీ చేశారు. దసరా పండుగ సందర్భంగా తన సొంత ఖర్చులతో దుస్తులను కొనుగోలు చేసి విద్యార్థులకు అందించడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త సనా పటేల్ పాల్గొన్నారు.

మాతృమూర్తి యాదిలో డప్పుల పంపిణీ

ధర్మారం (సింగిడి): మండలంలోని ఖిల వనపర్తి గ్రామంలో ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుడి కందుల సురేష్ మాతృమూర్తి సత్తెమ్మ జ్ఞాపకార్థం ఆ గ్రామంలో ఉన్న 20 మంది డప్పు కళాకారులకు డబ్బులు మరియు డ్రెస్ కోడ్ ను పంపిణీ ఈరోజు చేశాడు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతల ప్రదీప్ రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రూపుల నాయక్ జిల్లా జనరల్ సెక్రెటరీ కొత్త నరసింహులు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొడారి అంజన్న అరిగే లింగయ్య మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు గంధం మల్లయ్య లక్ష్మీనరసింహ స్వామి దేవస్థాన చైర్మన్ పోలు దాసరి సంతోష్, ఆ గ్రామ సర్పంచ్ మోతీ కనకయ్య ఉపసర్పంచ్ మోతే కావ్య వెంకటేష్ మరియు ఆ గ్రామ వార్డు సభ్యులు గ్రామంలోని పెద్దలు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



singidinews@gmail.com

అందుకే ప్రపోజ్ చేయలేదు..

విజయ్ దేవరకొండ

ప్రతి ప్రేమ కథలోనూ ఎప్పటికీ మర్చిపోలేని మధుర జ్ఞాపకాలు ఉంటాయి. విజయ్ దేవరకొండ రష్మికల లవ్ స్టోరీలోనూ ఇలాంటి మూమెంట్స్ ఉన్నాయి. అందులో ఒకదాన్ని ఈ జోడీ తాజాగా పంచుకుంది. వీరిద్దరూ 'కాఫీ విత్ కరణ్' టాక్ షోకు అతిథులుగా వచ్చి ముచ్చటించారు. రష్మికకు ప్రత్యేకంగా ప్రపోజ్ చేద్దామనుకున్నా.. ఆ సమయానికి ఉంగరం దొరక్క ఆగిపోయానని విజయ్ తెలిపారు. నేను సాధారణంగా ఇలాంటి రొమాంటిక్ విషయాలు ఎక్కువగా ప్లాన్ చేయను. కానీ, నా వల్ల రష్మికకు ప్రపోజల్‌కు సంబంధించిన ఓ అందమైన మూమెంట్ లేకుండా పోకూడదనుకున్నా. మా పెళ్లికి ముందు డిసెంబరులో ఇటలీ వెళ్లాం. అక్కడ ప్రపోజ్ చేయాలనుకున్నాను. అయితే, సరైన ఉంగరం దొరకకపోవడంతో కుదర్లేదు

– విజయ్ దేవరకొండ



అయితే, ఉదయ్‌పుర్‌లో జరిగిన పెళ్లి వేడుక తొలి రోజు, సంగీత్ తర్వాత రష్మికకు ప్రపోజ్ చేశానని విజయ్ వెల్లడించారు. స్నేహితులందరినీ అక్కడికి పిలిచి, వారి సమక్షంలో మోకాళ్లపై కూర్చుని పెళ్లి చేసుకోవాలని రష్మికను అడిగినట్లు తెలిపారు. ఆమె జీవితంలో ఎప్పటికీ ఆ క్షణాలు అలా గుర్తుండిపోతాయన్నారు. మీ ఇద్దరిలో ముందుగా పెళ్లి ప్రపోజ్ చేసింది ఎవరని హోస్ట్ అడగ్గా.. రష్మికనే అడిగిందని విజయ్ తెలిపారు. తాను ఓకే చెప్పే లోపు వందసార్లు అడిగిందంటూ సరదాగా బదులిచ్చారు

శనయా @ 'ఆఫ్టర్ డార్క్'

'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్' చిత్రాల ఫ్రాంచైజీని 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్: ఆఫ్టర్ డార్క్' అనే వెబ్ సిరీస్‌గా కొనసాగిస్తున్నట్లు ప్రకటించారు బాలీవుడ్ ప్రముఖ నిర్మాత కరణ్‌జోహార్. హీరోయిన్ శనయా కపూర్ ఇందులో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కరణ్ ఇన్‌స్టా వేదికగా.. "ఈ ఫ్రాంచైజీ 14 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా దాన్ని ముందుకు తీసుకెళ్తూ కొత్త ప్రయాణం ప్రారంభిస్తున్నాం. ఇప్పుడు అది 'ఆఫ్టర్ డార్క్' రూపంలో భయంకరమైనది. సిద్ధంగా ఉండండి!" అనే వ్యాఖ్యల్ని పేర్కొన్నారు. ఈ మేరకు సిరీస్ ఫస్ట్‌లుక్ వీడియోను విడుదల చేశారు. చిత్ర ఫ్రాంచైజీని మరింత డార్క్ ఫార్మాట్‌లో థ్రిల్లర్‌గా ఉత్కంఠభరితమైన కథాంశంతో తీర్చిదిద్దుతున్నట్లు అందులో స్పష్టం చేశారు. ఈ సిరీస్‌ని రీమా మాయ దర్శకత్వంలో ధర్మాటిక్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మిస్తుంది. నవంబరు 13 నుంచి జియోహాట్‌స్టార్‌లో ప్రసారం కానుంది. క్యాంపస్‌లో ర్యాంకుల కోసం పోటీ పడే విద్యార్థులు, మ్యూజికల్ లవ్‌స్టోరీల చుట్టూ తిరిగే కథాంశంతో రూపొందింది 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్' చిత్రాల ఫ్రాంచైజీ. ఇప్పుడు మునుపటి చిత్రాల కంటే భిన్నమైన క్యాంపస్ నేపథ్యంతో.. "సెయింట్ థెరిసాలో ఏదో మారింది.. అది కేవలం బ్యాచ్ మాత్రమే కాదు" అంటూ ఓ థ్రిల్లర్ ప్రపంచాన్ని పరిచయం చేసింది సిరీస్ బృందం. శనయా శక్తిమంతమైన ద్విపాత్రాభినయంతో సరికొత్త అవతారంలో ఇందులో కనిపించనున్నారని తెలిపింది.

ఐదు భాషల్లో 'ది ప్రాంప్ట్ వార్'..

ఆసక్తి పెంచుతున్న టైటిల్ పోస్టర్

భారతీయ పురాణాలు, అంతుచిక్కని రహస్యాలు, ఫ్యూచరిస్టిక్ టెక్నాలజీ కలయికతో సరికొత్త సినిమాటిక్ ప్రపంచాన్ని ఆవిష్కరించేందుకు 'ఆర్విహా క్రియేషన్స్' సిద్ధమవుతోంది. ఈ సంస్థ తన తొలి చిత్రంగా తెరకెక్కిస్తున్న 'ది ప్రాంప్ట్ వార్–రైజ్ ఆఫ్ మహావీర్' టైటిల్‌ను 2026 దసరా పండుగ సందర్భంగా ప్రకటించింది. ఈ సందర్భంగా విడుదల చేసిన టైటిల్ పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత కథా ప్రపంచంతో ఈ సినిమా రూపొందుతుండటం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

పురాణాలు.. మిస్టరీ.. ఏఐ టెక్నాలజీ

'ది ప్రాంప్ట్ వార్–రైజ్ ఆఫ్ మహావీర్' అనే టైటిల్‌తోనే చిత్ర బృందం కథపై ఆసక్తిని రేకెత్తించింది. ఇందులోని 'రైజ్ ఆఫ్ మహావీర్' అనే ఉపశీర్షిక కథలోని కీలక పాత్ర, దాని వెనుక దాగి ఉన్న రహస్యాలపై ఉత్కంఠను పెంచుతోంది. పోస్టర్ ద్వారా సినిమా నేపథ్యంపై సంకేతాలు ఇచ్చింది. భారతీయ పురాణాల్లోని అంశాలను ఆధునిక సాంకేతికతతో మేళవిస్తూ.. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించాలనే లక్ష్యంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఏఐ ఆధారిత కథా ప్రపంచం, ఫ్యూచరిస్టిక్ అంశాలు, మైథలాజికల్ మిస్టరీ కలయికతో ఈ సినిమా ఎలా ఉండబోతోందన్న ఆసక్తి నెలకొంది.



సినిమా సింగిడి
Cinma Singidi

గురువారం
22-10-2026

ఆయన సపోర్ట్ వల్లే

ఈ స్థాయికి...

ఎప్పటికీ రుణపడి ఉంటా: మమితా బైజు



మలయాళ బ్యూటీ మమితా బైజు, నివిన్ పౌలీ, కాంబినేషన్‌లో వచ్చిన 'బెత్లెహెం కుటుంబ యూనిట్' బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి వసూళ్లతో ఘనవిజయాన్ని అందుకుంది. కేవలం రూ. 25 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం, ఓనం కానుకగా విడుదలై ప్రపంచవ్యాప్తంగా రూ. 325 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. ఈ మూవీ అద్భుత విజయం సాధించిన సందర్భంగా సక్సెస్ మీట్ నిర్వహించగా.. ఇందులో హీరోయిన్ మమితా బైజు పాల్గొని ఎమోషనల్ కామెంట్స్ చేశారు. తన సినీ ప్రయాణంలో ప్రధాన పాత్రలు చేయగలననే నమ్మకం తనకే లేని సమయంలో, డైరెక్టర్ గిరీష్ ఏడీ తనపై ఎంతో నమ్మకం ఉంచారని చెప్పారు. ఏమీ తెలియని ఒక సామాన్య వ్యక్తికి ఎవరైనా అండగా నిలబడి ప్రోత్సహిస్తే ఆ వ్యక్తికి సమాజంలో ఒక ప్రత్యేక గౌరవం, విలువ లభిస్తాయని.. గిరీష్ విషయంలో తనకు సరిగ్గా అలాగే అనిపించిందని తెలిపారు. 'ప్రేమలు' చిత్రం నుంచి 'బెత్లెహెం కుటుంబ యూనిట్' వరకు తనను నమ్మి అవకాశాలు ఇచ్చినందుకు గిరీష్‌కి తాను ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని స్పష్టం చేశారు.

నయనతార 'మహాశక్తి' ట్రైలర్ రిలీజ్



నయనతార ప్రధాన పాత్రలో రూపొందిన చిత్రం 'మూకుత్తి అమ్మన్ 2' తెలుగులో 'మహాశక్తి'. సుందర్.సి తెరకెక్కించిన ఈ సినిమా నవంబర్ 6న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది అమ్మవారి పాత్రలో నయనతార గూస్‌బంప్స్ తెప్పిస్తున్నారు.

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala Mohan, PRGI.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737